కొండపల్లి ప్రచురణలు

తల్లిప్రేమ

మునిమాణిక్యం నరసింహారావు

వెల
1-50

తల్లి ప్రేమ

[ఇతర కథలు]

★

రచయిత

శ్రీ మునిమాణిక్యం నరసింహారావు

★

పబ్లిషర్సు:

శ్రీ సత్యనారాయణ బుక్ డిపో.,

బుక్ సెల్లర్సు అండ్ పబ్లిషర్సు,

రాజమండ్రి.

[వెల రు 1-50

వి ష య సూ చి క

తల్లిప్రాణం

పెళ్ళీడు వచ్చిన పిల్ల విషయంలో — ఆడవలసిన అబద్ధాలన్నీ ఆడినా మా సుశీ వివాహం కాలేదు. సంవత్స రంనుంచి ప్రయత్నం చేసినా కూడా.

దానికి పెండ్లి కాకపోవడానికి కారణం అది నల్లగా ఉండట మేనని ఎవరైనా సూచాయగా అన్నారా మా ఆవిడ ఎగిరిపడేది.

"మా అమ్మాయి కేమండి? బంగారపు తల్లి! నల్ల రూపు అయితేమట్టుకు ఏం? ఎఱ్ఱగా బుర్రగా ఉండగానే సరా! ఏమిటి? ముఖాన కళాకాంతులు ఉండవద్దూ! మా చిట్టితల్లిని చూడండి, మరి వాళ్ళ అమ్మాయిని చూడండి. మీకే తెలుస్తుంది! అదీ కాక......

మా అమ్మాయి పనిపాటలు చక్కగా చేస్తుంది. పెద్దా చిన్నా వ్యత్యాసం తెలుసు. మాట మర్యాద తెలుసు ఇంకేమి కావాలండీ ఆడదానికి."

ఇల్లాగ మా ఆవిడ అనేది.

నిజం సంగతి ఏమిటీ అంటే మా సుశీ ఇవతల చెంబు అవతల పెట్టదు. అదేమిటే అంటే గయ్యిమని లేస్తుంది కూడాను. తల్లితో ఎప్పుడూ పోట్లాడుతూనే ఉంటుంది.

మా కాంతం ఇతరులతో చెప్పటం మటుకు, "మా పిల్లకు నోట్లో నాలిక లేదమ్మా! ఎవ్వరేమన్నా నోరెత్తదు ఎట్లా బ్రదుకుతుందో" అని చెపుతుంది.

పిల్లకు పెండ్లి కానటానికి ఆవిడ చేయవలసిన ప్రయత్నము అంతా చేస్తునే ఉంది. మా బంధుగులు అందరూ కూడా "ఆ పిల్లకేం నిక్షేపంలాంటి పిల్ల. బుద్ధిమంతురాలు కుటుంబం కూడా చాలా సాంప్రదాయంగల కుటుంబం" అని అనుకొంటున్నారు.

ఇల్లాగ మంచిపేరు వచ్చినా మా అమ్మాయికి క్రిందటి సంవత్సరం ఎంత ప్రయత్నించినా పెండ్లికాలేదు. దానికి కొన్ని కారణాలు ఉన్నాయి.

౨

మొదటి సంగతి ఏమిటీ అంటే పిల్లకు చాలా చిన్న వయస్సు అనీ యింకా రెండు మూడేండ్లు ఉంచుదామనీ నేను అనుకొని గట్టిప్రయత్నం చేయలేదు. ఆవిడకేమో దానికి ఈ చిన్నతనంలోనే మూడు ముళ్ళు వేయిద్దామని పట్టుదల......ఈ విషయంలో మా యిద్దరికీ చాలా ఘర్షణలు జరిగినవి.

పిల్ల పెద్దదయితే తనకు అచ్చట్లు ముచ్చట్లు జరగవని ఆవిడ అంటుంది. నీ సరదాలు తీరేందుకు కాదు పిల్లకు పెండ్లి చేయటం, అని నేను అంటాను. దానిమీద పోట్లాట.

అసలు ఆవిడ పట్టుదల ఏమిటి అంటే, తనకు పన్నెండో ఏట పెండ్లి అయిందట. అందుకని తన కూతురు వివాహం కూడ పన్నెండో ఏటనే జరగాలంటుంది. ఇది ఆవిడ మొండి వాదన, నేను ఒప్పుకోలేదు. పోట్లాట.

"బంతులాడించటం. గంధంపూయించటం ఈ సరదా లన్నీ, చిన్నతనంలో జరిగితే బాగుంటాయి గాని, పెద్ద అయిన తరువాత ఏమి బాగుంటయి అండీ?" అన్నది ఆవిడ.

"ఏమి? ఎందుకు బాగుండదూ, పెద్దవాళ్ళు మట్టుకు గంధం పూయకూడదా?" అన్నాను నేను.

కాంతం పెదవి విరిచి "ఎబ్బే! ఎద్దుల్లాగ ఉండీ, గంధాలు పూసుకోవటం ఏం బాగుంటుందండీ?" అన్నది.

తరువాత కొంచ్ం సిగ్గుపడుతూ తలవంచుకొని అన్నది "మన పెండ్లికి నేను పన్నెండు ఏండ్లదాన్ని, మిరాకూం చిన్న తనమే. నా బుగ్గమీద బూరు గంధం చిలకరించారు. ఎంత ముచ్చటగా ఉంది. జ్ఞాపకం లేదూ?"

"లేకేమి? అదీ జ్ఞాపకంఉంది. నీవు గంధం పూస్తూ పూస్తూ నా చెంప మీద చిటుక్కు— మనిపించటమూ జ్ఞాపకం ఉంది!" అన్నాను నేను కొస్త ఎత్తిపొడుస్తూ.

"అల్లాగ చేయబట్టె మీరు ఈమాత్రం అయినా చెప్పు చేతలలో ఉన్నారు" అన్నది ఆవిడ.

"అమ్మాయి చేతకూడా అల్లాగ చేయిద్దామనా నీ ఉద్దేశం?"

"అల్లానే అనుకోండి పోనీ, అందులో తప్పేమి వుందీ" అని ఆవిడ నవ్వింది.

ఆవిడ ఎన్ని చెప్పినా నాకుమాటుకు పిల్లకు అంత చిన్న తనంలో వివాహంచెయ్యటం బొత్తిగా యిష్టం లేకపోయింది. అందుకనే మరో రోజున గట్టిగా వాదించాను ఆవిడతో. మొగుడంటే ఏమిటో తెలియని వయస్సులో పెండ్లి చేయ కూడదని.

ఆ మాటమీద ఆవిడ ఎత్తుకొన్నది "ఏమిటండీ తెలిసేది? అంత తెలిసేదాకా వస్తే దానికి పెండ్లి మీరు చేసే దేమిటి! అదే చేసుకొంటుంది" అన్నది ఆవిడ.

"పోనీ! చేసుకోనీ, అందులో తప్పు ఏమీ లేదు" అన్నాను నేను.

కాంతం వింతగాచూస్తూ, "అదేమిటండీ అల్లా అంటారూ? మనమేమన్నా కిరస్తానివాళ్ళమా ఇష్టం వచ్చిన వాణ్ణి చేసుకోనియ్యటానికి! ఛీ ఛీ అల్లా ఎప్పుడూ అన బోకండి" అని విసుక్కుంది.

నేనూ విసుక్కున్నాను. పెండ్లి అంటే ఏమిటో, మొగు డంటే ఏమిటో, తెలియనక్కరలేదా?" అని.

కాంతం కచ్చితంగా చెప్పేసింది. "ఏమీ తెలియ నక్కరలేదు. నాకు తెలిసింది మొగుడు అంటే ఏమిటో!

ఏమిటండీ మీ దంతానూ! మొగుడంటే తెలియటం ఏమిటి నాబొంద! తెలియక ఏం జేస్తుందండీ? మెళ్ళో పుస్తె గట్టిన వాడు మొగుడు! అవ్వ! ఆ సంగతి తెలియక పోతుందనే మీ భయం?"

నాకు కాస్త చిరాకు వేసింది. "పుస్తె గట్టిన వాడు మొగుడై కూర్చుంటాడని నాకూ తెలుసు. కాస్త ప్రేమలు ఏర్పడ్డ తరువాత మొగుడు కావటం మంచిది. అదీ నేను అనటం!" అన్నాను.

ఈ మాటలు విని కాంతం పకపకా నవ్వి అన్నది. నేను నట్టి తెలివితక్కువ మాట అన్నట్లుగా చూస్తూ; "మొగుణ్ణి ప్రేమించాలని ఆడదానికి ఒకరు చెప్పాలా? చూడండి. అది ఎవ్వరూ చెప్పనక్కర లేదు. అదే పుట్టుకొస్తుంది, బావిలో జల ఊరుతుంది చూశారూ అల్లాగ ఆడదాని హృదయంలో జలలు పుడతయి."

ఈ మొండివాదన చూచి వళ్ళు మండి నే నన్నాను "అది సరే. ముందుగా ప్రేమించి, ప్రేమించినవాణ్ణి చేసుకోవాలె. అది సవైన పద్ధతి."

కాంతం అసహ్యించుకొని "ఛీ ఛీ పెండ్లికాకపూర్వం ఎవ్వరినీ ప్రేమించకూడదండీ. అది మహాపాపం. నా పిల్ల అల్లాంటి అభాగ్యపు పని ఎప్పుడూ చెయ్యదు, తెలిసిందాండీ" అని స్పష్టంగా చెప్పింది.

ఇల్లాగ వాదనలు చాలా సార్లు జరిగిన తరువాత. ఇక ఆవిడ పోరు పడలేక పిల్లకు పన్నెండో ఏటే పెండ్లి చేద్దామని నిశ్చయించాను.

3

ఈ నిశ్చయానికి వచ్చినతరువాతకూడా పెండ్లికాక పోవటానికి కారణం నా అశ్రద్ధ. మా చెల్లెలు కొడుక్కు ఇద్దామని నేను మొదటినుంచీ అనుకొంటున్నాను. అయిన సంబంధం అనీ, ఊళ్ళో సంబంధం అనీ ఆశపడ్డాను. మా చెల్లెలు మా వూళ్ళోనే ఇంకొక పేటలో ఉంది. వాళ్ళకు పెద్ద ఆస్తిపాస్తులు లేకపోయినా తిండికి లోటులేకుండా జరిగే ఏర్పాటు ఉంది. మా మేనల్లుడు పేరు శ్రీనివాసరావు. 'సీను' అని పిలుస్తాము. మా అమ్మాయికంటే ఓ చాలు మెలుగు. స్కూలుఫైనలు చదువుతున్నాడు. పిల్లకు ఈడువచ్చిన తరువాత మా సీనుకు ఇచ్చి ముడిపెడదామని అనుకొని వేరే సంబంధం విచారించకుండా ధైర్యంగా ఊరుకొన్నాను.

అదీకాక ఈ విషయం మా బావగారితో అప్పుడప్పుడు హెచ్చరిస్తూ ఉండేవాడిని. ఆయన అనేవాడు "నాదేమి ఉందోయి, మీ చెల్లెలు యిష్టం. మీ ఇష్టం. నేను కాదంటానా?" అని.

నాకూ ధైర్యంగా ఉంటూ ఉండేది. మా చెల్లెలు అభ్యంతర పెడుతుందని నేను కలలోనైనా అనుకోలేదు.

ఒకరోజున మాటల సందర్భంలో కాంతం "అమ్మాయిని సీనుకు ఇయ్యటం పడదండీ. ఎందుకూ లేనిపోని ఆశలు పెట్టుకొని కూర్చోటం! ఎక్కడైనా చూడండి" అని చెప్పేదాకా నాకు ఈ విషయం తెలియదు.

"మా చెల్లెలు సుశీని తన కొడుక్కు ఎందుకు చేసుకోదు? మనమీద ఏమన్నా కోపం వచ్చిందా?" అని అడిగాను ఆ మాటమీద.

కాంతం చెప్పుకొచ్చింది "మా సుశీ బారసాల రోజునే ఆవిడ అన్నదట మా చెల్లెలుతో 'వదినా' దీనిని నా కొడుక్కు చేసుకోవమ్మా" అని.

మా చెల్లెలు ఎందుకన్నదో మరి. మూతీ ముక్కూ విరిచి అన్నదట. "నేను చేసుకోను వదినా, చేసుకోక చేసుకోక ఈ నల్లపిల్లనే చేసుకోవాలా" అని.

నీ కూతురు నల్లనిది అంటే మా కాంతానికి చాలా కోపం. అందుచేత ఆవిడకు మా చెల్లెలుపై కోపంవచ్చింది. వచ్చి అన్నదట, "నా పిల్ల నల్లనిదా? నీ కొడుకే మహా ఎఱ్ఱటివాడు కామాలు! అంత నల్లని పిల్లను నీవు చేసుకోనే వద్దులే. నా కూతురుకు మొగుడు దొరక్క పోయినపుడు చూద్దాం లే" అని.

ఈ మాటలు కాస్తకష్టంగానే అన్నది. మా చెల్లెలూ ఏదో అన్నది. మొత్తంమీద ఇద్దరూ మాటామాటా అనుకొన్నారు. ఇది ఎప్పుడో జరిగినసంగతి. అయినా కాంతం ఈ

విషయం మరిచిపోలేదు దాని తరువాతకూడ మా కాంతం సుశీని నీనుకు చేసుకోవదిగా అని అంటే, మా చెల్లెలు ఏ మంత ఉత్సాహము కనపరచక ఊరుకున్నదట.

చివరకు మా ఆవిడ ఒక్కమాట అన్నది; "అంత యిష్టం లేకపోతే పోనీయండి. యేంచేస్తాం. కాళ్ళు వేళ్ళుబడి చేసుకోమని బ్రతిమిలాడుతారామా ఏమిటి! దానికి ఎక్కడ రాసి పెట్టి ఉందో అక్కడే అవుతుంది."

ఈమాటలు వినేసరికి నాగుండెల్లో రాయి పడ్డది. పరాయిసంబంధం నేనేమి తేగలను?

చూడు కాంతం. పన్నెండు ఏండ్లనాటి విషయం మనస్సులో ఉంచుకొని నిక్షేపంలాంటి మేనరికం వదులు కోటం నాకేమీ ఇష్టంలేదు. పరాయి సంబంధాలు ఊరికే వస్తాయా? వేలకు వేలు పోయ్యాలె. ఎక్కడనుంచి తెచ్చేది?" అని అడిగాను.

"మీరే చేస్తున్నారా పెండ్లి? ఎవ్వరూ చెయ్యటం లేదా? ఎక్కడ నుంచి తెచ్చేదంటే నేనం చెప్పేదండీ రంగయ్యగారూ మొన్న వాళ్ళ అమ్మాయికి రెండు వేలుకట్నం యిచ్చి పెండ్లి చేశాడా లేదా?" అన్నది కాంతం కోపంగా.

"రంగయ్య ఇల్లు అమ్మి చేశాడు" అన్నాను నేను.

"మీరుకూడా ఏదైన అమ్మండి" అన్నది కాంతం విసుగ్గా.

"ఆ, అల్లాగే పిల్లకు మంచి సంబంధం కావాలే. కట్నం ఇస్తేనేగాని మంచి సంబంధాలు రావు. కట్నం ఇయ్యటానికి

డబ్బు లేకపోతే ఏదైనా అమ్మటానికి నేను సిద్ధంగా ఉన్నాను కాని, ఏది అమ్మాలో తెలియటంలేదు. చూస్తూ, చూస్తూ మనం అద్దెకున్న, ఈ పరాయికొంప ఎల్లా అమ్మేదా అని చూస్తున్నాను'' అన్నాను నేను.

''ఏమి అమ్ముతావో మీ ఇష్టం. పిల్లకు వచ్చే వైశాఖమాసంలో వివాహం చెయ్యక తప్పదు'' అని కచ్చితంగా చెప్పి వెళ్ళిపోయింది.

౪

నా స్థితిలో ఉన్న గృహస్థు, మేనరికం వదులుకొని కట్నాలుపోసి, పరాయిసంబంధం తేవాలని అనుకోటం చాలా తెలివితక్కువపని. అయినా నేను కూడా ప్రయత్నంచేసి చూద్దామని మా చెల్లెలు దగ్గర సుశీ వివాహ విషయం ఎత్తాను. మా కాంతం అన్నమాట నిజమే; మా చెల్లెలు ఉత్సాహంగా మాట్లాడలేదు.

''ఎందుకులే అన్నయ్యా, అందరికీ ఇష్టమై, మనస్సులు కలిస్తే చేసుకోవాలె కాని ఒకరికి ఇష్టమూ; ఇంకొకరికి అయిష్టమూ అయితే ఎందుకు చెప్పు'' అన్నది.

కాంతానిది ఏమీ లేదనీ, దాని మాటలు పట్టుకొని కూర్చోకూడదనీ, అది వట్టి తెలివితక్కువ మనిషి అనీ ఇల్లాగ ఏవో చెప్పానుగాని మా చెల్లెలుకు ఏమీ తృప్తికలుగలేదు.

దానితరువాత వాళ్ళూ, వీళ్ళూ చెప్పిన సంగతుల వల్ల అసలువిషయం బైటపడ్డది.

మాట సామెతగా సుశీని నీ కొడుక్కు చేసుకో వదినా అని అంటుంది గాని గట్టిగా అనలేదు అని మా చెల్లెలుకు కాంతంపైన కోపం.

"ఇంకా ఏం గట్టిగా అనేది, నా బొంద. ఎన్నిసార్లు అడిగినా, 'ఆఁ మీ సుశీని మా అబ్బాయికి ఎందుకిస్తావు లేవమ్మా? దాని కే జమీందారు వస్తాడో, అనో అమ్మా, సుశీని చేసుకొంటే అది సరిగ్గా కాపరం చేస్తుందమ్మా, మొగుణ్ణి వంగదీసి కొట్టేలాగుంది' అనో అంటుంది గాని సరే అని నోటితో అనదండి! నేను ఏం జేసేదమ్మా!" అని కాంతం అంటుంది.

ఇంతకూ కాంతం, మా చెల్లెలుగారి యింటికి వెళ్ళి కూర్చొని, వదినా నా కూతుర్ని నీ కొడుక్కు చేసుకోమని అడిగి, కట్నం ఇంత యిస్తాము. ఇల్లాంటి లాంఛనాలు జరుపుతాము అని చెప్పలేదని మా చెల్లెలుకు కోపం.

"పరాయి సంబంధం కాదాయె. కట్నం కానుకా ఇంత అని ముందుగా నిర్ణయించుకొంటానికి! మా సరదా కొద్దీ మేము ఇస్తాము. అన్నీ చెప్పాలా ఏమిటి, ఈవిడగారికి ముందుగా. అసలు చేసుకొంటాననే అనదాయె ఏమిటా శాణీతనము" అంటుంది మా కాంతం.

ఇవన్నీ మనస్సులో ఆలోచనలే. బయటికి ఏమీ అనుకోలేదు. కాని కోపాలు తాపాలు లోపల లోపలే వృద్ధి పొందినవి.

చివరకు ఎంతవరకు వచ్చింది అంటే, "మా వదిన బ్రతిమిలాడితేగాని నేను సుశీని నా కొడుక్కు చేసుకోను. ఎందుకు బ్రతిమిలాడదో చూస్తాను. అంతగా బ్రతిమిలాడక పోతే పోనీ' నా కొడుక్కు పెండ్లి కాక పోతుందా?" అని అనుకొన్నది మా చెల్లెలు.

"ఊళ్ళో సంబంధం గదా, ఏదో మేనరికం అని చూస్తుంటే, ఈవిడగారు నిచ్చెనెక్కి కూర్చున్నదే!"

నేను వెళ్ళి బ్రతిమిలాడి, నా కూతుర్ని చేసుకో తల్లీ అని ప్రాధేయపడాల కామాలు. నేనేమీ పడను. నా కూతురుకు పెండ్లి కాకపోతే చూద్దాములే." ఇల్లాగ కాంతం అనుకున్నది.

౩

సుశీకి సంబంధాలు విచారించడం సాగించాము. బాపట్లలో ఒక పిల్లవాణ్ణి చూచి వచ్చాను. పిల్లవాడు అందంగానే ఉన్నాడు. అయితే చదువూ లేదు, ఆస్తీ లేదు. కట్నంమట్టుకు వెయ్యి నూటపదహార్లు కావాలన్నారు. ఈ సంబంధం విషయమై కాంతం విని తల తిప్పి 'ఊఁహూ, ఇది లాభం లేదు. ఇంకెక్కడైనా చూడండి' అన్నది.

తరువాత రాజమండ్రిలో ఒక సంబంధం కనబడ్డది ఆ కుర్రవాడు స్కూలు ఫైనలు చదువుతున్నాడు. ఇక మరేమీ ఆస్తిలేదు. నల్లగా ఉన్నాడు. రెండువేలకు పై

మాంటే! రెండువేల కట్నం ఎక్కడనుంచి తెచ్చి ఇస్తాము! అయినా ఏంజూచి ఇస్తాము!

ఎన్నిచోట్ల చూచినా మా మనస్సుకు నచ్చిన సంబంధము కనపడలేదు. కాస్త ఆస్తి ఉన్నవాడు మూడువేలిస్తావా నాలుగువేలు ఇస్తావా? అని అడగడం సాగించాడు. ఆస్తి ఉంటే చదువు ఉండదు. చదువు ఉంటే ఆస్తి ఉండదు. ఈ రెండు ఉంటే రూపము ఉండదు.

ఇంతవరకూ ఇందులో ఒక్కడూ మా సీను కంటె మెఱుగు కాదు; పైగా కట్నాలు కానుకలు జోరెక్కు. సంబంధాలు వెతకలేక విసుకెత్తింది. ఒకరోజున కాంతంతో అన్నాను: "చూశావా కాంతం, ఎన్ని విధాల చూచినా మన సీను సంబంధమే నయం అనిపిస్తున్నది!"

"నిజమే. ఆ సంగతీ నేను గ్రహిస్తూనే ఉన్నాను. అయితే ఏంజేస్తాం. వదిన అల్లాగ బిగిసి కూర్చుంటే!"

"కాంతం, నేను ఒకమాట చెబుతాను విను. మనం ఆడపిల్ల గలవాళ్ళం. కాస్త తగ్గే ఉండాలె!"

"అయితే ఏంజేయమంటారు?"

"మా చెల్లెలునే బ్రతిమిలాడు."

"నాకేం ఖర్మం అండీ, కాళ్ళావేళ్ళాబడి బ్రతిమిలాడిందాకా?" అన్నది కాంతం.

సంబంధాలు దొరక్క, నేను పడుతూ ఉన్న అవస్థలన్నీ చూస్తూకూడా కాంతం ఇంకా అల్లాగ మాట్లాడటం

చూస్తే నాకు ఒళ్ళు మండిపోయింది. అందుకని అన్నాను. "నీవు బ్రతిమిలాడక తప్పదు"—అని.

"ఏం - ఎందుకుతప్పదూ?"—

"ఎందుకు తప్పదా?.........ఆడపిల్లను కన్నావు కాబట్టి!"

"నేను వెళ్ళి ఇక ఆవిడను బ్రతిమిలాడ నండీ—ఏమన్నా కానీ"—అన్నది కాంతం కోపంగా.

నేనూ కోపంగా అన్నాను. "ఎవరికోసం బ్రతిమిలాడు తావే! నీ కూతురికోసం! చూస్తానుగా, నీవే బ్రతిమాలు తావో నీ తల్లో జేజెమ్మో బ్రతిమిలాడుతుందో!" అని ఇల్లాగ నాలుగు మాటలూ విసురుగా అని ఉత్తరీయం ఝాడించి పైన వేసుకొని బైటకు వెళ్ళిపోయాను.

౬

నేను సరాయిగా సంబంధాలు చూస్తున్నట్లు తెలిసి, మా చెల్లెలుకూడా తన కొడుక్కి ఆ నెలలోనే పెండ్లి చేయాలని గట్టి ప్రయత్నాలు సాగించింది. మా సుశీకి పెళ్ళి అయ్యే రోజునే తన కొడుక్కి పెండ్లి కావాలట!

"నా కొడుక్కి పెండ్లి కాదనే అనుకొంటె కాబోలు మా వదిన! చూస్తాను ఎందుకు కాదో!" ఇల్లాగ పంతాలు పలికిందట మా చెల్లెలు.

ఈ మాట నాకు చెపుతూ కాంతం అన్నది. "ఇదెక్కడి గోలండీ. నేను తన కొడుక్కి పెండ్లి కాదన్నానా?

తనే ... నా కూతురును ... నల్లపిల్లని పేరుపెట్టి. చేసుకో నన్నది కాని! వదిన ఇల్లాగ అనడం ఏమన్నా బాగుందండీ. మీరే చెప్పండి!''

ఇల్లా అని కాంతం విచారంగా చూచింది.

కాంతం మనస్సు కష్టపడ్డట్లు తెలుస్తునే ఉంది. నాకూ విచారం కలిగింది. కాని ఏమి చేసేది మాట్లాడక ఊరుకొన్నాను.

ఆ తరువాత మా చెల్లెలు తన కుమారుడికి గొప్ప సంబంధం తేవాలని ప్రయత్నాలు చేస్తున్నట్లు కబుర్లువస్తూ ఉండేవి. కట్నాలు కూడా యిస్తామని కొందరు వస్తున్నట్లు తెలిసింది. పోనీ మనదేమి పోయింది అని అనుకొన్నాము. కాని మాకు మనస్సులో ఏదో కష్టంగా ఉండేది. కుర్రవాడు చదివింది స్కూలుఫైనలేగదా ఏంజూచి యిస్తున్నారు ఇంత డబ్బు! అని మా సందేహం.

అసలు వాళ్ళు ఎందుకు రావాలె? వారు రాకపోయి నట్లయితే మా చెల్లెలు మా పిల్లను చేసుకొంటానికే ఆశ పడేది. వీళ్ళంతా రాబట్టే మా చెల్లెలుకు వీళ్లు పిల్లను యిస్తే ఎంత, ఇయ్యకపోతే ఎంత అనే ధీమా కలిగింది. ఇల్లా అను కొని మేము ఆ వచ్చినవాళ్ళను అసహ్యించుకోటం మొదలు పెట్టాము.

''వస్తారం—యిక్కడ ఏదో ఉందని వస్తారు. అసలు సంగతి తెలిస్తే వచ్చినదారినే వెడతారు'' అని కాంతం

తనలో తాను అనుకొని తృప్తిపడుతూ ఉండేది. అంతేకాని నిజంగా లగ్నాలు పెట్టుకోపోతున్నారనీ, కొంప లంటుకు పోతున్నాయి అనీ మాచు నాంచారమ్మగారు చెప్పిందాకా తెలియనే తెలియదు.

ఆవిడ వచ్చి "కాంతమ్మ, కాంతమ్మ మీావదిన భలే లాటుకొడుతున్నదే. మీా మేనల్లుడికి కర్నూలు నుంచి ఓ మంచి సంబంధం వచ్చింది. వెయ్యినూటపదహార్లు కట్నంట ఆడుబొడుచుకు ఇవ్వాలిసింది, ఇతర లాంఛనాలు కాక..." అని చెప్పింది.

ఈ మాట వినేసరికి కాంతం గుండె దడ దడ కొట్టుకొన్నది. ఈ కుర్రవాడిదగ్గర ఏదో ఆకర్షణ లేకపోతే సై వాళ్ళు వచ్చి ఇంత డబ్బు ఎందుకిస్తానంటారు ?

చూస్తూ ఉండగానే పీడిని గద్ద తన్నుకు పోయినట్లు ఎవరో తన్నుకుపోయేలా గున్నారు. అయిన సంబంధాన్ని ఇల్లాగ పరాయివాళ్ళకు అప్పజెప్పటం ఏమంత మంచిపని కాదని కాంతానికి తోచింది.

కాంతం నాంచారమ్మతో అన్నది. "సంతోషమే గాని అక్కయ్యా, అయితే ఏంజూచి ఇస్తున్నారమ్మా ఇంత లేసి కట్నాలు ?"

"ఏంచూడాలే కాంతం! ఈ కాలంలో మొగపిల్లలు దొడుకుతున్నారా అసలు. ఇంత వెర్రి బాగుల దానివేమే అమ్మాయి నీవు! అందులో కాస్త చదువుకూడ ఉందాయె,

ఇంకేం కావాలె అమ్మాయి. పెయ్యేమిలేవ్! ఎంతైనా యిస్తారనుకో''—అన్నది నాంచారమ్మగారు.

ఈ మాటలు కాంతం మనస్సుపైన పనిచేసినయి. తనకేదో అన్యాయం జరుగుతున్నట్టు తోచింది. ఇంకో నిము షము ఆలోచించినమీదట ఆమెకు తోచింది. తనే తనకు అన్యాయం చేసుకొంటున్నట్టు.

ఇంతలోకే నాంచారమ్మ అన్నది! అమ్మాయి నిన్ను ఒకమాట అడుగుతాను. ఏమీ అనుకోకేం అమ్మా. నీకూతు రుండగా ఖిూ వదిన ఇల్లాగ పరాయిసంబంధం చూస్తున్నది ఎందుచేతనే అమ్మాయి?...నీవు మటుకు చూస్తూ ఊరు కుంటావేం, అయినసంబంధం అల్లాగ పోతుంటే.?''

కాస్త విచారంగా అన్నది. ''అవును అక్కయ్యా, అయినసంబంధమే. అయితేమటుకు కాళ్ళా, వేళ్ళా పడి బ్రతిమిలాడిందాకా మనకేంఖర్మం చెప్పు అక్కయ్యా. ఒకటి రెండుసార్లు అడిగితే ఏదో ముభావంగా ఊరుకొన్నది. 'సరే' అని నోటితో అనదమ్మా, ఆవిడ నోటి ముత్యాలన్ని రాలి పోతయ్యేనో ఏమిటో మరి!''

''నీవు గట్టిగా అడగలేదటగా?'' అన్నది నాంచా రమ్మ ''ఇంకేం గట్టమ్మా! ఇంతకంటె ఏం గట్టిగా అడుగు తారమ్మా?'' అన్నది కాంతం.

''అడిగాడే అమ్మాయ్. నేనొక మాట చెపుతాను విను. మనవాళ్ళను నలుగురినీ పిలిచి కూర్చోబెట్టి అందరి

ఎదుటా అడుగు, చేసుకొంటావా అని, అప్పటికీ బెట్టు చేస్తుందీ పోనీ నలుగురూ దాన్నే అంటారు. ఎందుకు చెపుతున్నానో విను అమ్మాయి, మీ మేనల్లుడు ముఖాన రాజాకళ ఉందే కాంతమ్మా! నీవు కనిపెట్టావో లేదో — వాడు అదృష్టవంతుడు. సుశీని వాడికిస్తే ఇద్దరూ ఈడు జోడుగా చక్కగా ఉంటారు. అంతగా అయితే మీ వదినను బ్రతిమిలాడినా తప్పు లేదే అమ్మాయి!" అని నాంచారమ్మ సలహా చెప్పింది.

"ఆ, ఈవిడగారిని బ్రతిమిలాడుతానా ఏమిటీ! పోనిద్దూ ఈమాత్రం సంబంధం దొరక్క పోతుందా ఏమిటీ" అన్నది. కాంతం బింకాన్ని వదలకుండా, అన్నదే కాని కాంతానికి మనస్సులో చాలా కష్టంగా ఉంది, వదినతో సంబంధం పోతున్నదే అని?

పరాయిగా యిస్తే ఎన్ని తిప్పలు! వాళ్లు ఎటువంటి వాళ్ళు వస్తారో! వదినా మరదళ్ళు చిన్నప్పటినుంచీ కూడా ఎంతో స్నేహంగా ఉంటూ ఉండేవాళ్లు. పిల్లవాడికి కాస్తో కూస్తో ఆస్తి ఉంది. అన్నివిధాల అనుకూలమైన ఈ సంబంధం పరాయిగా పోతుంటే చూస్తూ ఊరుకోటం ఎల్లాగా అని కాంతం చాలా పరితపించింది కాని వదినెను బ్రతిమిలాడటానికి ఆమె మనస్సు ఒప్పుకోలేదు.

నేను సంబంధాలకోసం అన్వేషణ మాన లేదు. ఎన్నో సంబంధాలు చూశాను కాని మనసుకు నచ్చిన సంబంధం ఒకటీ కుదర లేదు.

ఒకరోజున ఓ తమాషా జరిగింది. ఎవరో ఒకాయన ఇద్దరు ముగ్గురు బంధువులను వెంటపెట్టుకొని వచ్చాడు మా అమ్మాయిని చూడటానికి. ఆయన ఒక జమీందారుడు కావలసినంత ఆస్థి ఉంది. గొప్ప సంపన్న కుటుంబం. నౌకర్లు చాకళ్ళు ఉన్నారు. కట్నంకూడ ఏమీ ఇయ్య నక్కర లేదన్నారు. కాని వయస్సు ముప్పది అయిదు అని చెప్పాడు కాని, నలభైకి తక్కువ ఉండదు.

“వయస్సు కాస్త ఎక్కువైతేమటుకు ఏం? ఈ సంబంధం బాగుంది నాకు. ఆస్థి ఉంది. నా బాధ్యత తీరుతుంది. పిల్లకూడా సుఖపడుతుంది” అన్నాను నేను.

కాంతం కళ్ళనీళ్లు తుడుచుగొని “పిల్లగొంతు కోస్తారా, డబ్బుకు ఆశపడి. చాల్లే ఊరుకోండి, ఎవరైనా వింటే నవ్విపోతారు” అన్నది.

కాంతం అన్నట్లే అయింది. ఈకొత్త పెండ్లికొడుకును చూడటానికి చాలామంది ఇరుగూ పొరుగూ వచ్చి నవ్వుకుంటూ వెళ్ళిపోయినారు.

ఆయన మాయింటికొచ్చి వెళ్ళిన దగ్గరనుంచి ఊళ్లో ఒక పుకారు పుట్టింది, ఫలానివారి అమ్మాయికి ముసలి మొగుడు దొరకాడని!

మా అమ్మాయి పక్క యింటి కెడితే ఆ ఇంటావిడ ముక్కుమీద వేలువేసుకొని అన్నదట: “చూశావుటమ్మా

విపరీతం! ఈ పిల్లనేమిటి. ఆ ముసలోడి కియ్యట మేమిటి? ఎంత డబ్బుగల జమీందారుడు అయితే మట్టుకు!''

మా సుశీ ఏడుస్తూ ఇంటికొచ్చి తల్లితో చెప్పింది. కాంతం సుశీని దగ్గరకు తీసికొని ఓదార్చి, "నీకేం ఖర్మమే అమ్మా, ముసలి మొగుణ్ణి కట్టటానికి! రేపీపాటికి దొరను తీసుకొచ్చి జైమంటూ పెండ్లి చేయకపోతే చూడు!'' అని అన్నదట.

ఆ రోజునుంచీ కాంతం ప్రాణం తల్లడిల్లి పోయింది, సుశీకి ఎల్లాగ పెండ్లి అవుతుందా అని, సంబంధాలుచూస్తూనే ఉన్నాము, అది గాదని ఇదీ, ఇదికాదని అదీ!

మా మేనల్లుడు సీను ఒక రోజున మా యింటికి వచ్చాడు. అసలు వాడు మా యింటికి ఎప్పుడూ వస్తూనే ఉండేవాడు, ఈమధ్య రావటం లేదు గాని. నరసారావుపేట నుంచి మా అమ్మ వచ్చింది. కూతురూ కొడుకూ ఒక ఊళ్ళోనే ఉన్నాము. ముందు కూతురు ఇంటికి వెళ్ళింది. సాయంత్రానికి మా యింటికి వస్తుంది. ఆ సంగతి చెప్పటానికే మా సీను వచ్చాడు.

సీను "అత్తయ్యా అత్తయ్యా'' అంటూ, వంట ఇంట్లోకే వెళ్ళి ఈ కబురు చెప్పాడు.

కాంతం పీటవేసి సీనుని కూర్చోమని ఏమోమాటల లోకి దింపింది.

సీను ముఖం కళకళ లాడుతూ అంచక్కా ఉండటం కాంతం ఈసారి మరీ వివరంగా చూచింది.

"ఛీ పరాయిగా సంబంధంచూడటం ఏమిటి నిక్షేపం లాంటి మేనరికం ఉండగా!" అని ఆమె మనస్సులో అనుకొని ఉంటుంది.

కాంతం సీనుతో చాలాసేపు మాట్లాడింది. మాటలు సందర్భములో అడిగింది "ఏం నాయనా నీకు సంబంధాలు వస్తున్నాయటగా. అంతా అనుకొంటున్నారు, నిజమేనా?"

"ఎవరనుకొంటున్నారు అత్తయ్యా! మా అమ్మ, నాన్న అనుకోటంలేదే" అన్నాడు. ఎంత తెలివిగా అన్నాడు! ఎంత ఊహతో అన్నాడు! తనకు పరాయిసంబంధాలు వస్తున్నాయి అంటే అత్తకు సంతోషంగా ఉండదని గ్రహించే అల్లా అని అంటాడు. కాంతం ఎంతో సంతోషించింది.

కాసేపు మాట్లాడినతర్వాత సీను "కాసిని మంచి నీళ్ళు యియ్య అత్తయ్యా" అన్నాడు. అప్పుడు ఆవిడ మడికట్టుకొని ఉంది. అందుకని, సుశీని పిలిచి "బావకు మంచినీళ్ళు కావాలట తీసుకరావే అమ్మాయ్" అని చెప్పింది.

సుశీ గదిలోనే ఉండి పలికి సరే నన్నది. కాని ఎంత సేపటికీ రాలేదు.

అప్పుడు సీను అన్నాడు, "చూశావా అత్తయ్యా, సుశీకి ఎంత పొగరో, నీవు చెప్పి ఎంతసేపు అయింది ఇంత వరకు రాకపోయె! దీని పొగరు అణిచే ఉపాయం ఏమిటి అత్తయ్యా?"

కాంతం అన్నది, "నీవు పెండ్లిచేసుకొని దీని పొగరు అణచవోయ్ అల్లుడా" ఈ మాటమీద. "అట్లాకాదు అత్తయ్యా. దీన్ని అరవై ఏండ్ల ముసలాడికిచ్చి పెండ్లి చేస్తాము. దాంతో దానిపొగరు చప్పగా అణుగుతుంది!" అన్నాడు అల్లుడు. అంతా నవ్వుకొన్నారు.

ఇంతలో సుశీ "తెచ్చానే అమ్మా. బావ పాపం ఎండలో వచ్చాడని చల్లని షర్బత్ చేసి తెచ్చానే," అంటూవచ్చి గ్లాసు బావకు ఇచ్చి, చేతికి అతికివున్న నీళ్ళు అతని బుగ్గపైన చిలకరించింది.

మా మేనల్లుడు నవ్వుతూ, "చూశావా అత్తయ్యా, సుశీ ఏం జేస్తున్నదో, నామీద నీళ్లు చల్లుతున్నది. దీన్ని నేను చేసుకోనమ్మా" అని చివుక్కున లేచి నవ్వుకుంటూ వెళ్ళిపోయినాడు.

కాంతం ఈ దృశ్యం చూచింది. ఆవిడకు కడుపు నిండిపోయింది. సుశీకి ఎవరు భర్తకావలసి ఉందో, ఆవిడ ఆ క్షణంలో నిర్ణయించుకోగలిగింది.

ఆ తరువాత కాంతం నా దగ్గరికొచ్చి ఇట్లా అన్నది, "చూడండి, మీరు ఏ సంబంధమూ చూడనక్కర లేదు. వేరేసంబంధం చూడాలని అనుకొని చాలాబుద్ధి తక్కువగా ప్రవర్తించాను. ఇప్పుడు అంతా తెలిసొచ్చింది. పడిన కాళ్ళ మీద పడటానికి కూడా నాకేమీ అభ్యంతరం లేదు."

ఆ సాయంత్రమే మా అమ్మ వచ్చి ఇట్లా అన్నది. "నీవు పిల్లకు పరాయి సంబంధంచూస్తున్నావని తెలిసి నేను

పడుగెత్తుకొని వచ్చాను. నీవు చేస్తున్నపని ఏమీ బాగుండ లేదే కోడలా. చిన్నప్పటినుండీ నేను అనుకొన్నాను. వీళ్ళ ద్దరికీ ముడి పెడదామని. నీవు పిల్లను పరాయిగా ఇస్తే నాకు చాల కష్టంగా ఉంటుంది. ముసలిదానిమాట తీసివేయకు అమ్మా ఇటు కోడుకు. అటు కూతురు. వీళ్ళు ఇద్దరూ వియ్యం పొందితే నా హృదయం సంతోషిస్తుంది.''

"నేను మటుకు కాదన్నానా అత్తయ్యా! వదినే చేసు కోనన్నది కాని'' అన్నది కాంతం.

"నీవు గట్టిగా అడగ లేదని అదంటుంది. ఎందు కే యిదంతా అమ్మాయ్. ఇవ్వాళ సాయంత్రము రమ్మన్నాను నీవు మళ్ళీ నా ఎదుట అడుగు. ఏమంటుందో నేనుచూస్తాను?'' అన్నది మా అమ్మ.

ఆరోజు సాయంత్రం మా చెల్లెలు రావటంతోనే మా కాంతం ఎదురుగా వెళ్ళి కౌగలించు కొని, తీసికొచ్చి కూర్చోబెట్టి, చెయ్యి పట్టుకొని నీవు మా సుశీని చేసుకోక తప్పదు వదినా'' అన్నది. కాంతం కళ్ళ నీళ్ళు కూడా పెట్టు కొన్నది.

మా చెల్లెలు కాంతాన్ని కౌగలించుకొని "అదేమిటి వదినా నేను సుశీని చేసుకోనని ఎప్పుడైనా అన్నానా? పిల్ల వాడు ఒప్పుకొంటే నా అభ్యంతరం ఏమీ లేదమ్మా'' అన్నది.

ఈ మాటలు వింటూన్న మా అమ్మ సంతోషంతో పొంగిపోయింది. ఆవిడన్నది—"ఆ పిల్లవాడు ఒప్పుకోనేది ఏమి?" అని.

అయినా అడిగి తెలుసుకోటం మంచిదని అంతా అన్నారు. సుశీని ముస్తాబు చేసి తీసుకొచ్చి తివాసిపైన కూర్చొబెట్టింది. దానికి ఎదురుగా సీనునుకూర్చోమన్నాము.

ఒకరిని ఒకరు కాసేపు చూచుకొన్నారు. దానితరువాత కాంతమే అడిగింది సీనును. "ఏం నాయనా! సుశీని చేసుకొంటావా?"

తప్పకుండా చేసుకొంటాడని మా అందరి నమ్మకం, ఊరికే లాంఛనంగా అడిగినా.

కానిసీనుతల గిరా గిరాత్రిప్పి "నేను చేసుకోను" అనిస్పష్టంగా చెప్పాడు.

మేమంతానిర్ఘాంతపోయాము. కాంతం తెల్లపోయింది, ఇదేమిటి ఇల్లాఅయిందేరా భగవంతుడా అనుకొన్నాము. అంతా

"ఎందుకు చేసుకోవురా ?
పిల్లఅందంగా లేదా?
ఏంరా. ఎందుకుచేసుకోవు ?"

అని అందరూ ఒక్కసారి ప్రశ్నలువేశారు. వాడు ఏమీ మాట్లాడలేదు. బ్రతిమిలాడి అడగంగా అడగంగా చివరకు బైటపెట్టాడు. కారణం ఏమిటి అదీ?

సుశీని ముందు ముసలివాడికి ఇస్తామన్నామట ! ముసలవాడికి ఇస్తామన్న పిల్లను చేసుకోవటం తనకు తలవంపులట !

మా సీను చెల్లెలు ఒకతె ఉంది పదేండ్ల పిల్ల, భడవా. అది ఎగిరి గంతులేస్తూ "చేసుకోకురా అన్నయ్యా. ఛీ ముసలాడికి ఇస్తానన్న పిల్లను నీ వెట్లా చేసుకుంటావురా ? ఎబ్బే ! వద్దు" అనటం సాగించింది.

అక్కడ కూడిన పెద్దలంతా "నిజమే పెండ్లి కొడుకు పెట్టిన అభ్యంతరం సరియైనదే" అన్నారు.

అయితే ఒకటి చెప్పారు.

ముసలి వాడికి ఇస్తానన్న దోషం పోవటానికి అల్లుడికి సైకిల్, రిస్టువాచీ కొని ఇచ్చేటట్లూ,

మా వదినె ముసలివాడికి ఇస్తానన్న పిల్ల ఎబ్బే, దానిని చేసుకోవద్దురా అన్నయ్యా" అనిఅనకుండా ఉండేటందుకు ఆడబొడుచుకు యాభై రూపాయలు.

ఈ రహస్యం ఎవ్వరితోనూ చెప్పకుండా గుట్టుచక్కంగా పెండ్లి చేసుకొని పొయ్యేందుకు వియ్యపురాలికి నూటపదహార్లూ ఇచ్చేలాగున పెద్దలందరూ ఏర్పాటు చేసారు. ఎట్లాగయితేనేం సుశీ పెండ్లి అప్పటికి నిశ్చయమైంది. తల్లిప్రాణం సంతోషించింది.

కానుక

మా ఆవిడ వచ్చి ఎదురుగా నుంచున్నది. తలంటుకొని స్నానం చేసింది కామాలు జుట్టు వేలుముడి వేసుకొన్నది. ఇవ్వాళ ఆమెగారు మామూలు మనిషిలాగ లేక ఏదో కొత్తగా ఉంది నా కళ్ళకు. నేను మాట్లాడకుండా ఆమెను చూస్తూ కూర్చున్నాను.

ఆమెకూడా మాట్లాడలేదు. సిగ్గుతో తలొంచుకొని ఊరుకొన్నది.

"ఏమిటి సంగతి?" అన్నాను.

"ఏ ముంది!" అన్నది.

కనకాంబరం చీర గట్టింది. ఆ చీర జరీ అంచులు మెలికలుగా ఆ శరీరాన్ని చుట్టుకొన్నవి. తెల్లని రవిక తొడిగింది. కళ్ళకు కాటుక పెట్టి, ముఖాన చిన్న కుంకుమ బొట్టు పెట్టింది. అక్కడే నుంచుని ఉన్నది, నన్ను జూస్తూ.

ఏదో ఉంది! లేకపోతే ఈ అలంకారాలు ఈ క్రీగంటి చూపులూ ఎందుకొస్తయ్.

"ఏమిటి చెపుదూ" అన్నాను.

ఆమె ఏ సంగతి చెప్పక, ఒక్క చిన్న నవ్వు నవ్వి గదిలోకి వెళ్ళిపోయింది. ఆమె నవ్వితే బుగ్గలు సొట్ట పడ్డవి. అది నేను చూచి సొట్టబుగ్గలను సాఫీ చేద్దామనే సదుద్దేశంతోనే గదిలోకి వెళ్ళాను.

పొట్ట బుగ్గలను కాస్త నొక్కి. సాఫీగా తుడిచి "చెప్పు ఏమిటి సంగతి?" అన్నాను.

"అంత మాత్రం తెలియదా?" అన్నది ఆవిడ గునుస్తూ.

"నాకేం తెలుస్తుందీ? తెలియదు" అన్నాను.

"అయినా ఆలోచించి, జ్ఞాపకం తెచ్చుకోండి" అన్నది.

నాకు జ్ఞాపకం రాలేదని చెప్పాను.

"ఇంత ముఖ్యమైన రోజును ఎల్లా మరచి పోతా రండి" అని కాస్త ముఖం చిట్లించింది. "నేను పుట్టినరోజా?" అని అడిగాను. కాదన్నది. "నీవు పుట్టినరోజా?" అన్నాను కాదని తల ఊపింది. ఇహ నాకేమీ తోచలేదు.

"నాకు ఏమీ జ్ఞాపకం రావటంలేదు. నీయిష్టం నన్ను ఏంజేసినా సరే"నని—నేను మంచం మీద కూర్చున్నవాణ్ణి లేచి నిలబడ్డాను వెళ్ళిపోవటానికి సిద్ధపడుతూ. ఆవిడ బుజం మీద చేయివేసి అదిమి కూర్చోబెట్టి, నా ప్రక్క నే కూర్చుని తలొంచుకొని సిగ్గుపడుతూ అన్నది. "ఇవ్వాళ నేను కాపరానికి వచ్చిన రోజు. సరిగ్గా ఇవ్వాళతో ఇరవై ఏండ్లు వెళ్లి తాయి. మీకు ఇంత ముఖ్యమైన సంగతి జ్ఞాపకం లేక పోయిందేం?"

నేను అంత పవిత్రమైన దినాన్ని, నా సౌఖ్యదేవత కాపరానికి వచ్చిన సుదినాన్ని జ్ఞాపకం ఉంచుకోలేక పోవటం

చాలా పెద్ద పొరపాటు. అందుకని అన్నాను నవ్వుతూ——
"జ్ఞాపకం లేక కాదండీ కాంతమ్మగారూ, తమనోటితోనే ఆ అమృతవాక్కులు అనిపిద్దామని! తెలిసిందా?" అన్నాను. ఆవిడ మరొకసారి సిగ్గుతో తలొంచుకొని, నవ్వుకొన్నది. ఆ తరువాత నా వీపుపైన మృదువుగా చరిచి, అరచేతిలో గిల్లి, వళ్ళు ఝల్లు మనిపించి వెళ్ళిపోయింది.

నా వళ్ళు ఝల్లుమనటానికి కారణం ఏమిటీ అంటే, ఆవిడగారు కాపరానికి వచ్చిన రోజు కాబట్టి అది. నేను ఏదైనా కాన్క ఒకటి సమర్పించాలిసి ఉంటుంది. ఆ విషయం జ్ఞాపకం ఉంచుకోమనే ఆమె అరచెయ్యి గిల్లింది. డబ్బు లేని సమయంకదా ఇది ఏమి కొనేది? ఎట్లా కొనేది? అన్న ఆలోచనలలో నా వళ్ళు ఝల్లు మన్నది.

ఏదో ఒకటి కొనియియ్యక తప్పదు. నా దగ్గర డబ్బు లేని రోజుచూచి, ఆ రోజునే ఆవిడ కాపరానికి వచ్చింది. మొదటినుంచీ, మా కాంతం ఈ ప్లాను ప్రకారమే నడిచింది.

౨.

మా కాంతం పెట్టిన రోజు పండక్కు ఏమి కాన్క యియ్యాలె అన్న ఆలోచనలోకిదిగాను. పౌడరూ, అత్తరూ, దువ్వెనా, వాసననూనె, ఇల్లాంటి దేదో ఒకటి ఇస్తే సరిపోయేదానికి, దీనితో పెద్ద ఆలోచన ఏమిటీ అని అనుకొంటారు కాని ఆవిడ సంగతి తెలిసిన వాళ్లుమటుకు అల్లా

అనరు. ఆవిడ ఇప్పటికాలం మనిషీకాదు, పూర్వకాలం మనిషీకాదు అదోరకం మనిషి. దువ్వెనా, అద్దం. అల్లాంటి వస్తువులు ఇస్తే సంతోషించదు. కాస్తఖరీదు గలవి, నాలుగు కాలాలుపాటు ఉండేవి అల్లాంటి వస్తువులు కావాలంటుంది. అందుకనే నేను అంత దిగులు పడ్డది. ఇప్పుడు అల్లాంటివి ఏదైనా కొంటానికి డబ్బు ఎక్కడనుంచి తెచ్చేనా అని?

అదీకాక ఆవిడ అనేకసార్లు అనుకొన్నది ఒక జత బంగారపు గాజులుంటే బాగుండునని! కొనియిస్తే అవే కొని యియ్యాలె. ఈ పాడు యుద్ధం రావటం మూలాన బంగారపు ధర విపరీతంగా పెరిగిపోయిందిగాని లేకపోతే ఎన్ని గాజులైనా చేయించు కొనేదట ఆవిడ! అసలు ఆడవాళ్ళను ఏడ్పించటానికే ఈ యుద్ధం ఒకటి తీసుకొచ్చారు అంటుంది. ఆవిడ యుద్ధం అయిపోయిన వెంటనే బంగారం చౌక చెయ్యలేదని ఆమెకు చాలా కోపంగా కూడా ఉంది.

స్వరాజ్యం వచ్చిన రోజున మధ్యాహ్నం సరిగ్గా పన్నెండు గంటలనుంచి ఒంటిగంటదాకా, ఒక గంటసేపు నవరసులు చౌకగా గవర్నమెంటువారు అమ్మిస్తారనీ, ఆడవాళ్ళయందు దయతలచి, గోపాలరెడ్డిగారు ఈ ఏర్పాటు ప్రత్యేకంగా చేశారనీ ఒక వదంతి పుట్టింది. అప్పు అయినా చేసి ఒక పది నవరసులైనా కొనుక్కురమ్మని ఆవిడ గోల చేసింది. "ఇది అబద్ధం, ఇల్లాంటిపిచ్చి పనులు గవర్నమెంటువారు చెయ్య"రని నేను చెప్పాను. కాని ఆవిడ నా మాట

నమ్మక పైగా ఏమన్నదంటే. "ఇది ఏమీ పిచ్చిపనికాదు. ఆమాట కొస్తే ఇంతకంటె పిచ్చిపనులే చేస్తున్నారు" అని కూడా అన్నది. ఆవిడ బాధ తప్పించుకోటానికి చివరకు నేనొక మాట అన్నాను. "నవరసులు చౌకగా అమ్మినా, మొగవాళ్ళకు అమ్మరు. ఆడవాళ్ళకు మాత్రమే అమ్ముతారు." ఈమాట కాస్త సమంజసంగా ఉందనుకొన్నదో ఏమో మా పిచ్చిది. ఆ తరువాత నన్నేమీ అనలేదు. ఆ మరునాడు మటుక ముఖం అంతా కందగడ్డ చేసుకొని "ఈ గవర్నమెంటువారు ఆడవాళ్ళను ఇంత మోసగించి, అన్యాయం చేస్తారనుకో లేదండీ!" అన్నది.

నిజానికి మా కాంతమే కాదు ఆడవాళ్ళంతా అల్లాగే అంటున్నారు. "ఎందు కొచ్చినది స్వరాజ్యం ఇది? బంగారం చౌక చెయ్యకూడదా, ఈ స్వరాజ్యం వాళ్ళు!" అని చాలా మంది అన్నారు.

ఇల్లాంటి విషయాలన్నీ జ్ఞాపకంవచ్చినవి ఆలోచిస్తూ కూర్చుంటే. చివరకు నేను కాంతానికి ఒక జత బంగారపు గాజులు కొనియియ్యక తప్పదనే నిశ్చయానికే వచ్చాను.

నిజానికి కొని ఇయ్యవలసిందే! అందులో సందేహం ఏమీ లేదు. పుట్టినరోజు పండగకు, మెట్టినరోజు పండుగకు భార్యకు, బహుమానం ఇయ్యాలె. ఈవిషయం కామశాస్త్ర గ్రంథకర్తకూడా ఉదహరించి, ఆరోజున కానుకలు ముట్టక పోతే ప్రియురాలు ప్రణయ కలహం పట్టవచ్చునని కూడా

చెప్పాడు. అయితే మా ఆవిడ ప్రణయకలహం పడుతుందని భయపడి నేను ఆ నిశ్చయానికి రాలేదు. ప్రణయకలహం పడితే, వచ్చిన ఇబ్బంది ఏమిటీఅంటే, మనఆడవాళ్ళు శాస్త్రరీత్యా పట్టవలసిన ప్రణయకలహం పట్టక, చటుక్కున జాతీయమైన నాటు కలహంలోకి దిగుతారు. దానికి నేను భయపడ్డది!

3

సెందలాడే భోజనంచేసి బజారులో నగలషాపు చూడటానికి వెళ్ళాను. ఆ షాపుయజమాని నాకు తెలిసినవాడే! గౌరవించి కూర్చోబెట్టాడు. అక్కడ అద్దాల బీరువాలో రకరకాల గాజులున్నవి. స్వస్తిక్ గాజులు, రేడియో గాజులు, పలకల గాజులు, పార్శీగాజులు మొదలైనవి ఎన్నోరకాలు. అందులో స్వస్తిక్ గాజులజత ఒకటి మహాబాగుంది. మధ్య మధ్య ఎర్ర రాళ్ళు పొదిగారు. ధగ ధగ మెరిసి పోతున్నది.

మా ఆవిడ చేతులకు అదే బాగుంటుందనిపించింది. తొంభైరూపాయల ఖరీదు చెప్పాడు. ఆజత కొనాలని ఉంది. చేతిలోడబ్బు లేదు. అప్పుఅడిగితే ఏమనుకొంటాడో! చివరకు ఒక విధంగా నవ్వులాటగా అన్నాను. "ఏమయ్యా! ఈ జత నాకుకావాలె. డబ్బుయియ్యకుండా తీసికెళ్ళవచ్చునా?"

ఇది తెలివితక్కున ప్రశ్న అనుకొంటాడు కాని కాదు. ఎందుచేతనంటే నేను అనుకొన్నది ఏమిటీ అంటే, ఆ మాట మీద ఆ షావుకారు, "తీసికెళ్ళండి పంతులుగారూ. డబ్బు ఎక్కడికి పోతుందీ", అని అంటాడని.

కాని, నా కర్మం, ఏం జేసేది! ఆ షావుకారు అల్లా అన లేదు. అనక, పైగా నవ్వుతూ హేళనగా అన్నాడు "డబ్బు ఇయ్యకుండా తీసికెళ్ళటానికి వీల్లేదు కాని, డబ్బు ఇచ్చి తీసికెళ్ళకుండా ఉంటానికి వీలుందండీ పంతులుగారూ" అని.

అప్పుడు నేను గొంతుక మార్చి బ్రతిమిలాడుతున్నట్టు అన్నాను–"ఈ నెల ఆఖరుకు ఇచ్చేస్తాను. అసలు అందాకా కూడా అక్కర లేదు. ఈ లోపునే ఇచ్చేస్తానేమో." అప్పటికీ ఆ ఆసామీకి నాయందు నమ్మకం కుదర లేదు. "ఇప్పుడెవరికీ అప్పు ఇయ్యటం లేదండీ" అన్నాడు. "ఇప్పుడియ్యటం లేదట! పూర్వం తెగించి అందరికీ అప్పులిచ్చేవాడిలాగ. ఛీ ఇతన్ని అడగకూడద"ని లేచి వచ్చేశాను.

చాలా కష్టం వేసింది. పారిపోతా ననుకొన్నాడు కామాలు. చా, ఆమాత్రం మర్యాద లేకపోయింది అతనికి.

అప్పుడు నాకు ఒక చక్కని ఆలోచన చటుక్కున తోచింది; ఎక్కడైనా ఒక వందరూపాయలు అప్పు తెస్తే ఏ ఇబ్బందీ పడనక్కర లేదని; తొంభైరూపాయలు వీడిముఖాన పారేస్తే గాజుల జత తీసుకోనూవచ్చు... మిగిలిన పదిరూపాయలూ హాయిగా వాడుకోనూ వచ్చు!

ఇంకోటి కూడా అనుకొన్నాను. డబ్బు పారేసి కొనేటప్పుడు ఇక్కడ కొనటం ఎందుకు నా యిష్టం వచ్చినచోట కొందామని. నా మర్యాద కాపాడాడు కనకనా అక్కడే కొంటానికి!

ఇల్లా అనుకొని వచ్చాను కాని వంద రూపాయలు అప్పు ఎక్కడ దొరుకుతుంది! ఎవరి నడిగేది? నాకేమి తోచ లేదు.

అయితే ఒకటి గట్టిగా నిశ్చయించుకొన్నాను. గాజుల జతమట్టుకు కొనితీరాలె. ఎట్లాగయినా సరే! కొని తీసికెళ్ళి ఆవిడ చేతులకు స్వయంగా తొడక్కపోతే నాకు పిచ్చి ఎక్కే మాట నిజము. అప్పటికే కాస్త పిచ్చి పిచ్చిగా ఉంది.

నూరు రూపాయల మొత్తం చాలా స్వల్పమైనది. నిజానికి ఈమాత్రం సాహాయం ఎవరు బడితే వాళ్ళే చేయ గలరు. కాని ప్రపంచం పాపిష్టిది. స్వార్థపరత్వం ఎక్కువ. "అయ్యో, పాపం ఆ అబ్బాయి బంగారపు గాజులు కొని తీసి కెళ్ళి భార్యకు ఇయ్యకపోతే ఎట్లా! ఎంత చిన్నతనం. సాహాయ్యం చేద్దాం" అని ఒక్కరూ అనుకోరు. అటువంటిది ప్రపంచం!

అయినా అప్పుపుట్టే స్థలాలు ఏవా అని ఆలోచించాను. ఒకటి రెండు స్థలాలున్నవి కాని అక్కడ ఇదివరకే పుట్టించాను, బ్యాంకులో అప్పుఉంది. ప్రావిడెంటు ఫండులోనుంచి అప్పుతీశాను. ఇక స్నేహితు లెవరైనా ఇస్తారేమోనంటే ఆ

గోఖ్లేగారు ఇయ్యారు. ఇదివరలో తీసికొన్నది ఇస్తేగా ఆయన మళ్ళీ ఇయ్యటానికి! ఇంకెవరిస్తారు? నాగేశ్వరరావుగారిని అడిగి లాభంలేదు. అవధానిగారు ఇయ్యరు. ఇహపోతే నరసింహంగారు ఇస్తారుగాని ఏమైనా తాకట్టుపెట్టాలె. తాకట్టు పెట్టటానికి నాదగ్గర ఏమీ లేదు. ఆ కంచం వెండిపూత పూసింది. అచ్చం వెండిది కాదాయె. ఛీ, జీవితం ఎంత దరిద్రంగా ఉంది! తాకట్టుపెట్టుకోనేందుకు అయినా ఏమీ లేక పోయింది! అని విచారం వేసింది.

అప్పుడే ఇంకో విషయము కూడా తోచింది. ఈ గాజులు కొని ఆవిడ కిస్తే ఆవిడను సంతోష పెట్టినట్టూ అవుతుంది...ఎప్పుడైనా ఇల్లాటి ఇబ్బందివస్తే చప్పున తాకట్టు పెట్టుకోనూవచ్చు! తాకట్టుపెట్టడానికైనా ఇంట్లో ఆమాత్రం వస్తువు ఉండటం అవసరం అని గట్టిగా మనస్సుకు తట్టింది. దాంతో ఆ గాజుల జత కొనాలనే పట్టుదల ఎక్కువైంది.

ప్రొద్దున ఆవిడ తలవంచుకొని నుంచుని, చేతినున్న గాజుగాజులు సద్దుకుంటూ ఉండటం జ్ఞాపకం వచ్చింది. "ఇవేం గాజులండీ బంగారపు గాజులు కొని ఇయ్యండి;" అని అడగటం అది, అర చేతిలో గిల్లిపోవటంకూడా దానికి సంబంధించినదే. ఈ విషయాలన్నీ జ్ఞాపకానికి వచ్చి నా పట్టుదలను మరీ దృఢపరచినయి.

ఎక్కడైనా అప్పు అడగటానికి బయలు దేరాను. కనపడ్డవాణ్ణి అల్లా అడుగుదా మనిపించింది. ఇంతలో సుబ్బా

రావు కనిపించాడు. అతడు కొ_స్త డబ్బుగలవాడు. అతనికీ నాకూ కాస్తో కూస్తో బంధుత్వం కూడా ఉంది.

"ఓ వందరూపాయలు అర్జంటుగా కావలసివచ్చినయి కొ_స్త ఇస్తావ్ ?" అని అడిగాను, ఏదో తమాషా గాను, నిర్లక్ష్యంగానూ ఎప్పుడు వందా, రెండువందలూ ఇల్లాగ తరుచుగా అప్పుపుచ్చుకొని మళ్ళీ మర్నాడు ఇచ్చేసే వాడిలాగ.

వాడిచూపులు జూచి "తీసికెళ్ళవోయ్ ఏం భాగ్యం" అంటాడనుకొన్నాను. అట్లాగే చూశాడు.

నేను ఆశపడ్డాను.

కాని వాడి దుంపతెగ వాడు అల్లాగ అనక "ఏం, వేళాకోళంవోయ్, వందరూపాయలు నీకు అప్పుకావాలిసి వచ్చిందే! ఎవరికైనా కావలిస్తే ఇయ్యగల వాడవు ?" అన్నాడు.

నన్ను గురించి వీడికి మంచి అభిప్రాయం ఉన్నందుకు సంతోషించి, "సమయానికి పైకం లేదయ్యా, ఒక వారం రోజులలో పంపించేస్తాను" అన్నాను.

ఈ తభా అయినా "అంత ఇబ్బంది నస్తే పట్టుకుపో" అని అనలేదు. "నీకు అంత అవసరం అయితే చీటీ వ్రాసి పంపిస్తే ఎవరుబడితే వాళ్ళే ఇస్తారు. నన్ను అడగాలాఏమిటీ?" అని పెద్ద పెద్ద అంగ లేసుకుంటూ వెళ్ళిపోయినాడు. "చీటి వ్రాసి వీడికే పంపిస్తే అని అనుకున్నాను. ఏమిటో మతిలేని

ఆలోచనలు: మతి ఉంటే అల్లా ఎందుకు అనుకొంటాను! ఎదటబడి అడిగితే ఇయ్యనివాడు చీటివ్రాసి పంపితే ఇస్తాడూ! ఆ ఆదుర్దాలో అల్లాగ అనిపించింది.

ఈ ప్రయత్నం కూడా ఇల్లాగ వ్యర్థం అయిపోయిందే ఎల్లాగురా బాబూ అని ఆలోచిస్తూ నడుస్తున్నాను. నంకర మేడ దగ్గరకు వచ్చేసరికి ఇంకో ఆలోచన వచ్చింది. అక్కడే మా కేశవరావు అత్తగా రున్నారు. వాళ్ళను అడిగితే ఇయ్యరా అని!

కేశవరావూ, నేనూ మంచి స్నేహితులమని వాళ్ళకు తెలుసు. నాకు ఈ స్వల్పం సాహాయ్యం చేయకపోతే అల్లుడికి చిన్నతనం అవుతుందని అయినా ఇస్తారని ధైర్యం కలిగింది.

రైట్—ఈ ఆలోచన వచ్చినందుకు చాలా సంతోషించాను. ఈతభా నెగ్గానన్న మాటే! తొంభై రూపాయలూ తీసికెళ్ళి, ఇచ్చేసి స్వస్తిక్ గాజులు కొనుక్కొని వెళ్ళాలె అనుకొన్నాను.

అయితే ఈ విషయం వాళ్ళతో ఎత్తటం ఎల్లాగ? ఆ విషయం కాస్త తీరికగా ఆలోచించుకోవాలె. అందుకని దగ్గరలో ఉన్న కాఫీహోటలుకెళ్ళి, ఒక కప్పుకాఫీ తెప్పించి కొంచెంగా తాగుతూ ఈ "క్యాంపెయిన్" ఎట్లా సాగించాలా అని తీవ్రంగా ఆలోచించాను. వాళ్ళింటికి వెడతాను. వాళ్లు నన్ను కూర్చోమంటారు మర్యాద చేస్తారు. సరే, వెంటనే అప్పు అడగటం బాగుంటుందా?

ఊఁహూ. అల్లా కాదు. వాళ్ళు నాకు అప్పు ఇయ్యటం నేను కేశవరావు స్నేహితుణ్ణి అనేగా! అందుకని ముందుగా నేను, కేశవరావుకూ నాకూ ఉన్న స్నేహాన్ని, వాళ్ళకు గుర్తు చెయ్యాలె. ఎల్లాగ గుర్తు చెయ్యటం? ...

కేశవరావును చూచివచ్చాను. కులాసాగా ఉన్నాడు అనాలె. మేము ఇద్దరం మంచి స్నేహితులం కాబట్టి తరుచు కలుస్తూ ఉంటామన్న మాట!.....

నేను కేసవరావు కుటుంబానికి ఆప్తుణ్ణే అయినట్లు కూడా నా సంభాషణలో ప్రకటితం చెయ్యాలె.

నిజానికి కూడా అంతేనాయె. అయితే ఈ మధ్య నేను కేశవరావును చూడలేదు. ఉత్తరాలుకూడా రావటం లేదు. అయినా మంచి స్నేహితుల మన్నమాట నిజమేగా.

సరే. కేశవరావు క్షేమమూ అవీ చెప్పి మెల్లిగా సమయంజూచి అప్పు అడగాలె.

ఇదీ ప్లాను.

బాగుంది అనుకొన్నాను. వాళ్ళు భాగ్యవంతులు కూడాను. ఒక వంద రూపాయలు వాళ్ళకో లెక్కలోనిది కాదు. ఇస్తారు. నోటూ గీటూ ఏమీ అక్కర లేదనికూడా అంటారు. కాని...నోటు వ్రాసి ఇచ్చేస్తాను. అదే మర్యాదగా ఉంటుంది.

ఇల్లాగ ఆలోచించు కొన్నాను. అంతా కుదిరింది. నేను ఆతరువాత ఒక నిముషమైనా వృథాగా గడపకుండా,

గబగబా నడిచి కేశవరావు అత్తగారింటికి వెళ్ళాను. ఆమె అయినా నాకు బాగా తెలిసిందేనాయె. కేశవరావుతో అనేకసార్లు వెళ్ళాను. వాళ్ళింట్లో చాలసార్లు భోజనం కూడా చేస్తిని. ఇంకా భయం ఎందుకు యకాయకీని లోపలికి వెళ్ళాను.

కేశవరావు అత్తగారు నన్ను చూడడంతోనే పలకరించింది "ఏమయ్యా, అల్లుడా చాలా కాలానికి కనపడ్డావే!" అంటూ, నన్ను కూర్చోమని కుర్చీచూపారు కూర్చున్నాను.

"ఆ"

"అంతా కులాసాగా ఉన్నారా?"

"మా అల్లుణ్ణి చూశావా ఈ మధ్య?" అని అడిగింది ఆవిడ.

"చూడ కేముండీ, ఎప్పుడూ కలుస్తునే ఉంటాము పదిరోజుల కొకసారి అయినా చూచుకోకుండా ఉండలేము"

"అవునవును, స్నేహితులాయె మరి!" అన్నది ఆవిడ.

ఇంకేం, ఇదే సమయమని మళ్ళీ ఇలా అన్నాను. "మామూలు స్నేహం కాదండీ. అన్నదమ్ముల కంటే ఎక్కువగా ఉంటాము"

అవును లే నాయనా, స్నేహం అటువంటిది. అది సరేగాని మా అల్లుణ్ణి కలుసుకొని ఎన్నాళ్ళయిందినీకు?"

"నిన్న నేనండి. నిన్న కలుసుకొన్నాను." అన్నాను, ఆవిడ సంతోషంతో "ఎక్కడ కలుసుకొన్నావు బాబూ?" అని అడిగింది.

"నేనే గుంటూరు వెళ్ళానండి అత్తయ్యగారూ! అక్కడే చూచి మాట్లాడాను" అన్నాను.

"మా అల్లుడు గుంటూరులో ఎందు కున్నాడు నాయనా?" అని అడిగింది ఆవిడ ఆశ్చర్యపోతూ.

అరే! గుంటూరులో లేడా ఏం కర్మం! అతనికి గుంటూరులోనే ఉద్యోగం! అని అనుకొని చప్పున తెప్పరిల్లి, "ఏమండి, అత్తయ్యగారూ అల్లా అడిగారేం?" అన్నాను.

"ఆయనకు సత్తెనపల్లి బదిలీ అయిందిగా! అందుకనేగా అమ్మాయిని పుట్టింటికి పంపి ఒంటరిగా వెళ్ళాడు!" అన్నది.

చచ్చాను. వాడికి సత్తెనపల్లికి బదిలీ అయిన సంగతి నాకేం తెలుసు! గుంటూరులో ఉన్నాడనుకొన్నాను! ఇప్పుడేమని చెప్పేది?

భగవంతుడు తెలివంటూ ఒకటిచ్చాడు కాబట్టి సరిపోయింది. చప్పున తడుముకోకుండా "అవునండీ నాకు తెలుసు ఆ సంగతి. కాని మళ్ళీ గుంటూరుకే వేయించుకొన్నాడు. ఆ సంగతి మీకు తెలియదా?" అని అడిగాను.

కేశవరావు అత్తగారికి ఆశ్చర్యం కలిగింది. నిజమే కామోలు అనుకొంది. "అట్లాగా నాయనా ఆ సంగతి తెలియదే!" అన్నది.

"నన్ను చెప్పమన్నాడండీ!" అన్నాను గర్వంగా.

"సరే, సరే. అమ్మాయిని సత్తెనపల్లికి పంపమని వ్రాయలేదేమా అని అనుకుంటున్నాము, ఇదా సంగతి!" అని నాతో అని. అమ్మాయ్ అని కూతురును పిలిచి "నీ మొగుడికి మళ్ళీ గుంటూరు బదిలీ అయిందటే తల్లి" అని చెప్పింది.

ఆ అమ్మాయి ఆశ్చర్యంతో చూచి ఊరుకొన్నది.

"ఏమమ్మా కులాసాగా ఉన్నావా ?" అని పలకరించాను ఆ అమ్మాయిని నేను.

ఆ అమ్మాయి నన్ను బావగారూ అని పిలుస్తుంది. అందుకని నా ఎదుట కాస్త సిగ్గుపడుతూ నుంచుని. "ఆ కులాసాగానే ఉన్నానండి" అన్నది.

"ఇంకా ఏమి కబుర్లు చెప్పాడు నాయనా మా అల్లుడు ?"

మరేంలేవు. అంతా కులాసాగాఉన్నారు "అన్నాను. ఏమి చెప్పాడని చెప్పేది! ఏమీ తోచలేదు.

"అయితే చూడు అబ్బాయ్, పిల్లను పంపి నెలరోజు లైందిగదా, తీసుకుని వెళ్ళలేదు సరికదా, ఒక్కసారిఅయినా వచ్చి చూచిపోలేదు. ఇదేమైనా బాగుంది నాయనా నీవే చెప్పు !" అని అడిగింది ఆవిడ.

కేశవరావూ నేను అన్నదమ్ముల కంటే ఎక్కువగా ఉంటున్నప్పుడు, అతని మాట పడనియ్యక పోవటం నాధర్మం. అతడు నెలరోజులనుంచి ఒక్కసారి అయినా రాక

పోవటానికి తగినంత కారణం చూపవలసిన బాధ్యత నాపైన పడ్డది. మొదట చురుకుగా పనిచేయవలసిన అవసరం వచ్చింది. అతడు భార్యను చూడటానికి రాలేదు! దానికి కారణం వాళ్ళకు నచ్చేది చెప్పాలె. అదొకపని. దానితరువాత "కాస్త ఓ వందరూపాయలు, అవసరంగా కావలసి వచ్చినై అండీ అత్తయ్యగారూ" అనేయాలె మాటలలోకలిపి. ఆవిడ "దానికేం భాగ్యం నాయనా!" అంటుంది. అప్పుడు నేను ఊరుకోకూడదు.

"మళ్ళీ పదిరోజుల్లో ఇచ్చేస్తానండోయ్. నాసంగతి అంతే. కావలిస్తే మా మరదలును అడగండి నాసంగతి ఎటువంటిదో ?" అనికూడా అంటేనా, ఈ అప్పు అడగటం అనే దరిద్రపుపని, నవ్వుతూ నవ్వుతూ జరిగి పోతుంది.

అని ఇల్లాగ ముందు జరగవలసిన వ్యవహారంక్రమం కూడా నిర్ణయించు కొన్నాను.

బుద్ధి నిశితంగా పనిచేయటం మూలాన ఈ ఆలోచన అంతా క్షణంలో జరిగిపోయింది. ఇకముందు విషయం కేశవరావు పెళ్ళాన్ని చూడటానికిఎందుకురాలేదు. దానికి కారణాలు చెప్పాలె, ఇట్లా అన్నాను నవ్వుతూ, "ఆవిషయం నాకు చెప్పాడండి అత్తయ్యగారూ, ఈ నెలరోజుల్లో ఎంత ప్రయత్నం చేసినా వాడికి సెలవు దొరకలేదట. అందుకనే రాలేదండీ." అన్నాను. నాబుద్ధి అంతా వినియోగిస్తే దొరికిన కారణం అది. ఆమె మాటతిప్పి, "ఆ అంత రావాలే అను

కుంటే ఓ ఆదివారం వచ్చి చూచిపోకూడదా ఏమిటి ?___ ఏమంత పెద్ద దూరమని!'' అన్నది.

నేను చెప్పింది తృప్తినిచ్చే కారణం కాలేదు. ఆ విషయంలో వాళ్ళను ఏదో విధంగా తృప్తిపరచకుండా నా డబ్బు సంగతి ఎట్లా ఎత్తేది ?

అందుకని అన్నాను. ''మీరు అన్నమాట నిజమే. ఇంకో విషయంకూడా ఉంది లెండి రాకపోవటానికి'' అన్నాను. ''ఏమిటి నాయనా ?'' అని ఆదుర్దాగా అడిగింది ఆమెగారు.

''ఆఁ___మరేమిలేదు. వాళ్ళ అమ్మకు కాస్త వంట్లో కులాసాగా లేదుట! అందుకని రాలేకపోయినాడు'' అన్నాడు.

ఈ మాటలు విని, కేశవరావు అత్తగారూ భార్యా కూడా ఏదోరకంగా చూశారు నావంక. వాళ్ళ కళ్ళల్లో వ్యక్తమైన భావం ఆశ్చర్యమో, నాకు తెలియలేదు. వాళ్లు ఇద్దరూకూడా, ముసలావిడకు జబ్బుచేసిందని, భయపడుతున్నారని నేను అనుకొన్నాను. అందుకని. మళ్ళీ అన్నాను. ''మరేం భయపడవలసిన అవసరం లేదండి అత్తయ్యగారూ! ఆవిడకైనా, పెద్ద జబ్బు ఏమీ కాదులెండి, ఏదో కొంచెం దగ్గుపడిసెము అయి ఉంటుంది'' అన్నాను.

ఈ మాట ఆమె అడిగింది. ''ఎవరికి జబ్బుగా ఉందంటున్నావూ ? మా వియ్యపురాలికా ?'' అన్నది ఏదో తమాషాగా చూస్తూ.

"అవునండీ." అన్నాను.

కేశవరావు అత్తగారు ఎందుకో నవ్వుకొన్నది.

ఆ అమ్మాయి మటుకు కాస్త పెద్దగానే నవ్వింది.

వాళ్ళు ఎందుకు నవ్వుతున్నారో నాకు అర్థంకాలేదు. కొంచెము జలుబు చేస్తే. జబ్బుగా ఉన్నదని అన్నా ననా ?... ఆ మాత్రానికే కేశవరావు హడలిపోయి భార్యను చూడటానికి రాకపోవాలా అని అనుకోనా ? ఎం దుకు నవ్వుతున్నారో నాకు బోధపడలేదు.

నేను ఎక్కడో పొరపాట్లాపడ్డానని అనుకొని కొంచెంగాబరా పడ్డాను. కొద్దిగాజలుబుచేస్తే, "జబ్బుగా ఉన్నదీ" అని పెద్దమాట ఉపయోగించినందుకే నవ్వుతున్నారు అనుకొ న్నాను. అనుకొని నా మాటనిలుపుకొంటానికి, "దగ్గూ పడిసెమే కాదులెండి, జ్వరంకూడా వస్తున్నది" అన్నాను.

ఇల్లాగ అనటం మంచిదేననిఅప్పటికి నేననుకొన్నాను. నేను "జబ్బు" అనేమాట తెలివితక్కువగా ఉపయోగించలే దని స్పష్టమౌతుంది ఈజవాబువల్ల. అంతేకాక కేశవరావు భార్యను చూడటానికి రాకపోవటానికి తగినంత బలమైన కారణమూ చెప్పినట్లు అవుతుంది. మొత్తము మీద తెలివి గానే జవాబుచెప్పాను అనిపించింది.

కాని వాళ్ళుఇద్దరూకూడా, నవ్వటంమొదలుపెట్టారు అదే నాకు అర్థంకాలేదు, దేనికి నవ్వుతున్నారు?

అప్పుడు-ఆ పిల్ల అన్నది నవ్వు ఆపుకొని "అయితే బావగారూ, జ్వరం అంటే బాగా నూటమూడు, నూట నాలుగు వస్తున్నదా?" అన్నది.

ఇక్కడే నేను కొంచెం ఆలోచించవలసి వచ్చింది. ఆవిడకు ఎంత జ్వరం వస్తున్నదని చెప్పాలే అని ఆలోచించాను. కాస్త ఎక్కువగానే వస్తున్నదని చెప్పటమే మంచి దని తోచింది. వెంటనే అన్నాను. "నూటరెండు, రెండు న్నర అల్లాగ వస్తున్నదమ్మా" అని.

ఆ అమ్మాయి మరీ విపరీతంగా నవ్వింది, "అత్తగారికి జబ్బుగాఉంటే, కోడలుకు నవ్వులాటగా ఉంది కాబోలు" అన్నాను, కొంచెం వేళాకోళంగా! ఆ అమ్మాయి నాకు మరదలువరసేగా! అందుకనే అట్లా అన్నాను. కేశవరావు తల్లిమటుకు తెల్లపోయి చూస్తున్నది. ఆ అమ్మాయి మళ్ళీ ఇంకొకసారి నవ్వు ఆపుకొని "అయితే, బావగారూ అస లావిడ...లేచి తిరుగుతున్నదా. లేకపోతే......మంచానే పడి ఉన్నదా?" అని మళ్ళీ ప్రశ్నించింది.

"నూట రెండు జ్వరం వస్తుంటే, లేచి ఎట్లా తిరుగుతుందమ్మా! అందులో పెద్దదికదా?" అన్నాను.

"అల్లాగా అండీ బావగారూ, మా అత్తయ్యకు అంత జబ్బుగా ఉందండీ!" అని అంటూ ఆ అమ్మాయి విరగబడి నవ్వింది.

"ఇంతలో ఎవరికే అమ్మా జబ్బు?" అంటూ యాభై ఏండ్ల ముసలమ్మ లోపలనుంచి వచ్చింది, "మీకే నండి అత్తయ్యా, దగ్గూ, పడిసెమూనట!" కేశవరావు భార్య ఎరగపడి నవ్వింది.

"నాకు జబ్బేమిటే?" అన్నది ముసలమ్మ.

"మీకు జబ్బుగా ఉందిటండి! నూట రెండు జ్వరం కూడా వస్తున్నదట! ఈయన చెబుతూ ఉంటేనే మా బావగారు," అని మళ్ళీ నవ్వింది ఆపిల్ల.

ఆ వచ్చిన మనిషి కేశవరావు తల్లి అని గుర్తుపట్టేసరికి గుండెలు జారిపోయినవి,

ఛా, ఛా, ఛా, నేను వేసిన ప్లాను అంతా పాడైపోయింది. ఈ ముసలమ్మగారు వచ్చినట్లు ఏమాత్రం తెలిసినా నాకు ఈ దరిద్రపుస్థితి వచ్చేది కాదు.

ఇంకా ఏ ముఖంపెట్టుకొని నూరురూపాయలు అప్పు అడిగేది!

అక్కడ ఒక్క నిమిషమైనా ఉండలేక పోయినాను. "మాట నాయనా, ఏమిటిసంగతి?" అని కేశవరావు తల్లి అంటున్నా వినిపించుకోకుండా గబగబా వచ్చేశాను.

ఇంటికొచ్చి ఏవో రెండు మెతుకులు తిని ముడుచుకొని పడుకొన్నాను. అసలే నేను, నాపని నవ్వుల పాలు అయిందేనని, సిగ్గుపడిచస్తూ ఉంటే ఆవిడగారు ఒకటేగోల ఏమిటిఅల్లా ఉన్నారు చెప్పమని!

ఏమని చెప్పేది? ఏం ఘనకార్య చేశానని చెప్పేది!

ఆవిడ చెప్పమని ఒకటే పట్టు బట్టింది, చివరకు చెప్పాను సంగతంతా.

జరిగిన అవమానాని గురించి, భార్యతో ఎవరైనా చెప్పుకుంటారా, తెలివి తక్కువతనం కాదా అని ఎవరైనా అనవచ్చు.

ఆవిడమీద ఎంత ప్రేమ లేకపోతే నేనుఅంత కష్టపడతాను! ఆవిషయం గ్రహించి, నేను పడ్డశ్రమనే ఆమె గాడు కానుకగా స్వీకరిస్తుందని నేను ఆశించాను.

కాంతం. కాసేపు నవ్వి. "మీరు ఇంత పిచ్చివాళ్ళేమండీ?" అన్నది.

"ఇంత శ్రమపడ్డా నేను పిచ్చివాణ్ణే అయినాను?" అన్నాను ఆమెవంక దీనంగాచూస్తూ,

"కాకపోతే ఏమిటి చెప్పండి, ఇవ్వాలిటిరోజున మీరు నాకు ఏమీ కొనియ్యనక్కరలేదే!" అన్నది.

"ఏం ?——" అన్నాను ఆశ్చర్యంగాచూస్తూ.

"నేను పుట్టిన రోజు పండగకేమన్నా. మీరు నాకు కానుక ఇయ్యాలె, తెలిసిందా?"

"ఆ......"

"నేను మెట్టినరోజు పండగకేమన్నా, నేనే మీకు ఇయ్యాలె."

"నాకేం తెలుసూ ఇదంతా?"

"ఏమీ తెలియదండీ, మీకు!" అంటూ ముఖంమీద చెయ్యివేసి, బుగ్గలునొక్కి "జరగండి" అన్నది మా కాంతం

పొలం బేరం

నలగామరాజుపాలెం దగ్గర వేణుగోపాలస్వామి ఆలయానికి చెందిన భూములు చౌకగా అమ్మేస్తున్నారని వెంకటేశ్వరరావు చెప్పిన తరువాత నాకు బహు ఆరాటం కలిగింది. ఎట్లాగైనా పది ఎకరాల భూమి సంపాదిద్దామని.

ఇన్నాళ్ళు ఉద్యోగం చేసినా ఒక సెంటు భూమి అయినా సంపాదించలేక పోయినాను. "మీకేమైనా భూవసతి ఉందా?" అని ఎవరైనా అడిగితే ఏమీ లేదని చెప్పటం చాలా సిగ్గుగా ఉంది.

ఆ భూములు ఏమంత సారవంతమైనవి కావనీ, పనికొచ్చే భూములు కావనీ కొంతమంది చెప్పారు. కాని ఏదో రకం పొలం అంటూఉంటే అదీ ఒక గౌరవమేనని తోచింది. పది ఎకరాల భూస్థితి ఉంది అని చెప్పుకోవచ్చు! ఏమీ పండకపోతే, ఈ సంవత్సరం పొలాలమీద దమ్మిడి ఆదాయం రాలేదని చెప్పుకొన్నా అదీ ఒక తమాషాగానే ఉంటుంది నిజానికి.

అదీకాక ప్రస్తుతం పండకపోయినా, ఇంకా ముందు ముందు పొలాన్ని బలం చేస్తే అదే పండుతుంది.

ఎందుకైనా మంచిది. ముందు ఆ భూమే బంగారం పండుతుందేమో ఎవరు చెప్పగలరు? కొని పడేసి ఉంచితే మంచిది. ఇల్లాగ అనేక విధాలుగా ఆలోచించాను.

ఈ సంగతి కృష్ణారావుగారికికూడా చెప్పాను. ఆయన సలహా అడిగాను. ఆయన తప్పకుండా కొనమని సలహా ఇయ్యటమే కాకుండా తానుకూడా పది ఎకరాలు కొను క్కుంటా నన్నాడు.

అసలు ఈ విషయంలో మమ్ములను ప్రోత్సాహ పెట్టింది వీరయ్యగారు. ఆయన డబ్బుగలవాడు. పెద్దఎత్తులో ఓ యాభై ఎకరాలు ఏక ఖండంగా కొని మామిడి తోట వేయించాలని ప్లానులు వేస్తున్నాడు.

మేము ముగ్గురం కలిసి మాట్లాడుకొన్నాము. మరు నాడు బయలుదేరి వెళ్ళి భూములు చూడటానికి నిశ్చయిం చాము.

కృష్ణారావుగారూ నేనూ కలిసి రహస్యంగా ఒకటి అనుకొన్నాము.

"వీరయ్యగారు యాభై ఎకరాలు కొని అక్కడే బంగాళా కట్టించి, అందులో ఉండి తోటలు వేయిస్తాడు. మనపొలాల్లో కూడా తోటలు వేయిద్దాం. ఎట్లాగూ ఆయన భూములమీద ఉంటాడు కాబట్టి మనపనికూడా చూసిపెడ తాడు" అన్నాను నేను.

"ఆమాట మీరు తెలివితక్కువగా ఇప్పుడే అన బోకండి. భూములుకొనటం పూర్తి అయినతరువాత మెల్లగా పనికూడా ఆయనకే అంటగడదాం." అన్నాడు కృష్ణారావు గారు.

ఆ మాటా నిజమే! మా పనులుకూడా ఆయనే చూడ వలసి ఉంటుందని ముందుగా చెపితే ఈగొడవ అంతా ఎవరు పడతారని ఆయన మొదట్లోనే తప్పుకొంటాడేమో!

కృష్ణారావుగారు తెలివైన సంగతే చెప్పాడనిపించింది! ఇంకో విషయంకూడా ఉన్నది!

కృష్ణారావుగారి దగ్గరగానీ, నా దగ్గర గాని డబ్బు ఏమీ లేదు. ఈ భూములు కొంటానికి ఎంత లేదన్నా చెరొక వంద కావాలె. "డబ్బు చేతిలో లేకుండా భూములు బేరం చేయటం ఏమిటి?" అని మేము అనుకోకపోలేదు. అనుకొన్నాము గాని, డబ్బు ఎట్లాగో పుట్టిస్తా మనుకొన్నాము.

డబ్బు పుట్టిద్దాము అన్నమాట మాత్రం ఇద్దరమూ కలిసి అనుకొన్నాము. ఎల్లాగు పుట్టించాలె అన్న విషయము మాత్రం ఎవరికి వారే, విడిగా, స్వతంత్రంగా ఆలోచించుకొన్నాము. డబ్బు పుట్టించే విషయంలో మాకు ప్రత్యేకమైన నేర్పు ఉంది.

మరునాడు బయలుదేరాము. "నగచ్ఛేత్ బ్రాహ్మణత్రయం," అన్నారు కాబట్టి ముందు వీరయ్యగారూ నేనూ స్టేషనుకు వెళ్ళాము. కృష్ణారావుగారు వెనకనుంచి వచ్చి కలుసుకొన్నారు.

ముగ్గురం నలగామరాజుపాలెం వెళ్ళి వెంకటేశ్వరరావును కలుసుకొని పొలాలు చూడటానికి వెళ్ళాము. మాతో అప్పలాచారి, బాపనయ్యగారూకూడా వచ్చారు. వారిద్దరూ దేవాలయానికి సంబంధించిన ఉద్యోగస్తులు.

బాపనయ్య పొట్టిగా ఎఱ్ఱగా ఉంటాడు. చదువుకొన్న వాడుకాదు. ఏదో కొద్ది చదువు చదివాడు. విద్యావంతులను చూస్తే అతనికి ఎంతో గౌరవము. వినయ విధేయతలతో మాట్లాడుతాడు.

అప్పలాచారి పొడుగ్గా, నల్లగా ఉంటాడు. లోతుకు పోయినకళ్ళు. అతనూ అట్టే చదువుకొన్నవాడుకాదు కాని వ్యవహారాలూ, రాజకీయాలూ, బాగా తెలిసిన మనిషి. అతడు పదిహేను రూపాయల జీతంమీద చాలా గొప్పగా బ్రతుకుతున్నాడు. డబ్బుగలవాళ్ళు అంటే అతనికి గౌరవం. తాను బీదవాడైనా బీదవాళ్ళను చూస్తే అతనికి అసహ్యం.

మేము కొనదల్చుకొన్న పొలాలు ఊరికి నాలుగు మైళ్ళదూరంలో ఉన్నవి. నడిచే వెళ్ళాము. అంతా అడవి. అక్కడక్కడ కొన్ని పొలాలలో వేరుసెనగ వేశారు.

రెండు గంటలు నడిచిన తరువాత మేము చేరవలసిన ప్రదేశం చేరాము. అంతా చిట్టడవి!

ఆ అడవి కొట్టించి మేము ఆ భూములు సాగుచేయించాలె! ఇల్లాంటి పని మనమేమి చేయగలము అని భయం వేసింది.

చాలాదూరం నడిచిన తరువాత బాపనయ్యగారు నిలబడి, "ఇవేనండి భూములు!" అన్నారు.

మేమంతా ఆగి చుట్టూ చూశాము. ఎక్కడా నర సంచారంలేదు. ఏవో విచిత్రమైన పక్షికూతలు వినిపించినవి.

దగ్గరలోనే ఒక చిన్నకొండ ఉన్నది. దానిచుట్టూ భూమి కాస్త పల్లంగా ఉంది. అక్కడో చెరువుకూడా ఉన్నది.

అప్పుడు నేను అనుకొన్నాను, "ఆ చెరువు చుట్టూ ఉన్న పల్లపుభూమి కొంటే బాగుండును" అని! ఎందుకంటే నేను వేరే బావి తవ్వించవలసిన అగత్యం ఉండదు. ఆ చెరువు కాస్త బాగుచేయిస్తే, నీళ్ళు బాగా నిలుస్తవి. ఆ నీళ్ళతో ఒక మంచి మామిడితోట వేయించవచ్చు.

ఈ ఆలోచన మనస్సుకు తోచటంతోనే నా రక్తం పొంగింది. ఒళ్లు ఝల్లుమంది. చక్కలిగింత పెట్టినట్లు అయింది. ఆ జలాశయానికి చుట్టూఉన్న భూమిలో పది ఎకరాలచుట్టూ గిరి గీయించి అది నేను తీసుకుందామని అనుకొన్నాను.

అయితే వీరయ్యగారు ఆ ఖండం ఖండం నంద ఎకరాలు తీసుకొంటా నంటే ఎట్లాగూ! ఎందుకు అనడూ? అని తీరుతాడు. కాస్త కష్టం వేసింది, అట్లా అంటాడు అనుకొనే సరికి. ఇంతలోనే వీరయ్యగారు అడగనే అడిగాడు, "ఆ భూములు అమ్ముతారా?" అని అటు చూపిస్తూ!

బాసనయ్యగారు అన్నారు, "ఆ భూములు అన్నీ కూడా రెండువందల యాభై ఎకరాలు. నాగపోతరావుగారు కొనివేశారు" అని.

అయిపోయింది. ఆ ఆశకూడా పోయింది. నాగపోతరావుగారిమీద భలే కోపంవచ్చింది. మాకు లేకుండా పోవా

లనే ఆయన కొన్నాడనిపించింది. లేకపోతే ఎందుకూ ఆయన గారికి ఆ పొలాలన్నీ? సరే ఏంజేస్తాము. ఆయన భాగ్యవంతుడు. ఏషియాన్నైన రంతాకొన్నా ఊరుకోవాలిసిందే!

అయితే ఇప్పుడు అమ్మకానికున్న భూములేవి?" అని వీరయ్యగారు అడిగారు.

"గుట్టకు పడమరగానూ ఉత్తరంగానూ ఉన్న అడవి అంతా అమ్మకానికే" అన్నారు బాపనయ్యగారు.

వెంకటేశ్వరరావు ఒక ప్లానుతీసి కాయితంమీద చూపాడు. ఆభూముల వివరం. వీరయ్యగారు ఆ ప్లాను చూస్తున్నారు.

కళ్ళతో చూడవలసిందేగాని కాయితంమీద చూచి నేను అర్థంచేసుకోలేను. నేను తెల్లబోయి ఉండటంచూచి బాపనయ్యగారు నా స్థితి గ్రహించి "మీరు అట్లాచూస్తే అర్థంగాదు. ఇల్లారండి, భూమితొక్కి నేనుచూపిస్తాను" అని నన్ను పిలిచారు. నేనూ కృష్ణారావుగారూ కలిసి వెళ్ళాము ఆయనతో.

ఒక ఫర్లాంగుదూరం తీసికెళ్ళి అక్కడ నుంచోబెట్టి, ఉత్తరం దిక్కుకు చూపిస్తూ "చూడండి అక్కడనుంచి, ఇదంతా ఇరవై ఎకరాలభూమి," అంటూ గాలిలో చెయ్యి తిప్పాడు. "దీనికి పడమటగా ఇటువైపు ఒకయాభై ఎకరాలు ఉంది. ఈ ఇరవై ఎకరాలూ మీరు ఇద్దరూ చేరి పది తీసుకోండి. ఆ యాభై ఎకరాలఖండం వీరయ్యగారు తీసుకొంటారు" అని సలహా చెప్పాడు.

నేనొక సంగతి అడిగాను. "అయితేచూడండి, ఆకన పడే తాటిచెట్లు అన్నీ ఇటు మాకు వస్తయ్యా, అటు ఆయనకు పోతయ్యా?"

బాపనయ్య కాస్త ఆలోచించి "అవన్నీ మీకురావు. సగం మీకువస్తయి సగం ఆయనకుపోతయ్యి" అన్నాడు.

ఆ తాటిచెట్లలో సగానికి సగం ఆయనికి పోతవి అంటే నాకు ఎంతోకష్టంవేసింది. అవన్నీ నాకేవస్తే బాగుండు ననుకొన్నాను. అందుకని "చూడండి బాపనయ్యగారూ" ఆ చెట్లు అన్నీ మనకువచ్చే పద్ధతిలో మనం గీటు గీసుకో కూడదూ?" అన్నాను.

బాపనయ్యగారు నవ్వి "అల్లాగ వీలుపడదండి. దానికి ప్లానులున్నయి" అన్నాడు.

నేను ఏమీ అనలేదు కాని "ఆ తాళ్లు అన్నీ లేక పోతే ఆ పొలం నాకు ఎందుకూ" అని మనస్సులో అనుకొన్నాను.

అదేదో అన్యాయం అనిపించిందినాకు. ఎట్లాగుఅంటే నేను చెప్పలేను గాని, అసలు ఆ తాళ్ళు అన్నీ నాకే రావాలిసినవి అనిమాత్రం మనస్సుకు తెలిసింది.

"సగం తాళ్ళూ ఆయనకు పోవలసిందేనా?" అని మళ్ళీ అడిగాను.

బాపనయ్యగారు అంతేనన్నారు. ఏంజేస్తాను! పెద్ద మనుష్యులు అల్లాగే చెబుతూ ఉన్నారు. "సరే వీరయ్య

గారినే కాజేయనియ్యి ఆ తాళ్ళన్నీ!" అని అనుకొని ఊరుకొన్నాను.

కృష్ణారావుగారు ఇంకొక సంగతి ఆలోచిస్తున్నారు.

ఈ ఇరవై ఎకరాలూ మేము ఇద్దరం పంచుకొన్నప్పుడు, ఈ ఉన్న యాభై తాళ్ళూ తన భాగంలోకి వస్తయ్యా నా భాగంలోకి వస్తయ్యా అని!

అవి అన్నీ ఒకదగ్గరే ఉండటం మూలాన ఎవరికో ఒక్కరికే వస్తవి.

వ్యవహారం అంతా నేను నడుపుతున్నాను, సహజంగా నేను ఆ భాగం తీసుకొంటాను. అప్పుడు అతనికి అన్యాయం జరిగినట్లేగా! ఇవి అతని ఆలోచనలు; బైటికి మాత్రం ఏమీ అనలేదు.

మేము ఇద్దరంకూడా ఏమీ మాట్లాడక ఊరుకోటం జూచి బాపనయ్యగారు మేము కొనటానికి సందేహిస్తున్నామనుకొని "ఆలోచిస్తే ఏమీ లాభంలేదు. నిక్షేపంలాంటి భూమి. మీరు ఇదే తీసుకోండి" అని బలవంతపెట్టాడు.

కృష్ణారావుగారూ నేనూ కలిసి మాట్లాడుకొన్నాము.

"స్వామివారి పొలాలు ఇవి. ఎకరానికి పదిరూపాయలు నజరానాకడితే" ఎగ్జిక్యూటివ్ ఆఫీసరుగారు మనపేర పట్టా ఇస్తారు. చెరి వంద రూపాయలు కట్టాలె. ఎల్లాగో తెచ్చి కడదామండీ" అన్నాను నేను.

బాపనయ్యగారు ఇంకో విషయం కూడా చెప్పారు. ఆ తాటి చెట్లు అమ్మివేయవచ్చుననీ, చెట్టుకు రూపాయిచ్చి కొట్టుకొని వెడతారనీ!

కృష్ణారావుగారు తెలివిగా ఒకమాటఅన్నారు "ఐతే ఇరవై ఎకరాలూ మనకు మూటఏత్తే వచ్చినట్లు అవుతుందీ" అని.

నిజానికి ఏత్తె చెట్లు నాభాగంలోనివి కాబట్టి, అవి అమ్మగా వచ్చిన డబ్బు నా ఒక్కడికే రావాలిగద!

కృష్ణారావు అందులో సగం భాగం కొట్టేయాలని చూస్తున్నాడు!

ఇట్లా ఉంటుందిగదా ప్రపంచం అని అనుకొని ఊరుకొన్నాను.

పొలం అని పేరేగాని అంతా అడవిగా ఉంది. "ఇది దున్నటం ఎట్లాగు? ఇందులో ఏమి పండుతుంది?" అని అడిగాను.

"ఈ మొక్కా మొడుసూ అంతాకొట్టించాలె" అన్నారు బాపనయ్యగారు.

"అదో కర్చుగాదూ? దాని కెంతఅవుతుందీ?" అని అడిగారు కృష్ణారావుగారు.

"మొక్కా మొడుసూ కొట్టి సాఫీ చెయ్యటానికి ఎకరానికి ముప్పైరూపాయలు అవుతుంది" అని బాపనయ్యగారు చెప్పారు.

ఈ మాటలు వినేసరికి మా యిద్దరికీ ఉత్సాహం చచ్చి ఊరుకొంది. ఒకరిమొగాలు ఒకరుచూచుకొన్నాము. మూడు వందలు ఖర్చు పెట్టటానికి మా దగ్గర డబ్బు ఎక్కడిది!

అంతటితో మేము చల్లబడి ఇంటికిరావలసిందే కాని ఆయన ఓ మాట అన్నారు ఏమిటంటే "ఆ మొక్కామొదుసూ అమ్మేస్తేమళ్ళీ మన ముప్పైమనకువస్తయ్యి" అని.

"ఎవరు కొంటారు ?"

"బోలెడుమంది. అదంతా కాల్చి బొగ్గుచేసి అమ్ము కొనేవాళ్ళు కొనుక్కొని వెడతారు" అని ఆయన నమ్మకంగా చెప్పారు.

ఇంకో మాటకూడా అన్నారు. "మీరు ముందు ఖర్చు చెయ్యాలిసిందల్లా ఒక ముప్పైయ్యే మొదటిసారి. ఒక ఎకరంలో కొట్టించిన మొక్కా మొదుసూ అమ్మి రెండో ఎకరం బాగుచేయించండి. అది అమ్మి మళ్ళీ ఇంకో ఎకరం! అట్లాగు! అని చెప్పాడు ఆయన.

మళ్ళీ కాస్త ధైర్యం వచ్చింది.

ఇంకో లాభంకూడా చూపించారు ఆయన ఒక ఎకరం బాగుచేయించటంతోనే అందులో పైరు వేయొచ్చునట!

ఇంకా మాకు ఏదో భయంగా ఉండి ఆలోచిస్తూ నుంచుంటె, బాపనయ్యగారు నా బుజంమీద చెయ్యివేసి అవతలకు తీసికెళ్ళి రహస్యంగా ఇట్లా అన్నారు.

ఈ పొలం చూశారూ! ఇది బంగారమే అనుకోండి. ఇక్కడ ఒకటోరకం మామిడితోట అవుతుంది. ఒక్క బావి తవ్వించుకోవాలె, అంతే! నీళ్ళు పైనేపడతవి. వీరయ్యగారి పొలానికి ఈ సౌకర్యంలేదు. మీరు అట్టే ఆలోచించక నజరానా కట్టి వెళ్ళండి."

బావి తవ్విస్తే ఎంతఅవుందని అడిగితే ఆరు వందలు కర్చుపెట్టాలన్నాడు.

అంత కర్చుపెట్టలేమని కృష్ణారావుగారు నేనూ స్పష్టంగా చెప్పేశాము.

"అయితే మీరు మామిడితోట వేసే ప్రయత్నం మానుకోవలసిందే" అన్నా రాయన నిష్కర్షగా.

మనస్సు చివుక్కు మన్నది. మామిడితోట వేసే ప్రయత్నం మానుకోవలసి వచ్చిందేనని! అప్పుడు చటుక్కున ఒక ఉపాయం తోచింది.

"వీరయ్యగారు ఎట్లాగో బావితవ్వించి తోటవేస్తాడు ఆ బావిలో నీళ్ళే మన మొక్కలకు కూడా వాడుకొంటే?" అన్నాను నేను.

"ఎట్లా?" అన్నాడు కృష్ణారావుగారు.

"ఎట్లాఏముందండీ, ఆయన మోటకడతాడా? కాలవలు తవ్విస్తాడా? అందులో ఒక కాలవ మన పొలంలోకి తీస్తే సరిపోదుటండీ?" అన్నాను నేను.

నిజమే ఆమాట— కాని వాళ్ళుమోట కట్టి కష్టపడి తోడిన నీళ్ళు నిన్ను వాడుకోనిస్తాడా?" అన్నాడు కృష్ణారావుగారు.

"ఐతే ఎట్లాగూ?" అని ప్రశ్న వచ్చింది.

"మీరుకూడా ఒక మనిషిని పెట్టి వాడిచేత తోడించి మీ చెట్లకు పోయించుకోండి" అని సలహా చెప్పారు బాపనయ్యగారు.

కృష్ణారావుగారూ నేనూకూడా చాలా సంతోషించాము, ఆయన ఉపాయం చెప్పినందుకు. వీరయ్యగారు తన బావిలోనుంచి మేము నీళ్ళు తోడుకుంటానికి ఒప్పుకుంటే ఇక మామిడితోట వేయటానికి ఏ ఆటంకమూ ఉండదు.

"కృష్ణారావుగారూ నేనూ, కూడా తోట వేయించే పక్షంలో, మాయిద్దరి తోటలకు వీరయ్యగారు నీరు ఇస్తాడా? అల్లా ఇయ్యమని అడగటం బాగుంటుందా?" అని ప్రశ్న వచ్చింది. చాలాసేపు వాద ప్రతివాదనలు జరిగినవి. చివరకు కృష్ణారావుగారు తోట వేసే ప్రయత్నం వదులుకొనేటట్టు, నేను ఒకణ్ణే ఒక ఎకరం భూమిలో తోట వేసుకొనేటట్లు నిశ్చయించాము. కృష్ణారావుగారు ఈ విషయంలో కాస్త త్యాగం చూపెట్టారు. మా యిద్దరి మధ్య పోట్లాటలు లేకుండా వ్యవహారం పరిష్కారం అయిపోయింది.

"ఇంతకూ వీరయ్యగారు నా ఎకరం తోటకైనా నీళ్ళు యియ్యటానికి ఒప్పుకొంటాడో ఒప్పుకోడో?"

"ఆ విషయంకూడా ఇప్పుడే తేల్చుకొందాములెండి" అన్నాడు కృష్ణారావుగారు.

అప్పటికి వీరయ్యగారు, అప్పలాచారి ప్లానులు చేత్తో పట్టుకొని మేమున్న చోటుకు రెండు ఫర్లాంగుల దూరంలో నుంచుని మాట్లాడుతున్నారు.

బాపనయ్యగారిని వదిలేసి మేము ఇద్దరం వెళ్ళాము అక్కడికి. అప్పలాచారి, వీరయ్యగారు ఏదో గుసగుస లాడు తున్నారు. మేము రావటంతో వాళ్ళు మాటలు ఆపేశారు.

నేను వీరయ్యగారిని అడిగాను, ఆయన తవ్వించుకొనే బావిలోనుంచి నాకు నీళ్ళు ఇయ్యమనీ, నాకోరిక న్యాయ మైనదేననీ, స్నేహితులం కాబట్టి ఒకరి కొకరం ఈ మాత్రం సహాయం చేసుకొనటం ధర్మ మేననీ కృష్ణారావు గారు నన్ను సమర్థించారు.

కాని వీరయ్య ఏంమనిషో నాకు అర్థం కాలేదు. తన బావిలోనుంచి నీళ్ళు పెట్టుకొంటానికి వీలులేదని అన్నాడు.

"ఒకసారి రెండుసార్లు అయితే పోనీలే అనుకో వచ్చుగాని అప్పనంగా ఎల్లకాలం పెట్టుకోనిస్తారటయ్యా ఎవ రన్నాను ? వెయ్యిరూపాయలు పెట్టి నేను బావితవ్వించటం ఏమిటీ, దమ్మిడీ కర్చు లేకుండా నీవు నీళ్ళు తోడుకెళ్ళటం ఏమిటి ? నేను ఒప్పుకోను."

"నీ బావిలో నీళ్ళు అయిపోతయ్యా ?"

"అయిపోయినా కాక పోయినా అల్లాంటి పద్ధతి వ్యవ హారం కాదు" అన్నాడు వీరయ్య.

నాకు కష్టం వేసింది. మోసం తలపెట్టాడు వీరయ్య గారు అనిపించింది. నేను తోటవేసే ప్లాను నేల కూలిపోయి

నందుకు కళ్ళ నీళ్ళ పర్యంతం అయింది. స్నేహితులంగదా ఈ మాత్రం సహాయానికి ఒప్పుకోకూడదా అని ఆయన మీద కోపం వచ్చింది. "అయితే నా అంటు మామిడి మొక్కలు నీళ్లు లేక చచ్చి పోవలసిందేనా మీ అభిప్రాయం ?" అని గట్టిగా అడిగాను. ఈ ప్రశ్నకు ఏం జవాబు చెపుతాడో చెప్పనీ. క్రూరంగా "నీ మొక్కలు చస్తే నాకేం ?" అంటాడేమో అని ఆయన ముఖంలోకి తీక్షణంగా చూసాను.

వీరయ్యగారు కాస్త ఆలోచించి "నువ్వు కూడా బావి తవ్వించుకో" అన్నాడు.

"నేను తవ్వించుకోగలిగితే, మిమ్ములను అడగటం ఎందుకూ ?" అన్నాను గునుపుగా.

"అల్లాగయితే ఊరుకో" అన్నాడు ఆయన నిర్మొగ మాటంగా.

నిజానికి ఆయన బావిలో నీళ్లు తోడుకోంటే ఆయనకు కలుగబోయే పెద్ద నష్టం ఏమీ లేదు. అయినా ఆయన అంత నిర్దయగా మాట్లాడాడు. అందుకని చాలా కోపం వచ్చింది.

అప్పుడు నాకు ఒక విషయం జ్ఞాపకం వచ్చింది బాపనయ్యగారు చెప్పింది.

అదేమిటి అంటే, రామపద సాగర ప్రాజెక్టు వస్తే ఈ భూములన్నీ మాగాణిభూములవుతయ్యన్నీ, పంటకాలవ నా పొలం ప్రక్కగా పోతుందనీ ఆయన చెప్పాడు.

ఆ మాట జ్ఞాపకంవచ్చి, "పోదూ; ఈయనగారు సాహాయ్యంచేస్తే ఎంత! చెయ్యకపోతే ఎంత!" అని మనస్సులో అనుకొని తృప్తిపడి ఊరుకొన్నాను.

బాపనయ్యగారు ఆ మాటే అన్నారు. వీరయ్యగారు అల్లాగ అన్నారే అని నేను చిన్నబుచ్చుకొని నుంచునిఉంటే పాపం ఆయన నన్ను కాస్త అవతలకు తీసికెళ్ళి చెప్పారు. "మీరు ఎందుకండీ అంత ఇది అవుతారు? మామిడి తోట వేయకపోతే నేమండి. ఎట్లాగో పదేళ్ళల్లో రామపదసాగరం కాలువలు రానే వస్తయి. అప్పుడు ఇది మాగానే అవుతుంది కదా! ఇక ఈ పదేళ్ళు మెట్టపంట, నిక్షేపంలాగ పండుతుంది ఈ ఖండికలో" అన్నాడు.

దానిమీద నాకు కాస్త ధైర్యంవచ్చి "అయితే ఈ భూములలో ఏమి పండుతయ్యి అండీ?" అని అడిగాను.

కృష్ణారావుగారు ఈ విషయంలో కాస్త తెలిసిన మనిషి. ఆయన "ఈ పొలాలలో జొన్న సమృద్ధిగా అవుతుంది" అన్నాడు.

"జొన్న వేసుకొంటే ఏం లాభం అండీ? వేరుసెనగ వేసుకోండి" అన్నాడు బాపనయ్యగారు.

కృష్ణారావుగారు, "నిజమే ఆ మాట; పండేటట్లు అయితే వేరుసెనగ వేస్తేనే లాభం" అన్నాడు.

ఆహార ధాన్యాలకు కరువుగా ఉన్న ఈ రోజులలో ఏదో కాస్త లాభం వస్తుందిగదా అని వ్యాపారానికి పనికి వచ్చే పంటలు పండించకూడదని నేను అన్నాను.

కృష్ణారావుగారు నవ్వి, "ఇవన్నీ పెట్టుకున్నట్లయితే ఇక బాగుపడ్డట్లే, మనకు లాభించే వ్యవహారం చూచుకోవాలె" అని గట్టిగా వాదించాడు.

చాలాసేపు వాదించుకొన్నాము.

నేను ఎంతసేపటికి దారికి రాకపొయ్యేసరికి ఆయన కోపం వచ్చి చివరకు ఏమన్నాడంటే-"మీరు లక్ష చెప్పండి నేను మటుకు జొన్న వెయ్యను వేరుసెనగ వేస్తాను. కావాలంటే మీరు జొన్న వేసుకోండి మీ పొలంలో" అని నిష్కర్షగా చెప్పాడు.

మంచిగాని చెడ్డగాని ఇద్దరం ఒక దారిని నడవాలెగాని చెరోదారి కావటం నాకు యిష్టంలేదు. అదీకాక ఆయన వేరుసెనగ వేసుకొని లాభంపొందుతూఉంటే, నేను ఒక్కణ్ణి వ్రతంపట్టి జొన్న వేస్తేమటుకు ఏం లాభం దేశానికి! అట్లా చేయటానికి మనస్సు ఒప్పింది కాదు.

చివరకు ఒక విధంగా రాజీ పడ్డాము. ఇద్దరం కూడా అయిదు ఎకరాలలో జొన్న, అయిదు ఎకరాలలో వేరుసెనగ వేసుకొనేటట్లు ఏర్పాటు జరిగినవి. ఇంతకూ ఈ భూములలో వేరుసెనగ పండుతుందా? ఆ సంగతి శాపనయ్యగారిని అడిగాము.

ఆయన, "పండకేం? బంగారంలాగ పండుతుంది?" అన్నాడు.

"ఎకరానికి ఎంత పండుతుంది?" అని అడిగాము.

"ఎకరానికి పుట్టేగదండీ!" అన్నాడు ఆయన నవ్వుతూ.

ఆనవ్వులో చాలా అర్థంఉంది. ఎకరానికి పుట్టి అన్న విషయం చాలా స్వల్పమైనట్లూ, అదిమాకు తెలియక పోవటం మా తెలివితక్కువ తనాన్ని వ్యక్తపరుస్తున్నట్లూ ఆ నవ్వులో దాగిఉన్న అర్థం.

రెండూ రెండూ నాలుగు, అన్న విషయం అందరికీ తెలిసినట్లే ఎకరానికి పుట్టి అన్న లెక్క అందరూ ఎఱిగిఉన్న విషయమే నన్నమాట!

మాకు కాస్త చిన్నతనం అయింది. అందుకనే కృష్ణా రావుగారు అన్నారు. "అది సరేలెండి. ఎకరానికి పుట్టి అని మీరు చెప్పేదేమిటి? అందరికీ తెలుసు! ఈ పొలం అంత పండుతుందా?"

ఆ ఆసామీ పొలంలోకి వెళ్ళి కాస్తమన్ను తెచ్చి అరచేతిలో పోసుకొని మాకు చూపాడు.

చూపి "చూడండి దీనికేం? ఇందులో ఏమివేస్తే పండదు?" అన్నాడు.

ఆ మట్టిలో ఉండే విశేషము ఏమిటో మాకు బోధ పడలేదు.

ఎఱ్ఱమట్టీ, ఇసుకా సమపాళ్ళుగా కలిసిన దాంట్లో గుచ్చెత్తిపోసినట్లు గులకరాళ్ళు ఉన్నవి.

రేగడి మట్టి మంచిదని మాకు తెలిసిన విషయం. వేరు సెనగకు ఇల్లాంటిదే కావాలేమో మాకు తెలియదు. పొలం

లోపుట్టి పొలంలో పెరిగిన రైతుబిడ్డ చెపుతూఉంటే ఎట్లా కాదన గలము ?

అయినా కృష్ణారావుగారు అన్నారు, "అయితే రాళ్ళూ ఇసుక ఉన్న ఈమట్టే మంచిది అంటారా ?"

"మంచిదేనా అని ఇంకా అడుగుతున్నారా ? బం గారం కాదండీ! ఇది బంగారంలాంటి భూమి" అని అన్నాడు బాపనయ్యగారు.

" ఈ రాళ్ళూ ?" అన్నాము మేము, సందేహం తీరక.

రాళ్ళు ఉంటే ఏమండీ, రాళ్ళు భూమికి బలం కాదండీ!" అన్నాడు ఆయన మా అజ్ఞానాన్ని చూచి నవ్వుతూ.

రాయి కూడా ఎరువులాగ భూమికి బలాన్ని ఇస్తుం దన్న విషయం, మేము ఇంతకు ముందు ఎప్పుడూ వినలేదు. కాని ఏమో, ఆవిషయం మనకు గట్టిగా తెలియనప్పుడు, మాట్లాడటం ఎందు కని ఊరుకొన్నాము.

మేము ఇక్కడ మాట్లాడుతూఉన్నంతసేపు, వీరయ్య గారూ అప్పలాచారీ ఆ కొసనుంచుని మాట్లాడు తున్నారు.

అప్పలాచారి ఏదో చెయ్యిత్రిప్పి చూపిస్తున్నాడు. ఆ త్రిప్పటం మా ఇరవై ఎకరాల వైపుకూడా త్రిప్పుతున్నాడు

ఏమిటో యీ సంగతి విందామని కృష్ణారావుగారూ నేనుకూడా అక్కడికి వెళ్ళాము.

మేము వాళ్ళ దగ్గరకు వెళ్ళటంతోనే అప్పలాచారి, మాట్లాడటం మాని, మా రాకను నిరసిస్తున్నట్లు చూశాడు.

ఏవో రహస్యాలు చెప్పుకొంటున్నారు. "ఏమండి మేము ఈ ఇరవై ఎకరాలూ తీసుకొంటాము. మీరు ఆ యాభై తీసుకోవటం నిశ్చయమేనా?" అన్నాను.

వీరయ్యగారు, "తీసుకొందువు గానిలే! వస్తాను. నడుస్తూఉండండి మీరు" అని, అప్పలాచారితో మాకు కొంచెం దూరంగా వెళ్ళాడు. మేము వినకూడని రహస్యాలు ఏమున్నయ్యో వీళ్ళకు? అప్పలాచారిని మేము మొదటి నుంచీ అనుమానిస్తూనే ఉన్నాము. ఆయన మమ్మలను ఇద్దరినీకూడా తెలివి తక్కువ వాళ్ళక్రింద కట్టి మాట్లాడుతూ వచ్చాడు.

ఆయన ఎగ్జిక్యూటివ్ ఆఫీసరుగారి దగ్గర గుమస్తా. ఈ భూముల విషయం కాస్త తెలిసినవాడే. అయితేమటుకు అల్లాగ మాట్లాడటం మాకు కష్టంవేసింది.

ఈ గుసగుసలుచూస్తే, అప్పలాచారి ఏదో కుంభకోణం చేసేలాగున్నాడు అనిపించింది.

ఏం చేయగలడు?

ఒకలాగ తోచింది, ఈ డబ్భై ఎకరాలు వీరయ్యగారిని తీసుకోమని ప్రోత్సహించి మాకు ఏమీ లేకుండా చెయ్యాలన్న సంకల్పం ఆతనికి ఉన్నట్లు మాకు తోచింది. ఎందుకంటే, మేము అంతా వస్తూ ఉన్నప్పుడు, అనేకసార్లు

అన్నాడు. "మీ కెందుకండీ, ఈ వెధవ పొలాలు" అనీ, "ఇక్కడ ఉండి స్వంతంగా చేసుకొనేవాడికి వీటివల్ల ఏమైనా లాభం ఉంటుంది కాని, మీరు ఎక్కడో బస్తీలో ఉద్యోగంలో ఉండి, పొలాలు కౌలుకు ఇస్తే, చారెడుగింజలు మీకు దక్కవనీ" ఇల్లాగ అనేకరకాలుగా నిరుత్సాహపరిచాడు.

మాతో ఇల్లాగ అన్నవాడు వీరయ్యగారితో పెద్ద కబుర్లు చెపటం సాగించాడు. అక్కడే ఒక బంగాళా కట్టించి, ఆ భూములన్నీ మరనాగలితో దున్నవచ్చుననీ, అంటు మామిడితోటలు వేయించి, సంవత్సరానికి రెండువేలు పెట్టుబడి పెడితే, ఎనిమిదో ఏట పెట్టిన డబ్బంతా గిరుక్కున తిరిగి వస్తుందని ఇల్లాగ మాట్లాడాడు.

వీరయ్యగారిచేత పెద్ద వ్యవసాయపు కామాటం పెట్టించి, తాను మేనేజరుగ కావాలని ఆయన ఎత్తు దానికే పాచికలు వేస్తున్నాడు.

అప్పలాచారి మాకు ఎంత అపకారం తలపెట్టాడా, మా పొలాలు మాకు దక్కకుండా చేయాలని చూస్తున్నాడే అని ఇద్దరం అనుకొన్నాము.

ఇంతలో వీరయ్యగారూ అప్పలాచారీ రహస్యాలు మాట్లాడుకొని తిరిగివచ్చారు. అప్పటికి సాయంత్రం మూడు అయింది.

రోడ్డుమీదికి వచ్చినతరువాత వీరయ్యగారు మమ్ములను "కారెక్కి ఇంటికిపొండి" అన్నారు.

"మరి నజరానా కట్టడమూ అదీ ఎప్పుడు?" అని అడిగాను నేను.

"ఏమితొందర వచ్చిందయ్యా? ఇది వ్యవహారం! తొందరపడకూడదు. మీరు ఇద్దరూ వెళ్ళండి. నేను అన్ని విషయాలు తెలుసుకొని రెండు రోజులలో వస్తాను. ఈ లోపున సొమ్ము జాగ్రత్త చేసి ఉంచండి" అన్నాడు.

"పాపం వీరయ్యగారు మా ఎడల మోసం ఏమీ తల పెట్టలేదు. ఆ అప్పలాచారి. ఏదైనా చెప్పినా వినే మనిషి కాదు" అనుకొని సంతోషించి, ఆ రోజు రాత్రి తొమ్మిది గంటలకల్లా ఇళ్ళకు చేరాము.

అంతవరకూ మా ఆవిడతో ఈ విషయం ఏమీ చెప్పలేదు. ఇప్పుడు చెప్పాను, పది ఎకరాలు కొంటున్నానని ఆవిడ చాలా సంతోషించింది. "మెట్ట పొలాలు అయితే మటుకేం, మంచి భూములు అయితే వాటివల్లకూడా చాలా లాభం ఉంది" అన్నది.

"ఈ పది ఎకరాలలో అయిదు ఎకరాలు నీ పేర కొంటాను. ఆ అయిదు ఎకరాలలో ముందు ముందు వచ్చే ఆదాయం అంతా నీ ఇష్టం ప్రకారం వాడుకోవచ్చు" అన్నాను సంతోషించింది.

ఆ పొలాలలో వేరుసెనగ పండుతుందనీ ఎంత లేదన్నా ఎకరానికి ఖర్చులుపోను అరవైరూపాయలు మిగులుతవనీ కూడా చెప్పాను.

ఆవిడ లెక్కజూచుకొని సంవత్సరానికి మూడువందల రూపాయలు వస్తవిగదా అనుకొన్నది.

సంవత్సరానికి నాలుగైదు నవరసులు కొనుక్కో వచ్చునని కూడా ఆమె అనుకొని ఉంటుంది.

కృష్ణారావుగారి భార్య మా యింటికొచ్చి, "వదినా మీ అన్నయ్య పొలాలుకొంటున్నారువిన్నావా?" అన్నది.

"మా ముసలాయన, మీ ఆయనా కలిసే వెళ్లారుగా ఇద్దరు చేరి పది ఎకరాలు కొంటారని నాకూ చెప్పారు రాత్రి" అన్నది మా ఆవిడ.

ఆ తరువాత ఈ విషయం మా పేటలో అందరికీ తెలిసింది. ప్రతివాళ్ళూ నన్ను అడిగేవాళ్ళే; "ఏమయ్యా భూములు కొంటున్నావుటగా! ఈ బుద్ధి పది ఏండ్ల క్రింద ఉంటే ఈ పాటికి బోలెడు ఆస్తి సంపాదించేవాడివి" అని కొంతమంది అన్నారు.

మొత్తంమీద మా పేటలో నన్ను చూచి చాలామంది సంతోషించారు. నాకు కాస్త ప్రాముఖ్యము వచ్చింది. ఇది వరకు ఎప్పుడూ నన్ను జూచి తలవంచుకు పోయేవాళ్లు ఇప్పుడు నిలబడి నమస్కరిస్తున్నారు.

వీరయ్యగారు ఎప్పుడు వస్తారా అని కృష్ణారావు గారూ, నేనూ కనిపెట్టుకొని కూర్చున్నాము.

ఆయన వచ్చీ రావటంతోనే, వందరూపాయలూ నజరానా కట్టాలని నేను అనుకొన్నాను. ఆయన ఆ మరునాడు రాలేదు మూడోనాడు వచ్చాడని తెలిసింది.

ప్రొద్దున పదకొండు గంటలవేళ నాకు ఆయన వచ్చిన సంగతి తెలిసి వెంటనే వెళ్ళాను.

నాకంటేముందే కృష్ణారావుగారు వచ్చి వాళ్ళ అరుగు పైన కూర్చున్నారు.

వీరయ్యగారు భోజనంచేసి బయటికి వచ్చి మాదగ్గర కూర్చున్నారు. నేనే సంగతి ఎత్తి, "మరి భూములు కొనే విషయం ఎల్లాగ నిశ్చయించారూ ?" అని అడిగాను.

ఆయన ఒక గొడవ చెప్పాడు. ఆ భూములన్నీ దేముడివి. ఈ బోర్డువారి కిందికి రాకముందు, ఆ దేవాలయానికి ఒక జమీందారుగారు ధర్మకర్తగా ఉంటూ ఉండేవారు.

ఆయన ఈ అడవి అంతాకూడా పెద్ద పెద్ద ఖండాల క్రింద విభజించి అమ్మేశాడు. ఎవరో జమీందార్లు సాహుకార్లు అవి కొన్నారు. వాళ్ళపేరున పట్టాలు పుట్టించి ఇచ్చాడు ఆ జమీందారుగారే.

ఈ సాహుకార్లూ వాళ్ళూ ఆ భూములు కొన్నారన్న మాటేగాని అవి ఎక్కడున్నయ్యో వాళ్ళకు తెలియదు. కొనిపారేసి వాటివిషయమై పట్టించుకోలేదు.

ఈలోపున గ్రామంలోని రైతులు ఆ భూములలో తమ పశువులను మేపుకొంటూ, పుల్లాబుట్రా కొట్టుకొని వెడుతూ వానిని భుక్తపరచుకొన్నారు. ఆ రైతులకు సాహుకార్లకు తగాదాలుగా ఉండి, రైతులు భూములు మావేనని అంటున్నారు.

దేవాలయం బోర్డువారి ఆధీనంలోకి వచ్చినతరువాత, వారు ఈ విషయం అంతా విచారించి ఇదివరలో జమీందారు గారు ధర్మకర్తగా ఉన్నప్పుడు, అడవి అంతా అమ్మిన వ్యవహారం అక్రమమనీ, రైతులు నజరానా కట్టకుండా ఆక్రమణ చేయటమూ అక్రమమేననీ, తీర్పుజేసి నజరానా కట్టి సాగు చేసుకొనేవారికి భూములు ఇయ్యవలసిందని ఆర్డరు వేశారట.

ఇప్పుడు ఆ భూములు బోర్డువారు మనకిస్తారు కాని రైతులు మనకు అడ్డుతగులుతారు. అంతగా మనం ఎట్లాగో భూములు స్వాధీనం చేసుకొంటే, సాహుకారు అప్పుడొచ్చి ఆ భూములు తనవి అని కూర్చుంటాడు. కోర్టులచుట్టూ తిరగాలె.

ఈ రైతులు అసలు మనలను పొలంలో కాలుపెట్టనివ్వరు! ఇంత వ్యవహారం ఉంది. నేను అక్కడున్న రెండు రోజులూ ఈ వ్యవహారానికి సంబంధించిన కాయితాలన్నీ చూచివచ్చాను. మనకేం లాభంలేదు'' అని చెప్పాడు.

మా యిద్దరికీ చాలా విచారం కలిగింది. ఆ భూములే కొనుక్కొని చిక్కులలో పడటంకూడా అదొక మర్యాదే! అది మాకు దక్కలేదే అని కష్టం కలిగింది. ఇంతకూ ప్రాప్తం లేకపోయింది.

అప్పుడే నేను అడిగాను కృష్ణారావుగారిని. ''ఏమండీ మీరు సొమ్ము సిద్ధంచేసే ఉంచారు కాబోలును'' అని.

ఆయన అప్పుడన్నాడు. "లేదండీ వీరయ్యగారినే ఈ భూములు కొంటానికి ఓ వందరూపాయలు అప్పు అడుగుదామనుకొన్నాను! ఆయనకు ఈ భూములు ఎవ్వరూ కొనటం ఇష్టం లేదావె. ఆయనా కొనటం లేదావె! అల్లాంటప్పుడు మనకు ఇస్తాడా అని అడగలేదు. మీరు డబ్బు రెడీగా పెట్టుకొని కూర్చున్నారు కామాలు ఏం?"

"ఏబ్బే, నేనూ వారినే అడుగుదామనుకొన్నాను. ఇట్లా అయిపోయింది" అన్నాను.

ఆదర్శ జీవులు

శకుంతలా సుదర్శనుల వివాహం అయిపోయిన తరువాత ఒక వారంరోజులవరకూ ఊరు ఊరంతాకూడా ఆ విషయాన్ని గురించే మాట్లాడుకొన్నారు. కారణం ఏమిటీ అంటే ఆ పెళ్ళి అన్ని పెళ్ళిళ్ళలాగ జరగలేదు.

పెళ్ళికి పూర్వమే సుదర్శనం ఇంటికి శకుంతల రావటం, శకుంతల ఇంటికి సుదర్శనం రావటం జరిగింది. వాళ్ళిద్దరూ కలిసి బహిరంగంగా మాట్లాడుకొనేవాళ్ళు, ఇద్దరూ కలిసి సినిమాకో, నాటకానికో, పార్కుకో వెళ్ళుతూ ఉండేవాళ్ళు.

సంఘంలో కొంతమందికి ఇది విపరీతంగానే వుండేది. "వాళ్ళిద్దరూ పెళ్ళి చేసుకొంటారట! చూశావా ఎంత అన్యోన్యంగా ఉన్నారో!" అన్నది ఒకావిడ. ప్రక్కనే నుంచున్న ముసలమ్మ ఆశ్చర్యపోయి, ముక్కుమీద వేలేసుకొని, "ఆరి, వీళ్ళమ్మ కడుపులు బంగారంకానూ, చెట్టాపట్టాలు పట్టుకొని తిరుగుతున్నారే. ఎంత మొగుడూ పెళ్ళాలు అయితేమటుకు? అయినా యింకా మూడు ముళ్ళూ పడందే" అన్నది.

ప్రక్కనే ఆ ముసలమ్మ మనుమరాలు ఆవిడను చెయ్యి పట్టుకొని లాగి, "ముసలిదానవు నీకేం తెలుసే ఇప్పటి కాలపు సంగతులు. వాళ్ళు ఎవరో తెలుసా? శకుంతలా సుదర్శనమూను. ఇద్దరూ పెద్ద చదువులు చదువుకున్నారు. ఇద్దరూ కలిసి మన ఊరు, మన దేశం బాగుచేస్తా"రని మా హెడ్ మాస్టరు చెప్పాడు.

"ఓసి భడవా. నీ కడుపులో ఎన్ని ఊహలున్నాయే. అయితే నీకూ పెద్దవాళ్ళలాగే తిరగాలని అనిపిస్తున్నదా. ఏమిటి ఖర్మం! ఇకచాల్లే ఇంట్లోకిరా అని ముసలమ్మ ఆ పిల్లను లోపలికి లాక్కుని వెళ్ళింది. పెండ్లికి ముందు ఇల్లాంటి ముచ్చట్లు ఎన్నో జరిగినవి. పెండ్లి చేసుకోబోయే వారికి శకుంతలా సుదర్శనుల దాంపత్యజీవితంలోనే, ఈ ప్రథమ స్కంధం ఆవర్శము కాక తప్పదని కాస్త తెలిసిన వాళ్ళు అనుకొన్నారు.

పెళ్ళికి కొన్నిరోజులకు పూర్వమే పెళ్ళి ఎల్లాజరగాలె అని చాలా పెద్ద చర్చ జరిగింది. కామేశ్వరరావూ, సుదర్శనం శకుంతలా, ఈ ముగ్గురూ కూర్చుని మాట్లాడుకొన్నారు.

పూర్వాచారానుగతంగా మేళతాళాలు ఉండాలె. పచ్చనితోరణాలతో ఇల్లు కళకళలాడుతూ ఉండాలె. పేరంటాళ్ళ వెకవెకలూ పెళ్లిపెద్దల కేకలూ ఉండాలె, వదినా మరదళ్ళు, అక్కలు, బావలూ, బావమరదులూ సరసం ఆడుకోవాలె; బుక్కాయి చల్లుకోటాలు, బూజంబంతులు, బెద్దబాకాలు, బోగం మేళాలూ ఉండాలె. ఢోళ్ళూ, దండా డింపులు ఉండాలే, వియ్యపురాలి బెట్టూ, వియ్యంకుడు గుట్టూ, గిల్లికజ్జాలు, చెండ్లాటలు, పడుచుపిల్లల గలగలలూ ఉండాలె; వీటి అన్నిటితో హడావుడిగా పెండ్లిజరగాలె అని కామేశ్వరరావు వాదించాడు. సుదర్శనం శకుంతలా కూడా పెద్దగా నవ్వేశారు.

శకుంతల హృదయాన్ని అడిగి తెలుసుకొని ఇవ్వన్నీ అవసరమని నిశ్చయించింది. "సుదర్శనం నీ భర్త అని నా అంతరాత్మ చెప్పింది" అతడు నా భర్తే. ఈవిషయం ఇంత హడావిడిగా అందరికీ తెలియపరచ నక్కర లేదనుకుంది సుదర్శనం ఈవిషయాన్నే వైజ్ఞానికదృష్టితో విమర్శించి, ఇదంతా వ్యయంతో కూడుకొన్నపని అనీ, అనవసరమనీ, దాంపత్యాశయము విలాస ప్రతిపాదన కాదని వాదించాడు.

శకుంతలా, సుదర్శనంకూడా విషయాన్ని భిన్నదృష్టులతో చూచినా ఒకే తీర్మానానికి వచ్చారు. వాళ్ళ ఇష్టానికి వ్యతిరేకంగా చెపితే శకుంతలగాని, సుదర్శనం గాని వినరని అటువేపూ ఇటువేపూకూడా తల్లితండ్రులకు తెలుసు. అందుకని వాళ్ళు మాట్లాడ లేదు. కామేశ్వరరావు మటుకు ఏం జేస్తాడు! మెదలకుండా ఊరుకొన్నాడు. చివరకు, అట్టే హడావుడి లేకుండా ఒక శుభ సమయంలో సుదర్శనం శకుంతల మెడలో తాళిబొట్టు కట్టాడు. అందరూ తలోక విధంగా అనుకొన్నారు. ఇదేం పెళ్ళమ్మా బుడబుడా అయిందంటే అయిందనిపించారు! ఒక తలుపుదగ్గర పాట లేదు! పాన్పు వేయడం లేదు! పవ్వళింపుపాట లేదు! ఏంపెళ్ళో! ఏం లోకమో! అని ఒకావిడ చెక్కిళ్లు నొక్కుకున్నది.

"ఏమే పిల్లా దంపత్తాంబూలమైనా ఇప్పించలేదు" ఎంత చదువుకొంటే మటుకు ఇదేమిటే అమ్మాయ్? అని ఒక ముసలావిడ శకుంతలనే బుగ్గా బుగ్గా పొడిచి అడిగింది.

"మొగుడు పేరు చెప్పించనే లేదట పెళ్ళిలో, పోనీ ఇప్పుడైనా చెప్పు, మా సరదా ఎట్లా తీరాలె!" అని సరస మాడింది ఒకావిడ.

ఇవన్నీ అర్థంలేని ఆచారాలనీ, పిచ్చినమ్మకాలనీ శకుంతలకు గట్టినమ్మకం. స్త్రీలలో విద్యావ్యాప్తిచేసి, సంఘంలో పాతుకపోయిన ఇల్లాంటి వ్యర్థమైన ఆచారాలనూ వాటినీ నిర్మూలం చెయ్యాలనీ కూడా శకుంతల గట్టిగా నిశ్చయించుకొంది. ఈ ఆడవాళ్ళ మాటలకు అప్పటికే నవ్వుకొన్నది. ఎవ్వరేమనుకొంటేనేమి? శకుంతలా సుదర్శనులు వివిధ దృక్పథాలనుంచి ఈ విషయాన్ని చూచి, ఇద్దరూ ఈ ఆచారాలను నిరసించారు. తెలియని ఆడవాళ్ళు అల్లా అన్నా, తెలిసిన వాళ్ళంతా ఈ పద్ధతిలో వివాహం జరగటాన్ని చాలా మెచ్చుకొన్నారు. ఈ విధంగానే ఇకముందు వివాహాలు జరగాలె నని ఇదే ఆదర్శమని కూడా అన్నారు. ఆ దాంపత్య కల్పతరువుకు ఇది ద్వితీయ స్కంధం.

ఆదర్శ జీవితం జీవిద్దాము అని ఆశించడమే కాని, తమ ఆదర్శాలు ఇవి అని శకుంతలా సుదర్శనులు ఇంతవరకు అనుకొని ఉండలేదు. గృహస్థాశ్రమములో ఇప్పుడు వాళ్ళు జీవితాన్ని సార్థకంగా గడపటానికి పూనుకొన్నారు.

మొదటినుంచీ వారు అనుకొన్నది ఏమిటంటే, భార్యాభర్తలు ఒకరినొకరు అర్థంచేసుకోవాలె. వారిద్దరి మధ్యా సానుభూతీ, అనురాగమూ, విశ్వాసమూ, స్వేచ్ఛావుండాలె. ప్రశాంతంగా ఆనందంగా, కాలం గడిచిపోవాలె అని, అప్పుడే

వారిది ఆదర్శ దాంపత్యము అవుతుంది. ఇది సాధించడం ఎల్లాగు అని ఇద్దరూ ఆలోచించారు.

సుదర్శనం అన్నాడు "జ్ఞానజ్యోతి ఉంటే జీవిత నౌకలు చీకటి కోనల్లోనుంచి ఉత్తుంగ తరంగాల మీదుగా నైన సరే నడిపించుకు పోవచ్చు. జ్ఞానసముపార్జన చెయ్యటం అవసరము అన్నాడు. శకుంతలకూడా ఆతనితో పూర్తిగా అంగీకరించింది. వారిద్దరూ కలిసి దేశ దేశాలలోని రేడియో ప్రసంగాలు వింటారు. చర్చించుకుంటారు. మంచి మంచి పుస్తకాలు ఇద్దరూకలిసి చదువుతారు. వాటినిగురించి చర్చించుకుంటారు. కాలం బాగానే గడిచిపోతున్నది.

సుదర్శనానికి ఎప్పుడూ వైజ్ఞానిక దృష్టే. జ్ఞానసముపార్జనకై తోడ్పడని విషయాలపై అతనికి అంతగా ఆసక్తి లేదు. అనవసరమైన నవ్వులాట, తమాషా ఇల్లాంటివి లేవు. వృక్ష, జంతు శాస్త్రాలకు చెందిన విషయాలపై అతనికి మక్కువ. మనుష్యుల మాటలతో కంటే, పక్షుల కూతలలో అతనికి అందం కనిపిస్తుంది. వీరిని గురించీ వారినిగురించి కథలూ కబుర్లూ అతనికి ఇష్టంలేదు. విలువైన కాలాన్ని ఇవి వృథాచేస్తవి అంటాడు.

కామేశ్వరరావుఅప్పుడప్పుడువస్తూఉండేవాడు. అతడు కాసేపు ఉండిపోతే ఒక సుడిగాలి వచ్చి పోయినట్లుండేది. ఏవోకోతలు కోసేవాడు. కబుర్లు చెప్పేవాడు, నవ్వించేవాడు.

శకుంతలకూడా అతనితో కలిసినవ్వేది. కాని సుదర్శనం నవ్వేవాడు కాడు. ఒక బృహత్తార ఆకాశంలో తన దారిని పొయ్యేది పోక, ఏవో కొన్ని కారణాలచేత సూరు

నికి సమీపంలోకి వస్తున్నదట; వస్తే సూర్యునిలో కలిగే మార్పులకు ఫలితంగా, భూమిమీద సముద్రాలన్నీ ఒక్కసారి పొంగిపోతై, అగ్నిపర్వతాలు పేలిపోతై, అనే పరిశోధకుల వ్రాతలు గమనిస్తున్నాడు. ఆ తార ఇంక కొంచెం తప్పుకు పోతే యే ఉపద్రవమూ ఉండదు. ఈ విషయమై అతడు తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

కామేశ్వరరావు "గిండీ" గుర్రపు పందాలను గురించి ఉత్సాహంగామాట్లాడుతూవుంటే, శకుంతలవింటూవుంటుంది ఇదిఅనవసర కాలయాపనఅనిసుదర్శనానికి అంతగానచ్చలేదు.

కామేశ్వరరావు, శకుంతలకు కథలూ, పద్యాలు చదివి వినిపించేవాడు. సరసం ఆడేవాడు చమత్కారంగామాట్లాడే వాడు. శకుంతల గంటలకొద్దీ అతనితో కాలం గడిపేది. ఈ ప్రసంగాలు ఆమె ఆదర్శాన్ని ఏమీ భగ్నంచేయలేదు.

అయితే ఇల్లాగ నవ్వులాటలో ఒక్కక్షణమైనా గడపటం సుదర్శనానికి అంతగా ఇష్టంలేదు.

"ఈ నవ్వులూ, వినోదాలు, ఆయనకు ఇష్టంలేదు. ఇల్లాగ కాలం వృథాచేయటం నాలో ఒకలోపం అనికూడా అతడు అనుకోవచ్చు అయినా వచ్చిన ప్రమాదం ఏమీ లేదు. నా లోపాలను ఆయన ప్రేమిస్తాడు, సంస్కరిస్తాడు. అంతగా అయితే"...అయినా నాకు ఇదేమో తప్పుపనిగా కనపడటం లేదు అని అనుకొంది శకుంతల ఈ విషయాన్ని గూర్చి బాగా ఆలోచించి.

సుదర్శనమైనా ఏమీ అనలేదు. శకుంతల జీవితంతాను జూపిన దారినే నడవాలని అతనికేమీ పట్టుదలలేదు. మన

స్సులో కాస్త కష్టంగాఉన్నా, అతని మనస్సులోని భావాలను తెలుసుకొని శకుంతలమాత్రం కొంత ఆందోళన పొందింది.

శకుంతలా సుదర్శనులు ఎవరి ధర్మాలను వారు, ఎవరి ఆదర్శాలను వారు రక్షించుకొంటూ హాయిగా జీవిస్తున్నారు. ఎవరిస్వేచ్ఛ వారిది. ఇద్దరూ పరస్పరం ప్రేమించుకొంటున్నారు. ఒకరి ఎడల ఒకరికి అనురాగం ఉంది. వారి స్నేహితులంతా అనుకొన్నారు వారిది ఆదర్శ దాంపత్యమని. కొంత కాలం గడిచింది. శకుంతలా సుదర్శనులు కేవలమూ గృహస్థాశ్రమ విధులను నిర్వహించడంలో తృప్తినిపొందటంలేదు. శాయశక్తులా మనము సంఘానికి సేవచేయడం తమవిధి అనుకొన్నారు.

సుదర్శనానికి తోచిన విషయము ఏమిటీ అంటే, ప్రజలను విజ్ఞానవంతులుగా చేయాలని, అనారోగ్యానికీ, దారిద్ర్యానికీ కారణం అజ్ఞానం. ప్రజలలో విజ్ఞానం వ్యాపిస్తే, గ్రామాలు బాగుపడతవి. అస్పృశ్యత అనేమాట ఉండదు. ఐకమత్యము ఏర్పడుతుంది. ఎన్నో సాంఘిక సమస్యలకు చెందినచిక్కులు విడిపోతవి. విజ్ఞానం ప్రజలలో వెదజల్లడానికై అతడు కృషి చేయడానికి నిశ్చయించాడు. కొన్నాళ్ళకి శకుంతలా సుదర్శనాల కృషివల్ల ఊళ్ళో ఒక సేవాసమితి స్థాపించారు కూడాను. ఆ సంఘము తరపున, వైజ్ఞానిక విషయకమైన చర్చలు, ఉపన్యాసాలు ప్రసంగాలు జరుగుతూ ఉంటవి. బాలురకు ఒక పాఠశాల నడపటానికికూడా నిర్చయించు

కున్నారు. క్రమంగా ఒక వితంతు శరణాలయం స్థాపించి అందులో చేరినవారికి తగినంత ఉన్నత విద్యాభ్యాసం కలిగిన తరువాతనే కాని వివాహం చేయకూడదు అని నియమం ఏర్పరచారు.

శకుంతల భర్త ఉద్దేశాలను గ్రహించి, అతనికి చేదోడువాదోడుగా ఉంటోంది. సంఘంలో ఉండే అర్థంలేని ఆచారాలను పిచ్చి నమ్మకాలను పోగొట్టాలని వారు సంకల్పించుకొన్నారు. అతనికి ఉపన్యాసాలంటే చికాకు. కాని శకుంతల మహిళాసమావేశాలలో అనేక సాంఘిక విషయాలు, విజ్ఞాన విషయాలు వీనిని గురించి ఉపన్యాసాలు ఇస్తూ ఉంటుంది. ఇల్లాగ ఏకముఖంగా సంఘసేవ చేయటానికి అవకాశం కలిగింది.

కామేశ్వర్రావు వీరిద్దరికీ కొంతవరకే తోడ్పడుతున్నాడు. ఈ పిల్లవాళ్ళందరికీ చదువు వచ్చినారాకపోయినా ఒకటే అతనికి. ఈ వితంతులకు చదువు రాపటంలేదే అనిగాని, వివాహాలు కావటం లేదే అనిగాని అతనికేమీ దిగులు లేదు. ఏ బాధా లేకుండా ఏ దీక్షా లేకుండా తనకు తోచిన సాయం చేస్తున్నాడు. శరణాలయంలో కాస్త తెలివైన పిల్లలను చేరదీసి వాళ్ళకు కథలు కబుర్లు చెపుతాడు. ఉమార్ ఖయ్యాం చదివి వినిపిస్తాడు, నవ్విస్తాడు.

శకుంతల తమ దాంపత్యజీవితం ఆనందంగా గడపటం ప్రధానంగా పెట్టుకొంది. ఇతర విషయాలలో భర్తకు తోడ్పడుతున్నా అందులోనే మునిగిపోదు.

సుదర్శనానికి దీక్ష, పట్టుదల ఎక్కువ విజ్ఞానసము పార్జనమూ. ఆ జ్ఞానము సంఘంలో వ్యాప్తిచేయటం, ఈ రెండే అతని కర్తవ్యాలు. ఇంటాబయటా కూడా దీనికి భిన్న మయిన విషయాలమీద అతనికి ఆసక్తిలేదు.

పట్టులోనూ, కార్యదీక్షలోనూ, కొద్దిభేదం ఉన్నా, ఆదర్శ విషయాలలో భార్యాభర్తలు ఏకముఖంగా నడుస్తు న్నారు. వారి సాంఘిక సేవకూడా ఇల్లాగ ఆదర్శప్రాయ మైంది.

ఒకరోజున ఒక తమాషా జరిగింది. సుదర్శనం కాయి తాలు ముందేసుకొని చాలా తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. న్యూజిలాండులో యావరేజి జీవితం ౭౦ ఏండ్లు. కెనడాలో, ఫ్రాంసులోకూడా దగ్గర దగ్గర ౬౦ ఏండ్లు. ఇండియాలో ముప్పై యేండ్లకు తక్కువ. ఇట్టిదుస్థితికి సమాజం ఎంతవరకు బాధ్యత వహించింది ! ఈ విషయాన్ని గురించే అతడు ఆలో చిస్తున్నాడు.

శకుంతల తనగదిలో అలంకరించు కొంటున్నది. సన్నని ఉప్పాడ జరీ చీర కట్టింది. గులాబి రంగుగల పట్టుంచు రవిక తొడిగింది. మెడలో రెండుపేటల బంగారు గొలుసు మెరిసి పోతున్నది. చెవులకున్న రవ్వల దుద్దుల కాంతి ఆమె ముఖానికి వింత సోయగాన్ని చేకూర్చినది. ఆమె తలదువ్వుకొని, అర్థచంద్రాకారంగా పూలు పెట్టుకొని అద్దంలో చూచుకొని నవ్వుకొన్నది.

సుదర్శనం ప్రక్క గదిలో పెన్సులు కొడుతున్నాడు. సంఘసమస్యను గూర్చి ఆలోచిస్తూ. శకుంతల సుదర్శనంగది లోకి ఏదో కావలసినదానిలాగ రెండుమూడుసార్లు వచ్చింది. దేనికోసమో చూచి వెళ్ళిపోయింది.

చక్కగా అలంకరించుకొన్న భార్యను సుదర్శనం చూచాడు గాని అతని ముఖంలో ఏ విధమైన మార్పూ రాలేదు. ఆ నిమిషంలో కైలాసంలో మనిషి అరవై సంవత్సర ములు బ్రతికివుండటానికి కారణాలు ఏమై వుంటున్నాయి అని అతడు తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

శకుంతల తన గదిలోకి వెళ్ళి కూర్చుని ఆలోచించింది. పాపం ఆయన ఏదో తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. ఆయనయందు తనకు సానుభూతివుండాలె ఎందుకు లేదూ? ఎప్పుడూ సానుభూతి చూపుతూనే వుంది. కాని ఇంత అందంగా సింగారించుకోవడం అతను మెచ్చుకోవాలని ఆమె కోరిక. శకుంతల గదిగుమ్మం దగ్గరకు వెళ్ళి విలాసంగా చిటిక వేసింది. సుదర్శనం తల ఎత్తి చూచాడు. శకుంతల రమ్మని సంజ్ఞ చేసింది.

"ఎందుకూ?" అన్నాడు సుదర్శనం.

శకుంతల జవాబు చెప్పక నవ్వి గిరుక్కున తిరిగింది. మల్లెపూలు సువాసన సుదర్శనం గదిలోకి కూడా వ్యాపించింది.

సుదర్శనం లోపలికివచ్చి నుంచున్నాడు. శకుంతల అద్దంవైపు తిరిగి కుచ్చెళ్లు సవరించుకొంది. వెనకాలనుంచి

వచ్చి, కళ్లు మూస్తాడో, ఇంకా ఏమన్నా తమాషా చేస్తాడో ఏమోనని అనుకొన్నది.

సుదర్శనం కాసేపు నుంచుని—"ఎందుకు రమ్మన్నావ్" అన్నాడు.

శకుంతల ఉలిక్కిపడి తిరిగిచూచి "వచ్చారా?" అని నవ్వింది.

"ఎందుకు రమ్మన్నావూ?" అని మళ్ళా అడిగాడు సుదర్శనం.

సుదర్శనాన్ని ఎందుకు రమ్మన్నదో శకుంతలకు చటుక్కున జ్ఞాపకం రాలేదు. ఎదురుగా చూస్తూ నుంచున్నది. చివరకు అన్నది–"ఏమీ లేదు నేను మీటింగుకు వెళ్ళేదా?"

"ఏమిటా మీటింగు? ఎక్కడ?" అని అడిగాడు సుదర్శనం. శకుంతల చెప్పింది: "ఆదర్శదాంపత్యము – మన ప్రత్యేక వ్యక్తిత్వము" అనే విషయాన్ని గురించి, ఉపన్యాసం ఇస్తాను ఇవ్వాళ అని.

మంచిది చాలా సంతోషము" అన్నాడు సుదర్శనం కాస్త దూరంగా నుంచుని.

శకుంతలకు వెళ్ళిపోడానికి బుద్ధిపుట్టలేదు. ఏదో ఒక పెద్ద సందేహము ఆమెను బాధిస్తున్నది. చివరకు ఆ సందేహము కాస్తా బయట పెట్టింది.

"ఇప్పుడే వెళ్ళేదా, కాసేపు ఉండేదా?" అని భర్తను కాస్త సమీపించింది.

"అది నీ ఇష్టం" అన్నాడు సుదర్శనం.

"అయితే నేను వెడతాను" అన్నది గునుస్తూ.

"ఊఁ——వెళ్ళు నేను వద్దన లేదే" అని సుదర్శనం తన గదిలోకి వెళ్ళి మానవజీవితం సుదీర్ఘం చెయ్యడానికి ఉపాయాలు ఆలోచించటం మొదలుపెట్టాడు. ఆమె తనగది పక్కనించి వెళుతూ వుండగా, గదిలోకి విసిరిన మల్లెపువ్వుల పరిమళం అతన్నేమీ కలతపెట్ట లేదు.

ఇల్లాంటి తమాషాలు అప్పుడప్పుడు జరుగుతుండేవి. కాని ఒకరి నొకరు అర్థంచేసుకొన్న తరువాత వీటివలన వచ్చే ప్రమాదం ఏమీ లేదు.

కాలం గడిచిపోతున్నది. శకుంతలా సుదర్శనాలు. విజ్ఞానవ్యాప్తికి, కృషి చేస్తున్నారు. కాని లోకం వీళ్ళను అర్థం చేసుకోలేదు. వాళ్ళ పెండ్లినిగురించి, సనాతన ధర్మనిరసనను గురించి, వితంతు శరణాలయాన్ని గురించి, వారి సాంఘిక సేవను గురించి లోకంలో బోలెడు వదంతులు పుట్టినవి.

వెండికంచం

కానీకి ఒకటే విస్తరి!

రోజుకు నాకు రెండు విస్తళ్ళు కావాలె. మాఆవిడకు రెండు. మొత్తంనాలుగు. నాలుగూ ఒకఅణా. ఈలెక్కని నెలకు సుమారు రెండురూపాయలు విస్తళ్ళకింద ఖర్చు అవుతున్నది.

ఒక వెండికంచం కొనుక్కుంటే బాగుండు! వెండికంచం కొనుక్కుంటే, నెలకు రెండు రూపాయల చొప్పున సంవత్సరానికి అయ్యే ఇరవై నాలుగు రూపాయలూ ఆదా అయిపోతుంది.

వెండికంచం ఎనభై రూపాయలు పెడితే వస్తుంది, ఎన్నాళ్ళు అయినా ఉంటుంది. దానికి పెట్టిన ధర నాలుగేండ్లలో తిరిగి వచ్చినట్లే లెక్క!

ఆ తరవాత ఆ కంచం మనకు ఊరికే వచ్చినట్లే. పైగా నాలుగు ఇరవైనాలుగు రూపాయలు ఆదాకూడా.

ఒక కంచం కొంటే! అర ఎకరం పొలంకొని పారేసినట్లే! అరఎకరంమీద అంతకంటె ఎక్కువ ఆదాయం రాదు.

ఇల్లాగ వచ్చిన ఇరవైనాలుగు రూపాయలలో, ఓ నాలుగు ఎందుకైనా పోయినా నికరంగా ఇరవైరూపాయలూ మిగలవలసిందే!

ఇరవై ఏండ్లలో నాలుగు వందలు!! అదేమీ చిన్న మొత్తం కాదు!

ఇంకొక తమాషాకూడా చెయ్యవచ్చు! ఏ సంవత్సరం మిగిలిన ఇరవై ఆ సంవత్సరం వడ్డీకి వేస్తూ ఉంటే ఇరవై ఏండ్ల తరువాత వెయ్యిరూపాయలు అవుతయి.

ఈ వెయ్యికీ ఇంకొక వెయ్యి కలిసి ఒక ఇల్లు కట్టుకోవచ్చు.

ఆలోచిస్తే, ఒక వెండికంచం కొనటంవల్ల భవిష్యత్ జీవితం అంతా బాగుపడేటట్లుగా ఉంది.

౨

అయితే,

నెలకు యాభైరూపాయల జీతంలో ఈ పెద్ద సంసారాన్ని ఈదుకురావటం కష్టంగా ఉంటే, ఒక్కసారి ఎనభై రూపాయలుపెట్టి వెండికంచం కొనటం ఎల్లాగు? వెండి ధర మండిపోతున్నది. ఎంత ఆలోచించినా ఉపాయం ఏమీ తోచలేదు.

తెల్లని వెండిపళ్ళెంలో అన్నం తినాలని నాకు చాలా కాలంనుంచి సరదా! అందమైన వస్తువులు ఎవరు కోరకుండా ఉంటారు? జీవితం సౌందర్యమయం చేసుకోవలెనని ఎవరికి ఉండదు?

కాని ఎన్నివిధాల ఆలోచించినా వెండికంచం కొంటానికి డబ్బు ఎల్లాగ వస్తుందో తెలియలేదు. నా బ్రతుక్కు వెండికంచం కొనుక్కోలేను అని నిరాశ చేసుకోలేక పోయినాను. విచారంతో ఎంతో ఆలోచించగా, ఆలోచించగా ఒక ఉపాయం తోచింది.

వెండి పూతపూసిన పళ్ళాలు ఉంటవి. అదొకటి కొంటే!

భలే! ఈ ఆలోచన నాకు ఆదివారం పొద్దున్నే రావటం ఒక అదృష్టమే! నేను చటుక్కున లేచి పైన ఉత్తరీయం వేసుకొని పెద్దపెద్ద అంగలు వేసుకొంటూ హెబ్బారు షాపుకు వెళ్ళాను. ఇల్లాంటి వస్తువులన్నీ అక్కడే దొరుకుతవి.

ఆ షాపులో గిల్టుకంచం ఒకటి అద్దాల బీరువాలో ధగ ధగ మెరిసిపోతున్నది. దానిని బయటకు తీయించి చూశాను. అబ్బ ఎంత తెల్లగా మెరుస్తున్నది. వెండికంచానికీ దీనికీ భేదం ఏమీ కనిపించ లేదు.

నా బ్రతుక్కు ఇది కొనుక్కుంటే చాలదా అనిపించింది.

ధర ఇరవై రూపాయలు. కొంచెం ఎక్కువే అనిపించింది.

కాని హెబ్బారు ఏమి చెప్పాడు......"ఇది చాలా మంచి కంచం. యుద్ధానికి పూర్వం తెప్పించినసరకు. ఇప్పుడు ఇటువంటి సరుకు రావటంలేదు. గిల్టుకంచం అని పేరేగాని వెండికంచం కంటే బాగా ఉంటుంది."

"ఈ రంగు పోదా అండి?" అని అడిగాను ఆదుర్దాగా.

"ఇప్పుడు వచ్చే కంచాలైతే, చెప్పలేము కాని దీని కేమండీ! దీనికి మార్పులేదు! ఎన్నాళ్ళయినా ఇల్లాగనే ఉంటుంది."

"అయితే. వెండికంచం కొంటే ఎక్కువేమి ఉంది?" అని అడిగాను.

"ఏమీలేదు. డబ్బు ఎక్కువగా ఉంటే వెండికంచాలు కొంటారు. మన మోస్తరువాళ్ళంతా వాడేవి ఇల్లాంటివే! అందరి ఇళ్ళల్లోను వెండి కంచాలున్నాయా?" అని ఆయన నవ్వాడు.

"అంతే అంటారా?" అన్నాను నేను ఆయన అన్న మాటమీద నమ్మకం లేనట్లు!

"ఇంకా మీకు సందేహమేనా? పెద్దపెద్ద వాళ్ళయిళ్ళలోకూడా ఇవ్వేనండీ!" అన్నాడు ఆయన. ఒక గొప్ప రహస్యాన్ని నాకు ఆ క్షణంలో బుద్ధిపూర్వకంగానో, పొరపాటునో చెప్పేసినాడు. నాకు చాలాతృప్తి కలిగింది. తప్పకుండా కొందామనుకొని "రేపు వస్తాను" అని చెప్పి వచ్చేస్తున్నాను. హెబ్బారు నన్ను పిలిచి అడిగాడు "దీనికోసం చాలామంది తిరిగిపోతున్నారు, సి. సి. రావుగారు నిన్న వచ్చి చూచివెళ్ళారు. మీకు కావాలంటే చెప్పండి! దాచిపెట్టి ఉంచుతాను. ఇల్లాంటిది ఇది ఒక్కటే ఉంది నాదగ్గర దాని తరువాత ఏమనుకొన్నా లాభం లేదు."

"రేపువచ్చి ఏ సంగతీ మీకు చెపుతాను. అప్పటిదాకా ఎవ్వరికీ ఇయ్యబోకండి" అన్నాను. హెబ్బారు అంగీకారాన్ని సూచిస్తూ పళ్ళాన్ని బీరువాలో పెట్టివేశాడు. నేను ఇంటికి వచ్చేశాను. వచ్చి మళ్ళీ ఆలోచించాను. ఇప్పుడు అందరి ఇళ్ళల్లోనూ ఇల్లాంటి కంచాలే ఉన్నాయని చెప్పాడు. నిజమే అయి ఉంటుంది ఆ మాట! కంచం తెల్లగా మెరుస్తున్నది. గిల్టుకంచం అని ఎవ్వరూ అనుకోరు!

ఆ తెల్లటి పళ్ళెంలో అన్నము పెట్టుకుతింటూఉంటే వెండికంచంలో తిన్నంత తృప్తిఉంటుంది. కొంటే ఏం ?

ఆ రంగు ఉంటుందా ఎల్లకాలమూ ? అదేనన్ను బాధిస్తున్న సమస్య !

ఉంటుందని హెబ్బారు చెప్తున్నాడు. అబద్ధం చెప్పిందాకా అతని కేమి అవసరంవచ్చింది? అదీ కాక అతడు అబద్ధం చెపుతున్నట్టుగా ఏమాత్రము లేదు.

ఆ కంచము మంచిది కాకపోతే. సి. సి. రావుగారు ఎందుకు కావాలంటారూ? ఆయన చాలా భాగ్యవంతుడు రంగుపోయే కంచం అయితే ఆయన కొనాలని అనుకోడు. రంగుపోయేకంచాలయితే ఒకరుమటుకు ఎందుకు కొంటారు? ఇది అల్లాంటిది కాదు.

ఇంకొక సంగతికూడాతోచింది. పోనీ ఎంత లేదన్నా నాలుగేండ్లు ఉండదా ఆరంగు ! పోనీ మూడేండ్లు! అయితే మటుకు నష్టంఏముంది! ఈమూడేండ్లూవిస్తళ్ళు ఉపయోగిస్తే డబ్బై రెండు రూపాయలు అయింది. ఈకంచం ఇరవై రూపాయలకే వస్తుందే !

ఇల్లాగ ఎంత ఆలోచించినా ఆ కంచం కొనటం,చాలా లాభకరమైన విషయంగాతోచింది.

మా ఆవిడ ఏదైన కాస్త డబ్బు ఆదా అయ్యేవిషయంలో నాతో ఏకీభవిస్తుంది! నేనుకుర్చీ కొంటానంటే, వద్దు, అది అయితే నాలుగు ఏండ్లలో పాడైపోతుంది. ఇనపకుర్చీకొంటే, శాశ్వతంగా ఉంటుందని నాకు సలహా

ఇచ్చింది. అందుకని ధైర్యంగా వెళ్ళి ఈవిషయం, అంతా చక్కగా చెప్పాను ఆవిడతో;

ఆమె నావంక విపరీతంగా చూచి, ఇంత తెలివి తక్కువ పని ఇంకొకటి లేదన్నట్లు తలత్రిప్పి, మీకింత వెర్రి ఏమిటండీ, ఎబ్బే! గిల్టుకంచం కొనుక్కుంటారా? మనకేం కర్మం అండీ" అన్నది.

ఈ మాటలువింటే నాకు చాలా కోపంవచ్చింది. మనమేమో మహా వెండికంచాలు కొంటానికి శక్తి ఉన్నవాళ్ళంలాగ మాట్లాడుతుందేమిటి ఈవిడగారు. అసలు వచ్చేజీతంలో గడవటమే కష్టంగా ఉంటూ ఉంటే!!

కోపంవచ్చినా దిగమ్రింగి, "అంతా కొనుక్కోటం లేదా" అన్నాను.

"ఎవరండీ అల్లాంటి వస్తువులు కొనేది?" అని అడిగింది.

అది మామూలు ప్రశ్నే కాని అందులోనున్న అవమానపరచే పదార్థము చాలాఉంది. ఈవూళ్ళో అల్లాంటి కంచాలు ఎవ రెవరు కొన్నారో హెబ్బారును అడగటం మరచిపోయినాను. అయినా ఊరుకోక ఊళ్లో భాగ్యవంతుల పేర్లు కొన్ని చెప్పాను కసితీరేలాగున.

ఆవిడ నవ్వి "వాళ్లకేం కర్మమం అండీ గిల్టు కంచాలు కొనుక్కొన్నదాకా?" అన్నది.

"అయితే హెబ్బారు తెప్పించిన గిల్టు కంచాలన్నీ ఎవరు కొంటున్నారంటావు?" అని అడిగాను.

"మనకెందుకు పోనిద్దురూ, ఎవరో తలకుమాసినివాళ్లు కొనుక్కుంటారు" అని చీత్కారంగా మాట్లాడింది.

నేను కోపం తెచ్చుకొంటే, పోట్లాటలోకి దిగుతుంది. పోట్లాడేందుకు నేను సిద్ధం కాలేదు.

కొంచెము మెల్లగా అన్నాను "ఆ కంచం వెండి కంచంలాగ తెల్లగా మెరుస్తున్నది?" కొంటానికి అంగీకరించమని బ్రతిమిలాడు పద్ధతిలో అన్నాను.

"అట్లాగే మెరుస్తుంది! అది భోగంమెరుపు!" అని ఆవిడ చీదరించుకొన్నది.

"మరి వెండి కంచం కొనుక్కోలేనప్పుడు, అది అయినా కొనుక్కొని సంతోషిస్తాను" అన్నాను కొంచెం దీనంగా.

శక్తి లేకపోతే పోనీయండి. ఉన్నప్పుడే కొనుక్కోవచ్చు! అంతేగాని గిల్టుకంచం కొనడం ఎందుకండీ?"

"ఏం కొంటే! తెల్లగా ఉంది!..."

"తెల్లగా ఉండటారూ? ఎంతకాలం ఉంటుందండి ఆ మెరుపు. మర్నాటికల్లా పోతుంది! అదీకాక అది ఎందుకైనా పనికొస్తుందా? వెండికంచం అయితే సొమ్ము! ఎప్పుడమ్మినా సొమ్ము అంతావస్తుంది. అవసరంవస్తే తాకట్టుపెట్టుకొని పదిరూపాయలు తెచ్చుకోవచ్చు. ఇది ఎందుకు పనికివస్తుందండీ! ఎబ్బే?" అని చీదరించుకొన్నది.

దానితరువాత నేను ఎంత చెప్పినా ఆవిడ వినిపించుకుంటేనా! గిరగిరా తలతిప్పి వద్దంటే వద్దని కూర్చున్నది. సంగతి తేలిపోయింది. ఇక ఆవిడకు నచ్చజెప్పికొనటం పడదు.

నాయింట్లో నామాటకు ఇంత విలువ లేకుండా పోయిందేమా అని విచారం కలిగింది. ఆలోచించిన కొద్దీ కోపం హెచ్చిపోయింది, చివరకు ఒక పౌరుషమైన పనిచేయటానికి నిశ్చయించుకొన్నాను.

చెప్పకుండా ఆ కంచం కాస్తా కొనుక్కొస్తాను. కొని తీరుతాను! నాకు అంత మోజుగా ఉంది. నేనేగనుక ఆ కంచం కొనకపోతే......అని ఏదో అనుకోబోయి ఊరుకొన్నాను.

3

నేను అసలు మహా పట్టుదలమనిషినని నా అభిప్రాయం. ఆ రోజు సాయంత్రమే హెబ్బారు షాపుకు వెళ్ళి ఆ పళ్ళాన్ని చూపిస్తూ ఇల్లా అన్నాను:

"ఇది నాకు కావాలె. జీతం రావటంతోనే డబ్బు ఇచ్చి తీసుకొని వెడతాను, ఇది నాకోసం ఉంచండి."

హెబ్బారు నాస్థితిజూసి చాలా జాలిపడ్డాడు. "సరే, అల్లాగే కానియ్యండి. డబ్బు వచ్చినప్పుడే వచ్చి తీసుకెళ్ళండి. అందాకా మీకోసం అట్టిపెడతాను."

"నిజంగా నాకోసం ఉంచండి. కొంచెం ఆలస్యం అయినా సరే, ఇంకొకరికి ఇయ్యకండేం!" అన్నాను.

హెబ్బారు నవ్వి "మాట అన్న తరువాత ఇంకొకరికి ఇస్తానుటండీ! ఆ కంచం మీదే అనుకోండి. మీరు ఎప్పుడైనా రండి: దాన్ని అల్లాగే ఉంచుతాను," అన్నాడు. నేను సంతోషించి ఇంటికి వచ్చేశాను.

ఆ రోజునుంచీ హెూబ్బారుషాపుకు రోజూ వెళ్ళి ఆ కంచం అక్కడ ఉన్నదీ లేనిదీ చూచుకొంటూ ఉండేవాడిని. ఆ కంచం నాదే అక్కడ పెట్టి ఉంచాను అని అనుకొంటూ సంతోషిస్తూ ఉండేవాడిని.

ఆ నెల ఆఖరుకు కొందామనే గట్టిగా అనుకొన్నాను గాని తీరా లెక్క జూచుకొంటే డబ్బు అంతా ఇంటిఖర్చుకు సరిపోయింది.

ఎప్పుడో పెద్దపిల్లకు పరికిణీగుడ్డ కొన్నందుకూ, ఆవిడ కనకాంబరం చీర కొనుకొన్నందుకూ, నాయుడుగారి భార్య దగ్గర పాతికరూపాయలు అప్పు జేసిందట మా ఆవిడ. వాటి కేదో డబ్బుఇచ్చినట్లే జ్ఞాపకం. దానికంతా ఏదోగొడవగా లెక్కజెప్పి ఈబాకీ ఈనెలలో తీర్చక తప్పదని కూర్చున్నది.

నేను రెండు ప్రైవేటు ట్యూషనులు తీసుకొనక తప్పిందికాదు. ఆ ఇద్దరూకలిసి పాతికరూపాయలు ఇచ్చారు. ఆ రూపాయలు మా ఆవిడ కిచ్చి, నాయుడుగారి భార్యబాకీ తీర్చేయమన్నాను.

ఇల్లా జరగటంవల్ల నేను అనుకొన్నట్లు ఆ నెల కంచం కొనలేకపోయినాను. కాని వచ్చేనెల మళ్ళీ, ఆ కుర్రవాళ్ళు పాతికా ఇస్తారు. దానితో పళ్ళెంకొనక తప్పదని నిశ్చయించుకొన్నాను.

పళ్లెం కొనాలన్నకోరిక మరీ బలం అయింది. విస్తట్లో తినటం అంత దరిద్రపుపని ఇంకొకటిలేదని తోచింది. పుల్లలు ఊడి నోటిలోకి వస్తున్నాయి. అరటి ఆకులు అయితే

బాగుండు. అవి చాలాఖరీదు. అయినా రోజూ దొరకవు అవి. జీవితం దుర్భరం అనిపించింది.

మల్లెపూలలాంటి అన్నం తెల్లని పళ్ళెంలో పెట్టుకొని తింటూ ఉంటే, ఎంతహాయిగా ఉంటుంది! అల్లాంటి అదృష్టం నాకు ఎప్పుడు కలుగుతుందో!

మనిషి అయిన ప్రతిమానవుడుకి సౌందర్యతృష్ణ ఉంటుంది. పొట్టకు ఇంత తిండీ, కట్టుకొనేందుకు బట్ట, ఉన్నంత మాత్రాన మానవుడు తృప్తిపడడు. ఎన్నో అందమైన వస్తువులకోసం మానవ హృదయం పరితపిస్తుంది.

నాకు పళ్లెం కొందామన్న ఆరాటం ఎక్కువ అయింది. హెంబ్రారు షాపుకు రోజూ వెళ్ళి ఆయనతో, ఏదో ఆ విషయం ఈ విషయం మాట్లాడి, నా కంచం యథాస్థలంలో ఉన్నదీ, లేనిదీ, చూచుకొనేవాణ్ణి. అద్దాల బీరువాలో కొన్ని గ్లాసుల ప్రక్క, పగలు సూర్యకాంతిలోనూ, రాత్రి ఎలక్ట్రిక్ లైటు కాంతిలోనూ ఆ కంచం ధగధగా ధగధగా మెరసిపోతూ ఉండేది. కళ్ళతో చూచుకొని గుటకలు మ్రింగి వచ్చేస్తుండే వాడిని.

ఆ తరువాత ఆగస్టు నెల జీతం వచ్చింది. నేనూ మా ఆవిడా కలిసి లెక్క జూచుకొన్నాము. పెరుగుకూ, పాలకూ, కలిసి క్రిందటి నెలకంటే అయిదురూపాయలు ఎక్కువ అయింది. పైగా ఇంకొక కొత్త ఇబ్బందికూడా వచ్చిపడ్డది. మా ఆవిడ ఎందుకో నాయుడుగారి భార్యదగ్గర అప్పుడప్పుడు చేబదుళ్లు చేసిన మొత్తం ఇరవైరూపాయలు అయిందట! ఆ డబ్బుకు ఆమెగారు తొందర జేస్తున్నదని మా ఆవిడ చెప్పింది. ఏంజే

సేది? ఆ నెల జీతమూ. పైసంపాదన పాతికా, అంతాకూడా మా ఆవిడ చేతికిచ్చి, చేతులు కడుక్కున్నాను.

అక్కడినుంచి నా చేతిలో దమ్మిడీ లేకపోవటం మూలాన నానా ఇబ్బందీ పడ్డాను. సిగరెట్లకు కావాలే, కిల్లీలకు కావాలె! రెండురోజుల కొకసారి అయినా, "ఇదిగో, చూడూ, ఒక అర్ధరూపాయి యిద్దూ!" అని అడగక తప్పేదికాదు.

"ఇది మరీ బాగుందే! నాదగ్గర ఎక్కడదీ?" అనేది ఆవిడి.

నిజానికి ఆవిడమటుకు డబ్బు పోగుచేసుకొని కూర్చున్నదా! నేను సంపాదించి తెచ్చి ఇచ్చిన డబ్బు, పాలవాళ్లకూ, పెరుగువాళ్ళకూ, ఎవరెవరికి ఎంతెంత ఇవ్వాలో. అంతా ఇచ్చేసి ఇంట్లోకి నెలకు సరిపొయ్యే వస్తువులన్నీ తెప్పించేది! ఇంకా డబ్బు ఎక్కడిదీ ఆమె చేతిలో! అందుకనే నేను మళ్ళీ అనేవాడిని "కాస్త ఆ నాయుడుగారి భార్యను అడిగి అయినా రెండురూపాయలు తెద్దూ!"

"ఇప్పుడు ఇల్లాగే అంటారు! నెల ఆఖరుకు ఇవ్వ వచ్చేసరికి ఊరికే ఇదౌతారు!" అని ఆమె అనేది.

"కాదులే! కాస్త తీసుకురా;" అని నేను బ్రతిమలాడితే ఆవిడగారు ఒకరూపాయో అర్ధో నా చేతిలో పెట్టేది. ఇల్లాగే నెలంతా నెట్టుకుపోయేది.

చాలా కష్టంగా గడుస్తూ వచ్చింది. అయినా ఈ ట్యూషను చెప్పటం చాలా కష్టమైన పని. స్కూలులో వాగి వాగి వచ్చి మళ్ళీ ఇంటిదగ్గర ఇద్దరు మొద్దులకు పాఠాలు

చెప్పటం ఎంతకష్టమో ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నవారు తప్ప, ఇతరులు ఎవరూ ఊహించలేరు.

అదీగాక ఈ ట్యూషను అసలు చెప్పకూడదు. అధికారులకు తెలిస్తే చాలా ప్రమాదకరమైన విషయం. ఈ దొంగపని ఎన్నాళ్ళని చెయ్యటం! ఈ పళ్లెం కొనగానే ఈ కుర్రాళ్ళను పంపించివేద్దామని నిశ్చయించుకొన్నాను.

సెప్టెంబరు నెల జీతం వచ్చింది. ఆ జీతమూ, కుర్రాళ్లు ఇచ్చిందీ, అంతాకలిసి డెబ్భైఅయిదు రూపాయలకు, మా ఆవిడ కర్చుచూపించి పైగా ఇంకొక పదిరూపాయలు ఎక్కడైనా అప్పుతెస్తేనేగాని ఈనెల గడవదు అన్నది.

"నా కెక్కడా అప్పుపుట్టదు. నీవే, ఆనాయుడుగారి భార్య నడిగి తెచ్చుకో" అని విదిలించుకు వెళ్ళిపోయినాను ఆ రోజుకు.

తానేమో. మహా తెలివిగల దానినని మా ఆవిడకు గర్వం. నేను కాబట్టి ఈ మాత్రం అన్నా గడుపుకొని వస్తున్నాను అంటుంది. జీతానికి జీతమూ, పైన పాతికో పరకో వస్తే అదీ, అంతా ఆమె చేతిలోనే పడేస్తుంటిని! ఆమె దాంతో సరిపెట్టుకోలేక పైన అధమం ఒకపాతిక అయినా అప్పు జూపిస్తుంది!

ఇల్లాగే, అక్టోబరు, నవంబరులుకూడా గడిచిపోయినవి. నేనుమటుకు పళ్ళెంమీద ఆశ వదలుకోలేదు. రోజూ వెళ్ళి చూచుకొని వస్తూండేవాడిని. అది అక్కడే ఉంది. ఎక్కడికీ పోలేదు. ఎక్కడున్నా అదినా పళ్ళెమేకదా అన్న ఆలోచన మటుకు నాకు చాలా సంతోషాన్ని ఇస్తూవచ్చింది.

ఏ నెల కానెల, ఈవిడ, జీతం జీతం అంతా కాజేసి, నాచేతిలో ఒక దమ్మిడీ అయినా మిగలకుండా జేయటం, అందుమూలాన ఆపళ్ళెంకొన లేకపోవటం, నేను ఎంతో కాలం భరించలేకపోయినాను.

ఒకరోజున చాలా విచారంతో అన్నాను, "నీవేమో మహా తెలివిగలదానవనీ, సంసారం పొదుపుగా చేస్తావనీ. ఆశపడి జీతం అంతా నీకు ఇస్తున్నాను, నీవుచేస్తున్న ఆదా అయినా ఏమీ లేదు. పైగా నెలా నెలా అప్పు జూపిస్తున్నావు ఎబ్బే! ఏమీ లాభంలేదు. ఈ నెలనుంచీ డబ్బు నేనే వాడతాను!"

ఈమాటలువిని ఆవిడ మూతీ ముక్కూ విరిచి, "అయ్యో, అయ్యో, మీరువాడటం ఈ సంసారం గడవటమూనా! నేను గాబట్టి ఎల్లాగో ఒరగబెట్టుకొని వస్తున్నాను. డబ్బు మీ చేతిలో పడితే, ఇక పిల్లలూ నేనూ కూడా మాడవలసిందే! మీ స్నేహితుడేగా, ఆ శ్రీనివాసరావు!! ఆయన చూడండి ఎల్లాగ అవస్థ పడుతున్నాడో! ఆయన పెళ్ళాము ఒక టోకోల! ఒక ఎకరం పొలం ఉంటే. అదికూడా అమ్మాలని చూస్తున్నాడు."

"అయితే ఏమిటి నీవు అనటం?"

"ఇంకా ఏమీ అనేది? మీరు డబ్బువాడితే ఎందుకూ పనికిరాకుండా పోతాము."

"ఏమీ పోము, మనకు ఏమీ అమ్ముకోవలసిన అగత్యంరాదు."

కాంతం నా వంక వికారంగాచూచి "అమ్మకోరంటా మన్నా మనకేమో లేదుగా" అన్నది చేతులు త్రిప్పుతూ వెక్కిరింతగా. నాకు మనస్సు చివుక్కుమన్నది. నాకు లేని మాట నిజమేకాని, అయితేమటుకు అల్లాగంటే కష్టంగా ఉండదూ!

"అల్లాగ అంటేనే నాకు వళ్ళుమండేది!" అన్నాను కోపంగా.

"లేనప్పుడు లేదంటే, కోపం ఎందుకూ?" అని మళ్ళీ అన్నది ఆవిడ. నాకు కోపంవస్తున్నదని భయం ఏమాత్రమూ లేకుండా.

నాకు చాలా కోపం వచ్చింది. పెద్దగా ఇల్లా అన్నాను "అవును, లేదు. లేకపోతే మటుకు........" ఆ పైన ఏమంటానికీ తోచక కాసేపు ఊరుకొని మళ్ళీ అన్నాను: "అందరూ, ఉండే అమ్ముతున్నారా ఏమిటి! అమ్మాలని బుద్ధే పుట్టాలిగాని ఏదైనా అమ్మవచ్చు!"

ఈ మాటలు కోపంగానే అనేశాను. నిజానికి అమ్మటానికి ఏమీ లేదు. నగలుకూడా లేవు. పాత్ర సామగ్రి అయినా, సరిగ్గా సంసారానికి సరిపోయే మాత్రం ఉంది.

ఏదో దబాయింపుగా అన్నానుగదా అని ఆమె ఊరుకొంటే సరిపోయేది. అల్లా ఊరుకోక ఆమె, "ఏమి అమ్ముతానో కాస్త చెప్పండి చూద్దాము?" అన్నది దీర్ఘాలుతీస్తూ.

కోపంవచ్చి ఏదో అన్నాడులే అని ఆమె ఊరుకోవాలిసింది. ఊరుకోక ఆమెగారు అంత నిక్కచ్చిగా అడుగుతున్న

ప్పుడు ఏదో అమ్ముతానని చెప్పలేగాని "మేమే" అంటే ఆవిడకు నేను ఎంతో లోకువ అవుతాను. ముందు ముందు ఇంకా ఎత్తిపొడుపు మాటలు అనవచ్చు. ఇదంతా నేను ఆలోచించి చివరకు అన్నాను ఇల్లాగ :

"ఏమి అమ్ముతానా, గుంటూరులో అరండల్ పేటలో ఇల్లు ఒకటి అమ్మేస్తాను" అని పెద్దగ అరిచాను.

మా ఆవిడ కాబట్టి ఇన్నిమాటలూ నేను కోపంగా అంటూఉంటే నిలబడ గలిగింది కాని ఇంకొకరు అయితే "పాపం, ఈ పిచ్చిబ్రాహ్మడు పెళ్ళాంమీద కోపంకొద్దీ నిక్షేపంలాంటి ఇల్లు అమ్మేస్తాడు కామాలు అని హడలిపొయ్యేవాళ్ళే! ఆ పద్ధతిలో అన్నాను. మా ఆవిడమటుకు తొణక్కుండా అడిగింది. "గుంటూరులో మనకు ఇల్లుఒకటిఉందా ఏమిటండీ ?" అని.

ఈ మాటలు అన్న పద్ధతిని విడదీసిచూస్తే, అందులో పదింటికి ఒకపాలు సందేహమూ, నాలుగు పాళ్ళు విస్మయమూ కలిసిఉన్నట్టు తెలుస్తుంది.

నాకు గుంటూరులో ఒక ఇల్లుఉన్నదనే అనిపించింది. "నీకేం తెలుసు ఉందో లేదో" అన్నాను గర్వంగా.

"నాకెప్పుడూ చెప్ప లేదే!" అన్నది ఆవిడ తెల్లపోయి.

"ప్రతివిషయమూ, ఆడదానికి చెప్పాలని లేదు."

"పోనీలెండి, ఇదివరకు చెప్పలేదు సరే! ఇప్పుడు చెప్పండి. అక్కడ మనకో ఇల్లు ఉందా ?"

"ఆ" అన్నాను గొంతు పెద్దదిచేసి.

"ఆ" అని ఎల్లా అన్నానూ అంటే, ఆ విషయమై ఆవిడకు ఎల్లాంటి సందేహము ఉన్నా, ఆ దెబ్బతో అది ఎగిరి పోయే పద్ధతిలో అన్నాను.

అయినా ఆవిడకు సందేహముపోక "ఎప్పుడు కొన్నా రండీ?" అని నవ్వింది.

అట్లా దారికిరా, అని మనస్సులో అనుకొని "నేను కొన్నానని చెప్పలేదే!" అన్నాను.

"కొనకపోతే ఆ యిల్లు మనదెట్లా అవుతుంది?"

"మనదీ అనికూడా నేను అనలేదే!"

"మనది కాకపోతే ఎట్లా అమ్ముతారు?"

"అమ్మటానికి హక్కు ఉంది కాబట్టి?"

"అదేమిటండీ? మనయిల్లు కాకపోవడం ఏమిటి? అమ్మటానికి హక్కు ఉండటం ఏమిటి?"

"ఏమీలేదు. అక్కడమా అత్తగారిఇల్లు ఒకటిఉంది. అది కాస్తా అమ్మేస్తాను!!

కాంతం విరగబడి నవ్వుతూ, "వాళ్ళూరుకొంటారు టండీ?" అన్నది.

"అత్తగారి ఆస్తిపైన అల్లుడికి ఆమాత్రం హక్కు లేదా?"

"ఎవ్వరైనా వింటే నవ్విపోతారు!"

"ఎవ్వరూ నవ్వరు. పైగా చాలా తెలివైనపనిచేస్తు న్నానని అందరూ నన్ను మెచ్చుకొంటారు."

అంతటితో ఆ రోజున మా సంభాషణఅయిపోయింది కాని అవిడను ఒప్పించి డబ్బువాడకం నాచేతులోకి తీసుకోలేకపోయాను.

ఈసంసారం, నెత్తిమీద వేసుకొని ఈదటంమూలాన ఈమాత్రమన్నా గడుస్తున్నదనీ నేనుడబ్బువాడకం మొదలుపెడితే అప్పులు ఎక్కువయిపోయి మా వీథిలో ఎవరిఇల్లు అయినా ఒకటి అమ్మవలసిన అవసరం నాకు కలిగి తీరుతుందనీ ఆమె నమ్మకం. అందుచేత ఆమెడబ్బు నాకళ్ళకు కనపడనీయదు. నాకూ తెలుసు ఆమాట! రూపాయి జేబులోవేసుకొని వెళ్ళి చిల్లర ఎప్పుడూ నేను ఇంటికి తేలేదు. నిజానికి ఆమె వాడితేనేనయం. నయమే కాని, డిశంబరు గడిచినా కూడా, నేను ఆ పళ్ళెం కొనలేక పోయినాను. నాపళ్ళెం హెబ్బారుషాపులో ఉన్నది.

పాపం ఆపళ్ళానికి నోరులేదుగాని ఉంటే నన్నుజూచినప్పుడు కళ్ళ నీళ్ళుపెట్టుకొని "నన్ను ఎన్నాళ్లు ఇంకా ఈ చెరలో ఉంచుతావు. నన్ను తీసికెళ్ళవా?" అనేది. నాకు అల్లాగ అన్నట్లు తోచింది. జాలికూడా వేసేది.

ఇల్లా ఉంటూఉండగా, జనవరినెలలో నా చేతిలోకి పదిరూపాయలువచ్చినై, ఏమైనాకానీ ఎవ్వరికీ చెప్పకుండా వెళ్ళి ఆ కంచం కొనుక్కొద్దామని బయలుదేరాను.

కంచం ఖరీదుఇరవై, నాచేతిలోపదేఉన్నై, ఎట్లాగు కొనేది! ఒకఉపాయంఆలోచించాను. ఈపదీ ఇప్పుడుఇచ్చేసి మిగిలిన పదీ ఇంకొక నెలలో ఇస్తానంటే హెబ్బారు ఒప్పుకొంటాడు.

గబగబా షాపుకు వెళ్ళాను. ఆ రోజున ధైర్యంగా అద్దాలబీరువావద్దకు వెళ్ళిచూడవచ్చు. ఇదివరలో అంటే ఆయన ఏమంటాడో అని అనుకొనేవాణ్ణి. "కొనేదీ లేదూ, పెట్టేదీ లేదు. రోజుకు ఒకసారివచ్చి చూస్తూఉంటావు. ఏమిటీ న్యూసెన్సు" అని అంటే అనవచ్చునని భయంగా ఉండేది.

ఇవ్వాళ ధైర్యంగా బీరువా దగ్గరకు వెళ్ళాను నా కంచం నేను తీసుకొంటానికి. అయితే ఆ రోజు ఆ కంచం అక్కడ కనుపించలేదు. ఏమైపోయింది ?

అక్కడే ధగధగ మెరుస్తూ ఉండేది! కనపడలేదు. గుండెలు గబగబ కొట్టుకొన్నవి. అంతటా చూచాను. గ్లాసుల ప్రక్కనా, సీసాలప్రక్కనా, వెనకాలా, పైనా, అంతటా! ఎక్కడా లేదు.

ఇంకెందుకు ఆలోచన! ఎవరో దుర్మార్గుడు నా వస్తువును కాజేశాడు.

హెబ్బారు షాపులో లేడు. ఎవరో కుర్రవాడు ఉన్నాడు. ఆ కుర్రవాడు "ఏమిటండీ, చూస్తున్నారు పంతులు గారూ?" అన్నాడు.

"ఇక్కడా–నా కంచం ఒకటి ఉండాలె" అన్నాను.

ఆకుర్రవాడు ఆశ్చర్యపడి "మీ కంచం ఇక్కడెందుకు పెట్టారూ ?" అని అడిగాడు.

ఏమిచెప్పేది ? "నాదంటే...... నేను కొనాలని అనుకొన్నది! కొన్నట్లే!" అన్నాను.

"హెబ్బారుగారితో చెప్పకపోయినారా మీ కోసం ఉంచమని ?"

"చెప్పానయ్యా!"

"ఎన్నాళ్ళ క్రితం?"

"ఆరునెలలు అవుతుంది"

ఆ కుర్రవాడు నవ్వి "ఆరునెలల క్రింద చెప్పితే ఉంటుందిటండీ?" అన్నాడు.

"ఉంచుతా నన్నాడు. ఉంచాడుకూడా మొన్నటిదాకా!"

"అయితే, ఇంకేం, మీకోసం చాలా రోజులు అట్టేపెట్టి, విసుగుపుట్టి, ఇక మీరు రారనే నిరాశతో ఎవరికో అమ్మిఉంటాడు. వారు మట్టుకు ఎన్నాళ్ళని ఉంచుతారు?" అని అన్నాడు ఆ కుర్రాడు.

ఈ మాటలు వినేసరికి నాకు కోపమూ, దుఃఖమూ పెనవేసుకొని వచ్చినవి. ఇంతకంటే ఘోరకృత్యము ఇంకొకటి లేదు? హెబ్బారు నన్ను నమ్మించి మోసపుచ్చాడు.

ఆ కొన్నవాడు ఎవరో, నిక్షేపంలాంటికంచం, తెల్లగా మెరుస్తూఉండేదాన్ని, నేను లేకుండా జూచి కాజేశాడు, గద్ద తన్నుకెళ్ళినట్లు తన్నుకెళ్లాడు. ఇంతకంటే అన్యాయం ఏముంటుంది!

నేను ఇపుడు ఏమిచెయ్యాలె! ఏడుస్తూ ఇంటికి పోవలసిందేనా? లేకపోతే ఆ కంచాన్ని ఎత్తుకపోయిన దొంగను పట్టుకొని నా కంచం నేను తెచ్చుకోవాలా? "ఎంతకు కొనుక్కొని వెళ్ళాడయ్యా ఆ పళ్ళాన్ని?" అని అడిగాను.

"నాకు బాగా తెలియదండీ ఈమధ్య ఎవరో అడుగుతుంటే పాతిక రూపాయలని చెప్పారు" అన్నాడు ఆ కుర్రవాడు.

ఇంకేం! పాతికరూపాయలిచ్చి, ఎవరో కొనుక్కొని పోయి ఉంటారు. బేరంచేస్తే ఇవ్వరని తెలుసు, అసలు ఆ కంచం నాదాయె! వాడికెందుకిస్తారూ! అందుకనే అంతధర పెట్టాడు!

పాతిక కాదు యాభై పెట్టినా అల్లాంటి కంచం వాడికి తలక్రిందుగా తపస్సుచేసినా దొరుకుతుందా ఈ రోజుల్లో! ఏదీ అల్లాంటిది ఇంకొకటి బజారులో ఎక్కడైనా తెమ్మను చూద్దాము! కాజేశాడు! ఏం జేస్తాము! అని అనుకొంటూ దిగాలపడి నుంచున్నాను.

ఇంతలో హెంబ్బారువచ్చి "ఏంకావాలండీ పంతులు గారు, అల్లా దిగులుగా నుంచున్నారూ?" అని అడిగాడు.

నేను బిక్కముఖంతో అన్నాను "నాకంచం ఎవరో కొనుక్కుపోయినారటగా? నాకోసం ఉంచుతానంటివే?"

"ఎప్పటిమాటండీ! అయినా ఆకంచం మీకెందుకు లెండి ఇనపముక్క!"

వళ్ళుమండేమాటలు ఇవి. ఇంతకు ముందు ఎంతో మంచిదని చెప్పాడు. ఇప్పుడేమన్నా అదిఇనపరేకు అంటాడు, ఎక్కువ ధరవస్తే అమ్ముకొని!!

"అప్పుడు మంచిదని అంటివే?" అని అడిగాను.

"అప్పుడు అన్నాను మీరు ఏమంటారో చూద్దామని మీరు అమాయకంగా కొంటానంటే నవ్వుకొన్నాను."

ఈ అబద్ధాలువింటే మరీవళ్ళుమండి, "ఎందుకండీ ఈ మాటలన్నీ; ఎక్కడనైరవస్తేఅమ్ముకున్నానని చెప్పరాదూ?" అన్నాను.

"అదా మీ అనుమానం! కావలిస్తే చూడండి!" అంటూ హెచ్చారు, ఒక బీరువాపైనుంచి చిత్తు కాయితాలలో పడేసిఉన్న కంచాన్ని తీసి చూపించాడు.

అది నాకంచమే! అంచులు తెల్లగాఉన్నా అడుగంతా తుప్పపట్టింది, చిల్లులుపడ్డది ఎందుకూ పనికిరాదు. దాన్ని చూస్తే నాకు కళ్ళలో నీళ్ళు గిర్రున తిరిగినై, నాకోసం అది ఎంతకాలమో ఎదురుచూసింది! పరితపించింది! ఈ పరితాపంవల్లనే దాని శరీరం మలినమై తూట్లమయమైంది. ఆ కంచానికి నేనేదో గొప్పఅపరాధంచేశాను అని అనిపించింది.

ఇక ఆయనతో ఆ పేచీపెట్టడంవల్ల లాభం లేదనితోచింది. నేను కొంటానన్నపుడు చాలా మంచిసరుకు అని అంటినే, ఇప్పుడు ఇల్లాగ అయిందేమి అనటంవల్ల లాభం ఏమీ లేదు

నేను ఆరు నెల్లు ఆలస్యం చేశాను. ఈమధ్యదానిపని కాస్తా అయిపోయింది. నిజానికికొనకపోవట మేమంచిదయింది కాని నాకు మటుకు ఎందుకో చాలా కష్టంవేసింది అదికాస్తా అట్లా అయిపోయిందికదా, ఇక తెల్లటికంచంలో అన్నం తినాలన్న నా సరదా ఎట్లాతీరాలె? ఈ తీరనికోరిక నన్ను చాలా బాధపెట్టింది.

విచారంగా ఇంటికి వచ్చేశాను. ఈజన్మలో తెల్లటి కంచంలో అన్నం తినేభాగ్యం నాకు లేదుగదా అని దుఃఖం వచ్చింది. వెండికంచం నేను కొనుక్కోలేనుగదా! ఇదన్నా

కొనుక్కోక పోతిని. పైగా దాని బ్రతుకు బండను చేస్తిని! కళ్ళనీళ్ళ పర్యంతం అయింది.

ఇంటికి వచ్చేసరికి తొమ్మిదిగంటలైంది. చాలావిచారంగా గదిలోకి వెళ్ళి పడుకొన్నాను. మా ఆవిడవచ్చి అన్నానికి లెమ్మన్నది. నాకు తినాలని బుద్ధిపుట్టలేదు. "వద్దు" అన్నాను.

"ఎందుచేతా?" అన్నది ఆవిడ.

"మనస్సులో ఏమీ బాగా లేదు" అన్నాను.

"కారణం ఏమిటో కొంచెం చెప్పరూ?" అంటూ దగ్గరకువచ్చి మీద చెయ్యి వేసింది.

సంగతంతా వివరంగా చెప్పాను. కొంతం నవ్వి "ఈ మాత్రానికేనండీ! మీకు వెల్లటి కంచంమీద అంత అభిమానముంటే, గిల్టుకంచం ఎందుకండీ! వెండి కంచం కొంటారండీ" అన్నది. నా జన్మకు అల్లాంటిభాగ్యం లేదులే అని మనస్సులో అనుకొని, లేచి కాళ్లు కడుక్కొని పైన తువాలా వేసుకొని వంటఇంట్లోకి వెళ్ళాను.

అక్కడ నేను ఏమిచూశాను?—పెద్ద పీటా, దాని ముందు ఒక వెండికంచం!!!! నా కళ్ళను నేను నమ్మలేక పోయినాను.

"అరె! ఎక్కడిదీ కంచం?"

"మనదే" అన్నది ఆవిడ నవ్వుతూ.

"మనదే! మన కెక్కడిదీ?"

"కొన్నాను!" అన్నది.

"డబ్బు ఎక్కడిది కొంటానికి?"

"అంతా డబ్బు ఉండే కొంటున్నారటండీ! మీకు ఇష్టమైన వస్తువుగదా అని కొనేశాను. ఎనభై ఎనిమిది రూపాయలు."

"ఇంత డబ్బు ఎక్కడిదో చెప్పు. నాకు భయంగా ఉంది!"

"భోజనం చెయ్యండి, చెపుతాను."

"చెప్పందే భోజనం చెయ్యను!"

"అప్పు జేశాను."

ఈ మాట వినేసరికి నా గుండెలలో రాయిపడ్డది. "అప్పు జేశావూ? ఇంత అప్పు నేను తీర్చగలనా? ఈ దిగులుతో అన్నంకూడా సహించదు" అన్నాను నేను. అప్పటికింకా నేను పీటమీద కూర్చోలేదు. నిలబడే మాట్లాడుతున్నాను. "అప్పు" అన్నమాట విని దిగులుతో క్రింది చూపులు చూస్తూఉండిపోయాను. కాంతం రెక్కబట్టుకొని కూర్చోబెడుతూఅన్నది, "ఎందుకండీ అంతదిగులుపడతారు? అప్పులేదూ ఏమీలేదూ. నా డబ్బుపెట్టి కొన్నాను."

ఈ మాటలుమరీ విచిత్రంగా ఉన్నయ్. తనడబ్బుట! తనకు డబ్బు ఎక్కడిదో!

"నీకు డబ్బు ఎక్కడిదీ?" అని అడిగాను.

"రామన్నపేటలో యిల్లు అమ్మేశాను."

"రామన్నపేటలో నీకు ఓ ఇల్లు ఉన్నదా?"

"ఉండాలా ఏమిటండీ. అంతా ఉండే అమ్ముతారా" అని నా మాటలు నాకు ఒప్పజెప్పింది.

"సరేలే వేళాకోళంకట్టిపెట్టి డబ్బు ఎక్కడిదో చెప్పు"

"సంపాదించుకొన్నానండీ !"

"ఎట్లా సంపాదించుకొన్నావూ ?"

"అదొక పెద్దకష్టమా ఏమిటండీ! నా మొగుడుగారు నెలకు డెబ్భైఅయిదు రూపాయలు సంపాదిస్తున్నారు. ఆయన డబ్బులంతా నా చేతికే ఇస్తారు. నేను ఎట్లాగో కష్టపడి మిగుల్చుకొని ఇది కొనుక్కొన్నాను" అని దీర్ఘాలు తీసింది.

నాకు నవ్వువచ్చింది. "ఇదంతా నీవు సంపాదించినట్లే కామాలు" అన్నాను.

"ఆ సందేహం ఏమీ లేదు. ఈ డబ్బులంతా నా కష్టార్జితం. ఆడవాళ్ళ సంపాదన అంటే ఇదే! ఇదినా కంచం దీనిమీద నా పేరే వేయిస్తాను. అని నిక్కచ్చిగా చెప్పేసింది నేను సంతోషించి "అయితే నన్ను ఈకంచంలో తిననిస్తావా?" అని అడిగాను.

"అల్లాగే, పిచ్చి, పిచ్చి చేష్టలు చేయకుండా ప్రేమగా ఉన్నంతకాలమూ, నా కంచంలోనే మీరు తినాలి. మీరు తిని లేచిన తరువాత ఆకంచంలో నేను తింటాను." అన్నది.

ఆ తరువాత నేను సంతోషంతో మాట్లాడకుండా ఆ తెల్లటి కంచంలో కడుపునిండా అన్నం తిన్నాను.

ఆ తరువాత ఆవిడకూడా అన్నంతిని కంచం శుభ్రంగా కడిగి, తుడిచి, అందులోనే వక్కలూ, తమలపాకులూ, పెట్టుకొని గదిలోకివచ్చింది. దీపపుకాంతిలో వెండికంచంగర్వంతో ధగధగ మెరిసిపోతున్నది.

నేను తమలపాకులు నములుతూఅన్నాను, "అయితే, చూడూ, ఎట్లా సంపాదించావు ఇంతడబ్బు. ఏ నెలకానెల నాకు లెక్క జెప్పేదానివే! అదంతా అబద్ధమా ?"

"ఎబ్బే, అబద్ధం ఎందుకు చెపుతానండీ. అంతా నిజమే! ఎట్లాగో కష్టపడి మిగిల్చాను."

"ఏమిటి ఆ కష్టపడటం? నాకు అర్థంకావటం లేదు. కొంచెం చెబుదూ!"

"ఎట్లాగో ఓ అట్లాగు మిగిల్చాను. అదంతా మీ కెందుకూ! ఆడవాళ్ళ రహస్యాలన్నీ చెప్పమంటారేం ?"

"అబ్బ చెబుదూ" అంటూ చేయిపట్టుకు దగ్గరకు లాక్కున్నాను.

"ఆఁహా, చెప్పను" అంటూ నాకుదూరంగానుంచుని, "దానికేంగానీండీ, చూడండి నాయుడుగారి భార్యకు పది రూపాయలు ఇవ్వాలె. ఆవిడ చాలతొందర పెడుతున్నది. మీ దగ్గర డబ్బు ఉన్నట్లుగా ఉంది. ఇచ్చేయండి" అన్నది.

నాకు చాలా ఆశ్చర్యం కలిగింది. నాకు పది రూపాయలు వచ్చినయ్యని ఎట్లా తెలిసింది ఈమెగారికి అప్పుడే.

"నా దగ్గర డబ్బు ఉందని నీకు ఎట్లా తెలిసింది ?" అని అడిగాను.

"అంతమాత్రం తెలియదా ఏమిటండీనాకు" అంటూ ఆవిడ చొక్కా జేబులో చెయిపెట్టి పర్సుతీస్తున్నది.

నాకు ఆ డబ్బు ఎక్కణ్ణో మద్రాసునుంచి వచ్చింది. అప్పుడైనాస్కూల్‌లో యిచ్చిపోయినాడు పోస్టుమాన్, ఈవి

డకు ఎట్లా తెలిసింది. నాకు చాల ఆశ్చర్యంకలిగి "నీకు ఎట్లా తెలిసింది చెప్పు"మని పట్టుపట్టాను. ఆవిడ చెప్పనంటే చెప్ప నన్నది. పైగా, అన్నది. "మీ దగ్గర ఉంటే కర్చులయిపో తుంది. నేను తీసుకొంటాను ఈ పదిరూపాయలూ" అని.

"ఏంజేస్తావూ?"

"చెప్పలేదుటండీ నాయుడుగారి భార్యకు ఇవ్వాలనీ!"

"ఇక తెలిసిందిలే నీ రహస్యం! ఆ నాయుడుగారి భార్యకు నీవు ఎంత ఇవ్వాలిసిందీ నేనే స్వయంగా కనుక్కొని ఇస్తానుండు!" అని అంటూ నవ్వు ఆపుకోలేకపోయాను.

కాంతం కృత్రిమ కోపాన్ని నటిస్తూ. "ఓహో ఇది చాలా బాగుందండోయ్: ఆవిడను మాట్లాడించేరు సధ్యః. ఆవిడకు ఘోషా. ఎవ్వరితోనూ మాట్లాడదు. కోపంకూడా వస్తుంది."

నేను విరగబడి నవ్వాను, ఈవిడ ఆడుతున్న నాటకాన్ని గ్రహించి.

కాంతం పర్సులోనుంచీ నోట్లు లెక్కపెట్టి తీసుకొని, "బాకీ తీర్చేస్తే మర్యాదగాఉంటుంది. రేపు ప్రొద్దున్నే ఆవిడకు పంపించివేస్తాను ఈ పది రూపాయలూ. ఇంకా కాస్తో కూస్తో ఉంటే నెల ఆఖరుకు ఇవ్వవచ్చు లెండి" అన్నది.

నాయుడుగారిభార్య ధర్మమా అంటూ మాకీ కంచం ఏర్పడ్డది. "ప్రతి ఇంటావిడకూ ఇల్లాగ ఒక నాయుడుగారి భార్య ఉంటే సంసారాలు బాగుపడతవిరా అనుకొని నిద్ర పోయాను.

మొహమాటం

శర్మ రైలుదిగి అడుగులో అడుగు వేసుకొంటూ, చాలా దీక్షగా ఆలోచిస్తూ ఇంటివైపుకు నడుస్తున్నాడు.

ఇప్పుడింత మెల్లగా నడుస్తున్నాడుగాని వెళ్ళేటప్పుడు మహాజోరుగా వెళ్ళాడు. శుక్రవారం సాయంత్రం ఆరు గంటల బండికి బయలుదేరి మద్రాసు వెళ్ళాడు. ఒక సినిమా యజమాని అతనిచేత పద్యాలు వ్రాయించే విషయంలో మాట్లాడటానికి రమ్మంటే! చాలా సంతోషంగా వెళ్ళాడు కూడా.

అతను బయలుదేరిన బండి బెజవాడకు రాత్రి ఎనిమిదింటికి చేరుతుంది. మద్రాసు వెళ్ళవలసినవాళ్ళు అంతా ఆ బండికే బయలుదేరుతారు.

అల్లాగ వెళ్ళినవాళ్లు బెజవాడలో ఎనిమిదింటికి దిగి హోటలులో భోజనంచేసి కాసేపు విశ్రాంతి తీసుకొని పదింటికి మద్రాస్ మెయిల్ ఎక్కుతారు. ఈ బండికీ ఆ బండికీ మధ్య రెండు గంటల వ్యవధి ఉంది.

అందుకనే జానకి అతనితో చెప్పింది..."బెజవాడలో బండిదిగి వెంటనే జట్కా అయినా చేసుకొని మా అక్కయ్య గారింటికెళ్ళి ఇవి ఇయ్యండి.....మరిచిపోయి మద్రాసు బండి ఎక్కేరు!

తప్పకుండా ఇయ్యండేం, మద్రాసునుంచివచ్చేటప్పుడు దిగి ఇద్దామనుకోకేం. ఎందుకూ మద్రాసుదాకా ఇవి మోసుకుపోవటం–దారిలో వాళ్ళింట్లో పారేసి పొయ్యేదానికి!

మా అక్కయ్య పిల్లలతో చేసుకోలేక ఓ వంద అప్పడాలు ఒత్తి పంపవే అమ్మాయీ అని అడిగింది. చేతులు పడిపోయేలాగున ఒత్తాను. ఎంత జాగ్రత్తగా తీసుకెడతారో ఏమో, తెలిసిందా అండీ?''

తెలిసిందని శర్మ తల ఊపాడు.

అయినా జానకికి అనుమానమే అతనికి తెలిసిందో లేదోనని! అసలు మామూలు మనిషికి ఉన్న తెలివితేటలు శర్మకు ఉన్నవని ఆ పిల్ల అనుకొని ఉన్నట్లయితే అన్నిసార్లు చెప్పదు. జానకి ఇంకా చెప్పింది.

''చూడండి పై బల్లమీద పెట్టి దిగేటప్పుడు మరచిపోయేరు.''

''స్టేషనులో జనం ఎక్కేటప్పుడు దిగేటప్పుడు సందడిలో ఎవరైనా చేతబట్టుకుపోతారేమో చూస్తుండండి''

''ఆ బుట్టపైన బియ్యపుబస్తాలు పడేస్తారు. దిక్కులు చూస్తూ కూర్చోకండి!''

''ఎప్పుడూ ఆలోచిస్తూ కూర్చోకండి. ఒకటే పరధ్యాన్నంమీకు! ఎవరైనా ఎత్తుకెడుతున్నా ఏమీ తెలియదు మీకు! జాగ్రత్తసుమండీ!''

''బెజవాడలో జాగ్రత్తగా దిగండి. బుట్ట ప్లాట్‌ఫారం మీద ఎవరికైనా అందించి తరువాత మీరు దిగండేం!''

''బుట్ట అందుకొన్నవాణ్ణి కాస్త, ఓ కంటితో చూస్తుండండి—వాడు ఆ పళంగా పట్టుకుపోతాడేమో''

ఇల్లా చెపుతునే ఉంది. జానకి-శర్మ బుట్టా, బెడ్డింగూ జట్కాలో పెట్టుకొని కూర్చున్న తరువాత కూడా శర్మ,

జానకి చెపుతున్న మాటలన్నీ జాగ్రత్తగా వింటున్నాడు. తెలిసిందా అని మధ్యమధ్య జానకి అడుగుతూ ఉంటే, శర్మ తెలిసిందని జవాబులు చెప్పాడు.

తనకు అన్నిసార్లు ఆ విషయాన్ని గురించి చెప్పటం అవసరమేనని శర్మకూడా అనుకొని ఉంటాడు. లేకపోతే విసుక్కునే వాడేగా! జట్కా కనపడుతూ ఉన్నంతసేపూ జానకి అతనివంకే చూస్తూనిలబడి, జట్కామలుపులుతిరిగిన తరువాత నిస్పృహతో లోపలికి వెళ్ళిపోయింది.

శర్మ జట్కాలో కూర్చున్నప్పుడు ఆ అప్పడాలబుట్ట వంకే చూస్తూకూర్చున్నాడు. తన జీవిత సౌఖ్యంఅంతా ఆ బుట్టను జాగ్రత్తగా తీసికెళ్ళి, జానకి అక్కగారికి ఇవ్వటం మీద ఆధారపడి ఉందీ...అని శర్మగ్రహించాడు. బెజవాడ లో దిగి, అవి ఇచ్చేస్తే, అతనికిసగం భారం తీరిపోతుంది. ఆ తరువాత హాయిగా మద్రాసు ప్రయాణంచేయవచ్చు.

౨

శర్మ దురదృష్టము అనండి, ఖర్మం అనండి, ఏమైంది అంటే, ఆనోజు రైలు, అంటే బందరునుంచి బెజవాడపోతున్న బండికౌతరం స్టేషనులో ఉండిపోయింది. ఎదురుగావస్తున్న బండి ఒకటి రైలుపట్టాలమీదనుంచే తొలగిపోయిందట. కౌతరం స్టేషన్నుంచి పనివాళ్ళు వెళ్ళి పట్టాలు బాగుచేసి ఆ రైలును తీసుకొచ్చేసరికి గంటన్నర ఆలస్యం అయింది.

శర్మ బెజవాడచేరేసరికి మెయిల్ రానే వచ్చింది. ఆ మెయిల్‌కు శర్మ వెళ్లితీరాలె. ఈ అప్పడాల బుట్టసంగతే శర్మకు సమస్య అయిపోయింది. దిగి, గవర్నరుపేటలో ఉన్న వదినగారింట్లో ఇచ్చివచ్చే వ్యవధి లేదు. ఎవరికైనా ఇచ్చి పంపుదామన్నా ఎరుగున్నవాళ్ళు ఎవ్వరూ కనిపించలేదు.

ఇక ఆలోచించటానికైనా టైము లేదు, శర్మ ఈబండి దిగి ఆ బండి ఎక్కాడు. అతను కూర్చున్నాడు, బండి కదిలింది. ఇంకేం చేస్తాడూ? ఆ బుట్టకూడా తనతో మద్రాసు రావలసిందే.

తిరుగు ప్రయాణంలో బెజవాడలో దిగి ఆ బుట్టను వదినగారికి ఇయ్యాలె, అదొక్కటే మార్గం. అంతకంటె ఏం చేస్తాడు?

సోమవారం ప్రొద్దున పదిగంటలకు స్కూలుకు అందుకోవాలె, బెజవాడలో దిగటానికి వ్యవధి వుందా? మద్రాసులో ఎప్పుడు ఏ బండికి బయలుదేరితే ఈ పని తను చేయగలుగుతాడు? ఈ ప్రశ్నలన్నీ అతణ్ణి బాధపెట్టినవి.

మెయిల్ కాస్త ఖాళీగానే వుంది. పై చెక్కమీద పరుపు పరచి, రైల్వేగైడు తీసి ఈ ప్రశ్నల కన్నిటికీ సమాధానంకోసం చూశాడు.

శర్మ శనివారం మధ్యాహ్నం మద్రాసు చేరి ఆసాయంత్రమే ఆ సినిమా ఆయనతో చూస్తాడు. ఆ రోజు సాయంత్రం మెయిల్ అందదు. ఆదివారం ఎక్స్‌ప్రెస్ ఎక్కుతాడు. సాయంత్రం నాలుగుగంటలకు బెజవాడ చేరితే ఆ బుట్ట జానకి అక్కకు యిచ్చి ఎనిమిదిగంటలకే బందరుబండి

ఎక్కుతాడు. అయితే ఎక్స్‌ప్రెస్ టైముకు రాకపోవచ్చు. రైలు అన్నతరువాత ఓ గంట ఇటూ రావచ్చుగదా! అట్లాంటప్పుడు ఆదివారంరాత్రి బెజవాడలో వుండిపోయి తెల్లవారుఝామున నాలుగుగంటలబండి అందుకున్నా సోమవారం స్కూలుకు అందుకోవచ్చు.

ఇంత ఆలోచించి అన్నిటికి అన్ని సరిపోయినవని తోచినతరువాత శర్మ మనస్సు కాస్త కుదుటబడ్డది. అంతవరకు ఆతడు ఈబుట్టసంగతి ఎట్లాగాఅని బెంగపెట్టుకొన్నాడు.

"ఈ బుట్ట మా అక్కయ్యకు ఇచ్చి మరీ వెళ్ళండి" అని జానకి చెప్పిన మాట శర్మ చెవులలో గింగురుమంటూనే ఉంది. కాని ఏంజేస్తాడు! రైలు ఇల్లాగ మోసగిస్తుందని అతనికేం తెలుసు? "ఇల్లా అయింది, దిగి వెళ్ళటానికి టైము లేకపోయింది" అని చెబితే, జానకి మటుకు వినకపోతుందా అని శర్మ తనకు తానై ధైర్యం చెప్పుకొన్నాడు.

తన తప్పు ఏమన్నా ఉందా అని శర్మ చాలాతీవ్రంగా ఆలోచించాడు. అతడు బి. ఏ. పరీక్షకు వెళ్ళినప్పుడు గ్రేమేరి యన్సు ఫ్యూనరల్ అనే ఖండకావ్యాన్ని అర్థంచేసుకొంటానికికూడా, ఇంతగా ఆలోచించి ఉండడు.

తెనాలిదాకా ఈ విషయమై ఆలోచించినా ఏమీ తేలలేదు. అప్పుడు శర్మ అక్కడదిగి, కాస్త కాఫీపుచ్చుకొని, మళ్ళీ వచ్చి పడుకొని, దిండుపై తలపెట్టి దీపంవంక చూస్తూ మళ్ళీ ఆలోచిస్తే, చివరకు ఆతనికి ఆకాశవాణి చెప్పినట్లు తోచింది. తన తప్పు ఇందులో కొంచెంకూడా లేదూ అని.

అయితే ఒకటి—

ఇంత అవస్థ తెచ్చి పెట్టుకోకుండా ఉండవలసింది. "ఈ బుట్ట నేను తీసుకొని పోను. మీ వాళ్ళు ఎవరైనా వస్తే వాళ్ళ చేతికిచ్చి పంపు" అని చెప్పి చూడాలిసింది,

ఆ అమ్మాయి బుట్టను జాగ్రత్తగా తీసుకొని వెళ్ళటాన్ని గురించి అన్నిరకాలుగా చెప్పి "తెలిసిందా" అని అడిగినపుడు, "తెలియలేదు"—అని అన్నట్లయితే ఎట్లా ఉండేదో...అర్థమెయిందని గంగిరెద్దులాగ తలఊపక, అదే అతను చేసిన పొరపాటు. అయిపోయిందేమో అయిపోంది. ఇప్పుడు అతడు చేయాల్సినపని ఒకటే. ఆ బుట్టను జాగ్రత్తగా మద్రాసు తీసికెళ్ళి మళ్ళీజాగ్రత్తగా తీసుకొని వచ్చి ఇయ్యవలసినచోట ఇచ్చేయటం. ఆ కర్తవ్యము మాటుప శర్మగట్టిగా గుర్తించాడు. అందుకనే పసిబిడ్డపైన తల్లి చెయ్యివేసి పడుకున్నట్లు శర్మ ఆబుట్టపైన చెయ్యివేసి పడుకున్నాడు!

మద్రాసులో దిగి శర్మ, బుట్టా, బెడ్డింగు, తీసుకోని శాస్త్రిఇంటికి వెళ్ళాడు. శాస్త్రిఇంటికి వెళ్ళటానికి రెండు బలమైన కారణాలున్నవి. హోటలులో ఈ రెండు పడేసి, తాను ఊళ్ళోకి వెళితే హోటల్లో ఎవరైనా, ఆబుట్టలోనుంచి అప్పడాలు కొన్ని తీస్తేతీయవచ్చు. లేకపోతే, ఎవరైనాఎత్తుకొనిపోయినాపోవచ్చు! అంత విలువైన వస్తువులను పదిమంది వచ్చిపొయ్యే హోటల్లో పెట్టడం మంచిది కాదు. శాస్త్రితనకు బాల్యస్నేహితుడు. అక్కడయితే సురక్షితంగా ఉంటుంది. అదీకాక హోటలులో బసచేస్తే రోజుకు [illegible] యిదు రూపాయలు అనవసరమైన కర్చు. శర్మ అందుకనే శాస్త్రిఇంటికి వెళ్ళాడు.

శాస్త్రి, శర్మ చాలాదగ్గర స్నేహితులు. చిన్నప్పుడు చదువుకొన్నారు కూడాను. శర్మ శాస్త్రితోనేగాక, శాస్త్రి భార్యతో కూడా చాలా చనువుగాఉంటాడు. ఆ అమ్మాయి "అన్నయ్యఅన్నయ్య" అంటూ శర్మను ఎంతో ప్రేమగా చూస్తుంది. ఎంతో ఆలోచించి, అక్కడికి వెళ్ళటమే అన్ని విధాల మంచిదని శర్మ నిశ్చయించుకొన్నాడు. శర్మ ఏపనిచేసినా కాస్త వెనకా ముందూ, ఆలోచించే చేస్తాడు.

శర్మనుచూచి ఆ పిల్ల చాలా సంతోషంతో "అన్నయ్య వచ్చాడండి!" అంటూ భర్తతో చెప్పింది. శాస్త్రికూడా చాలా సంతోషించి శర్మను వెంటనేస్నానం చేసి భోజనానికి రమ్మని త్వరపెట్టాడు.

స్నానం అయిపోయింది. స్నేహితులు ఇద్దరూభోజనానికి కూర్చున్నారు. ఇంతలో అమ్మాయి "ఏమండోయ్ !" అని పెద్దగా అరచి పకపక నవ్వటం సాగించింది.

ఏమిటా అని ఇద్దరూ చూస్తుండగానే ఆ అమ్మాయి "నేనింకా చూడనేలేదు. తెలివితక్కువదాన్ని చూశారా అన్నయ్య అప్పడాలు తెచ్చాడండీ మనకు. చెప్పవేం అన్నయ్యా" అంటూ పసిపిల్ల నెత్తుకున్నట్లు ఆ బుట్ట నెత్తుకొచ్చి శాస్త్రికి చూపింది. శాస్త్రి సంతోషించి "శర్మసంగతి నేను చిన్నప్పటినుంచీ ఎరుగుదును. మహాఆర్భాటంగా చెప్పే మనిషికాదు" అన్నాడు. శర్మనవ్వి. ఏంచెపుమా అని ఆలోచిస్తున్నాడు. ఇంతలో శాస్త్రి పెళ్ళాంతో "ఒసి తెలివి తక్కువ మొద్దా, అవి ముందు పెట్టుకొని కూర్చోకు. ఎవ

నైనా వచ్చారాఅంటే గద్ద తన్నుకుపోయినట్లు తన్నుకుపోతారు"—అన్నాడు.

ఆ అమ్మాయి ముసిముసినవ్వులు నవ్వుకొంటూ అప్పడాలు ఒక్కటొక్కటే తీసి లెక్క పెడుతున్నది.

ఇలాగ అప్పడాలన్నీ ముందెట్టుకొని కూర్చోడం శాస్త్రికి ఏమాత్రమూ యిష్టంలేదు. "మన తెలుగువాళ్ళు అయిదారు కుటుంబాలవాళ్ళు వున్నారు. ఈప్రాంతాల వాళ్ళందరూ మన ఇంటికి ఎప్పుడూ వస్తూనేవుంటారు. ఈ అప్పడాలు చూస్తే ఇక బ్రతకనిస్తారా, తలా ఒకటి పట్టుకెళితే అయిపోయె! ఎట్లా నద్దంటాము—ఏమంటావు" అన్నాడు శాస్త్రి శర్మవైపు తిరిగి, ఆసంగతి నిజమేనని శర్మ ఒప్పుకొన్నాడు.

ఈ లోపున ఆ అమ్మాయి ఆ వందా లెక్క పెట్టి ఇంత ముఖం చేసుకొని సంతోషంతో—"వందవున్నాయండీ మనకు మూడునెలలొస్తాయి" అన్నది.

శాస్త్రి ఆ అమ్మాయివంక చిరాకుగా చూస్తూ—"అవునుగాని ఇప్పుడైనా అవి ఎక్కడైనా కనపడనిచోట జాగ్రత్తచెయ్యి" అన్నాడు. ఆ అమ్మాయి ఆ బుట్టాబుట్టా తీసికెళ్ళి కొయ్యపెట్టెలో పెట్టి తాళంవేసింది.

ఆ అమ్మాయి ఎంతో సంతోషించటంచూచి శాస్త్రి "ఏమిటాసంతోషం పట్టలేకుండా ఉన్నావు! తెచ్చాడులే మీ అన్నయ్య కాంగా"! అన్నాడు. "అవునండి సంతోషం అంటే సంతోషం కాదూ, మా అన్నయ్య తెచ్చాడు, నిజమే!...మీవాళ్ళెప్పుడైనా తెచ్చారా?" అని నిలవదీసి

అడిగింది ఆపిల్ల. దాని తరువాత కాసేపు శాస్త్రి, శాస్త్రి పెళ్ళామూ సరదాగా పోట్లాడుకొన్నారు. చివరకు శాస్త్రి అన్నమాట ఏమిటి అంటే, "సరేకాని, మాఅన్నయ్య అప్పడాలు తెచ్చాడని,ఎగిరి, అందరికీచెప్పబోకు పీక్కు-తింటారు" అన్నాడు——ఆపిల్ల ఎవ్వరితోనూ చెప్పకుండా ఉంటానికి ఒప్పుకొన్నది.

"ఇక్కడ దొరికే వస్తువులు కావోయి ఇవి. పాపం మీ చెల్లెలు ఈఅప్పడాలంటే చెవికోసుకొంటుంది" అన్నాడు శాస్త్రి.

"అబ్బ! మీరుమాటుకు! ఈ మద్రాసు అప్పడాలు రుచీపచీ లేవు వెధవవి, మన అప్పడాలు దొరికితే బాగుండునని ఎన్నిసార్లు అన్నారు" అన్నది ఆ అమ్మాయి.

"అయితే ఏం, నాకోసం తెచ్చాడా ఇవి? చెల్లెలు పాపం మద్రాసులో కాపరంచేస్తున్నదని నీకోసం తెచ్చాడు కాని!"——అని వరసలలోకి సరసాలలోకి దించాడు, సంభాషణను శాస్త్రి. ఆ తరువాత ఆ అప్పడాలు ఎవరి కోసం తెచ్చాడూ అన్నవిషయంపై భార్యాభర్తలు ఇద్దరూ కాసేపు వాదించుకొని, చివరకు శర్మనేఅడిగారు——"నిజంచెప్పా నీవు ఎవరికోసం తెచ్చావురా?" అని, శర్మ ఉక్కిరి బిక్కిరిఅయి తెప్పరిల్లి. మర్యాదకోసం,"నీకోసమే తెచ్చానమ్మా శాస్త్రి కేందుకూ, వాడు ఎక్కడబడితే అక్కడ ఏదిబడితే అది తింటాడు" అని సరసం ఆడాడు. అంతా నవ్వుకొన్నారు.

శర్మ నవ్వుతు[illegible]డని, ఆ అమ్మాయీ, శాస్త్రిఅనుకొన్నారు కాని, [illegible]డెలు ఎంత వేగంగా కొట్టుకొం

టున్నారో, వాళ్లు గ్రహించలేదు—ఎట్లాగయితే శర్మకు అప్పడాలు ఒదిలిపోయినయి.

3

శర్మ శీలాన్ని విమర్శించి, మంచివాడనో, తెలివి తక్కువవాడనో, మోమాటం కలవాడనో, గుణవంతుడనో, దద్దమ్మఅనో, ఏదోవిధంగానిర్ణయంచేయవలసినసమయంఇది.

"ఆ అప్పడాలు మనవి కావు అమ్మాయి, మా వదిన గారికి ఇమ్మని మాఆవిడ ఇచ్చింది. ఇయ్యకపోతే మెడకాయ పిసుకుతుంది" 'అని ఒక్కమాట అంటే, ఆ పిల్ల శర్మను చంపేదా! అనలేకపోయినాడు శర్మ.

సినిమా యజమానితో మాట్లాడి అనుకొన్నట్లుగానే ఆదివారం రాత్రికల్లా బెజవాడ చేరాడు—పాపం, ఊళ్ళోకి వెళ్ళాలిసిన అవసరం లేకపోయింది. శర్మగవర్నరుపేట వైపు బిక్కచూపులుచూచి, ఆరాత్రి స్టేషనులో గడిపి, ప్రొద్దున బండిలో ప్రయాణంచేసి బందరుచేరాడు.

గుమ్మంలోకాలు పెట్టటంతోటే ఆ అమ్మాయిముందు అడిగేప్రశ్నే అది—అక్కయ్యకు అప్పడాలు ఇచ్చారా అని ఈ ప్రశ్న వస్తే ఏం జవాబు చెపుదాము అని అయినా శర్మ ఆలోచించుకోలేదు. మద్రాసునుంచి విచారంగా వచ్చాడు. అడగబోయే ప్రశ్న, దానికి జవాబూ అనుకొనిఉంచుకోరూ! అయోమయం మనిషి !

శర్మ మెల్లగా నడుస్తున్నా[illegible]మెల్లిగా నడిస్తే ఉపాయం తోస్తుందీ! దారిలోనే అనుకోవల[illegible] గొప్ప గొప్ప

మొగుళ్ళు అంతా ఇంటికివచ్చేముందు ఒకసారి నిలబడి, ఇంటికి వెళ్ళడంతోనే ఆవిడ ఈ ప్రశ్న అడుగుతుంది, దానికి జవాబు ఇల్లాగ చెబుదాము అని కూడబలుక్కునిగాని గడప తొక్కరుగదా, ఇదెక్కడ పిచ్చి మొత్తుకోళ్ళు ఏఆలోచనా లేకుండా బుడుగు బుడుగున వచ్చి ఇంటిముందు నుంచుని దిక్కులు చూస్తాడేం శర్మ!

ఎంతసేపు ఆలోచించినా అతనికి ఏమీతోచలేదు. సరే ఏమన్నా కానిమ్మని లోపలకు వెళ్ళాడు. ఆ పిల్ల ఎదురుగా వచ్చి చిరునవ్వుతో ఆహ్వానించి, "ఈబండికే వచ్చారా నిన్న అర్ధరాత్రి బండికి వస్తారనుకొన్నాను!'' అన్నది.

శర్మ నవ్వుతూ బెడ్డింగు కూలివాడి నెత్తిమీదనుంచి దింపుకొని, కోటూ, చొక్కా విప్పుతున్నాడు. ఆ ప్రశ్న ఎప్పుడు వస్తుందోనని అతనిగుండె దడదడలాడుతూనేవుంది. ఎల్లాగో నాలుగు మెతుకులు నోట్లో వేసుకొని బయటపడ్డాడా, ఇక సాయంత్రందాకా కనపడడుకదా, దానితరువాత చూచుకోవచ్చు.

ఈ కాసేపు ఆ అమ్మాయిని మాటలలో పెట్టి నవ్వించే నేర్పు అయినా ఉంటే బాగుండును, శర్మ బ్రతికిపోయేవాడు. నాలుగుసార్లు ఆపిల్లను చూచినవ్వాడు! నవ్వించటానికి అదే మార్గం అనుకొన్నాడు ఇంకోమార్గం తెలియక. శర్మకు పోట్లాడటం తెలిసినంత బాగా మాట్లాడటం తెలియదు. ఎంతనవ్వినా గుండెల్లో [illegible]ల్ గుబుల్ అంటూనేఉంది పాపం శర్మకు.

జానకి మాట్లాడటం మొదలుపెట్టే టప్పటికి శర్మ గుండెలు కొట్టుకునేవి—ఆ మాటల సందర్భంలో ఆ ప్రశ్న ఎక్కడ వస్తుందో అని. అందుకే అతడు ముళ్ళమీదకూర్చున్నట్లు కూర్చుని మాట్లాడకుండా భోజనం చేస్తున్నాడు.

జానకి ఇంతసేపు ఆ ప్రశ్న వేయకపోవడము కూడా చిత్రంగా నేవుంది. ఊరుకొనే మనిషి కాదు మరి. ఎందుకు వూరుకుందో ఏమిటోనని శర్మ మరీ భయపడ్డాడు.

"మీరు వెళ్లిన రైలు కొంతరంలో పడిపోయిందటగా" అని అడిగింది జానకి. ఎంతసేపటికి శర్మ మాట్లాడకపోవడం చూచి-పడిపోవడంకాదు. గంటన్నర ఆలస్యముగా బెజవాడ చేరింది. వెంటనే మెయిల్ ఎక్కాను. మీవాళ్ళ ఇంటికి వెళ్ళి వచ్చే వ్యవధి లేకపోయింది"—అన్నాడు శర్మ.

జానకి ఆ శేషప్రశ్న అడక్కపోవడం కూడా కష్టంగానే వుంది. ఏదో అది కాస్తా తేలిపోవాలనే అతను తొందర పడ్డాడని నేను అనుకొంటాను.

అప్పటికే ఆ అమ్మాయి ఆ ప్రశ్న అడక్క "అవును లెండి ఆ సంగతి తెలుస్తూనేవుంది. అయితే ఆ అప్పడాలు మద్రాసు తీసికెళ్ళారా?" అని అడిగింది. శర్మ దీనంగా చూస్తూ, "మరేం జేసేది తీసికెళ్ళాను" అన్నాడు.

జానకి విరగబడి నవ్వి "అయ్యో ఆ బుట్టేసుకొని మద్రాసు పోయినారుటండీ! ఆ బుట్[illegible] మీరూనూ! అందరూ నవ్వలేదూ మీ వాలకం జూ[illegible] తాటాకు బుట్టా మీరూనూ!" అన్నది.

శర్మకు మనస్సు కాస్త కుదుటబడ్డది. ఆ అమ్మాయి అయ్యో నా మొగుడు ఇంత అవస్థ పడ్డాడే, నవ్వులపాలు అయినాడే అని జాలిపడి, చల్లని చూపుచూస్తే అంతేచాలు ననుకొన్నాడు.

నేనైతే ఆమె కళ్ళవెంట నీరు కారేలాగున కథ అల్లే వాడిని. శర్మ ఇంకా ఆరితేర లేదు. చిన్నతనానికి చిన్నతనమూ ఉంది. అదీగాక ఇంకామాటలు రాలేదు మనిషికి, "బెడ్డింగూ బుట్టా తీసుకొని ట్రాము ఎక్కేసరికి అంతా ముసి ముసి నవ్వులు నవ్వుకొన్నారు" అని తల వంచుకొన్నాడు.

జానకి జాలిపడి, "ఆ బుట్టతో ఎక్కడికి వెళ్ళారండీ?" అని అడిగింది ఆదుర్దాగా. "హోటలు కెళ్ళితే మరీ నవ్వుతారని శాస్త్రి ఇంటికి వెళ్ళాను" అన్నాడు శర్మ. శాస్త్రి ఎవరో జానకికి తెలుసు. అతడు కోనసీమనుంచి ఓ వంద సపోటాకాయలు, కొన్ని బత్తాయికాయలూకూడా తెచ్చి యిచ్చాడు ఒకసారి. శాస్త్రి పెళ్ళాము మంగకూడా జానకికి బాగా తెలుసు. అందుకని శాస్త్రి ఎవరని జానకి అడగవలసిన అవసరంకూడా లేకపోయింది.

శర్మ సంగతంతా చెప్పాడు. బుట్టతీసికెళ్ళటం, మంగ "అన్నయ్య అప్పడాలు తెచ్చాడు" అని అంటూ ఆ బుట్టా బుట్టా తీసికెళ్ళి దాచుకోటం, ఆ విషయాలన్నీ చెప్పి, ఇంగ్లీషు సాంప్రదాయాన్ని అ[illegible]రించి, "నాకు చాలా విచారంగా ఉందీ" అన్నాడు.

"విచారం ఎందుకులెండి, అప్పుడాలబుట్టను మీరు, ఎప్పుడైతే మద్రాసు తీసుకొని వెళ్ళి ఉంటారని తోచిందో, అప్పుడే అనుకొన్నా అది మళ్ళీ రావటం కష్టం అని!

అయ్యో! అయ్యో! ఎట్లా తీసికెళ్ళారో అట్లా తీసుకొచ్చే నేర్పు మనకెక్కడది! ఇంకా నయమే మంగ అయినా తీసుకొన్నది. అదీ కొంత మంచిపనే! దానికైనా దక్కినయి. లేకపోతే ఎవరో కాజేసేవాళ్ళు! పసిపిల్లవాడి చేతిలో గారె ముక్క ఉంటుందిటండీ, ఏ కాకో, తన్నుకెళ్ళుతుందిగాని! మీరు సరిగ్గా చేరుస్తారని నే నెప్పుడూ అనుకోలేదులెండి— పైగా విచారంట విచారం!" అని కాసేపు దీర్ఘాలు తీసింది జానకి.

శర్మ ఒక దీర్ఘమైన నిట్టూర్పు విడిచి ఉత్తరీయం ఝాడించి పైన వేసుకొని సిగరెట్టుపీలుస్తూ, స్కూలుకు వెళ్ళిపోయినాడు.

సమాప్తము.

మునిమాణిక్యం నరసింహారావుగారు

కాంతం కథకులనే పేరుతో ప్రసిద్ధులైన ముని మాణిక్యం నరసింహారావుగారు 1898 లో గుంటూరు జిల్లాలో సంగం జాగర్లమూడి గ్రామంలో జన్మించినారు. గుంటూరులోనూ విజయనగరం లోనూ విద్యాభ్యాసం చేసినారు. (బి.ఏ.ఎల్.టి.) బందరు హిందూ కాలేజి హైస్కూలులో చాల కాలము చరిత్రోపాధ్యాయులుగా పనిచేసి రిటైరు అయి విశ్రాంతి పుచ్చుకొంటున్నారు.

మునిమాణిక్యం వారిని చూచి ముసిముసి నవ్వు నవ్వని ఆంధ్రుడు ఉండడు. వీరి రచనలు అన్నీ నవ్వించేవే! గృహజీవితములోని కళాప్రసక్తములైన రసవద్వినోద కలాపాలను కథావస్తువుగా తీసుకొని ఇరవై అయిదు గ్రంథములు వ్రాసినారు. గార్హస్థ్య జీవిత సౌందర్యమును మనోహరంగా ఆవిష్కరణ చేసినారు. ఆంధ్రుల అభిమాన కథకుడు. "కాంతం కథ వ్రాస్తే మునిమాణిక్యమే వ్రాయాలె. మునిమాణిక్యం వ్రాస్తే కాంతం కథే వ్రాయాలె" అన్నారు విమర్శకులు. వీరివలె సాంసారిక జీవితములోని రమణీయ దృశ్యాలను చిత్రించిన వారు ఇంకొకరు లేరు.